ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 162 పేజీలు: 12 వెల: 8.00

భారత్‌లో భారీగా న్యూజిలాండ్ పెట్టుబడులు

నన్ను చంపితే ఇరాన్ పూర్తిగా ధ్వంసమే: ట్రంప్

9లో

## వియత్నాం విషాదం
# సముద్రంలో పడవ బోల్తా

15 మంది భారతీయులు మృతి

వారిలో ఎపికి చెందిన ముగ్గురు

పడవలో మొత్తం 36 మంది

బాధితులకోసం సహాయక కేంద్రాలు ఏర్పాటు

తమ పంపిణిదార్లను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లిన ఓ మొబైల్ కంపెనీ


సముద్రంలో బోల్తా పడిన పడవ

**హనోయ్/న్యూఢిల్లీ:** వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో శనివారం జరిగిన ఘోర పడవ ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు మృతి చెందారు. మృతుల్లో 13 మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ఉన్నారు.కడపజిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీలు మరణించినట్లు ధృవీకరించారు.మరో కడప పంపిణీదారు తీరంలోనే ఉండటంతో ప్రాణాలుదక్కించుకున్నాడు. మరోముగ్గురు ఎపి వాసులు >>2

కడప, మచిలీపట్నం, హిందూపురం వాసులు ముగ్గురు మృతి 2లో

# 'మైక్రో' వద్దు.. ఉమ్మడి ముద్దు



## జనంతోనే అభివృద్ధి, భవిష్యత్తు

యువత నైపుణ్యం, వృద్ధుల అనుభవం సమాజానికి ఆస్తి

పిల్లలే సంపద కార్యక్రమానికి నాంది

ప్రపంచ జనాభా దినోత్సవంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా నియంత్రణ కాకుండా జనాభా సంరక్షణ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సమీప భవిష్యత్తులోనే 'పిల్లలే సంపద' అనే మాటను నిజం చేసి చూపుతామని సిఎం అన్నారు. విజయవాడలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గతంలో జనాభా నియంత్రణ కోసం ప్రభుత్వాలు పనిచేశాయని దీని కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు కలిగిన వారిని అనర్హులు చేస్తూ నిబంధనలు కూడా తెచ్చామని... ప్రస్తుతం పరిస్థితులు మారాయని సిఎం స్పష్టంచేశారు. దీనికి అనుగుణంగా ఇప్పుడు విధానాలను మార్చుకోవాల్సిన తరుణం వచ్చేసిందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఫెర్టిలిటీ రేట్ గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉందని... భవిష్యత్తులో జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తుగా పరిస్థితులు మారతాయని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 40కి పైగాదేశాల్లో జనాభా తగ్గిపోతోందని ఆయనఅన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "పిల్లలే సంపద కార్యక్రమానికి ఇవాళ్టి నుంచే నాంది పలకాలని భావిస్తున్నాం. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరో మారు గుర్తు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. జనాభా నియంత్రణ కాదు జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. గతంలో జనాభా నియంత్రణపై ఆలోచన చేశాం. దానికి అనుగుణంగా ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టాయి.

మహిళల్లో అక్షరాస్యత పెరిగితేనే జనాభా నియంత్రణ సాధ్యమని అప్పట్లో ఆలోచన చేశాం. స్థానిక సంస్థల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలుఉంటే పోటీకి అనర్హత అనే నిబంధనలు కూడా పెట్టాం. ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి, ముగ్గురు వద్దు అనే లాంటి ప్రచారాలు కూడా >>2



దిగ్గజ గాయని 'నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా'

# ఎస్ జానకి ఇక లేరు

## మైసూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

48 వేలు పైగా పాటలు పాడిన గొప్ప గాయని

4 జాతీయ, 10 నంది అవార్డులు ఆమె సొంతం

కేరళం ప్రభుత్వం నుంచి 11 అవార్డులు

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** సుప్రసిద్ధ నేపథ్య గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని తన సొంత ఇంట్లో వుండగా శనివారం సాయంత్రం గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు వెంటనే అపోలో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె వయస్సు 88 యేళ్లు. జానకి పూర్తి పేరు శిష్టా శ్రీరామమూర్తి జానకి. ఎపిలోని గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్లలో ఆమె 1938 ఏప్రిల్ 23న శ్రీరామ మూర్తి, సత్యవతి దంపతులకు జన్మించారు. జానకి తండ్రి ఉపాధ్యాయుడుగా ఆయుర్వేద వైద్యుడి గా సేవలందించారు. ఆ సమయంలో జానకి తండ్రి ఉద్యోగరీత్యా కొంత కాలం కరీంనగర్‌లోని సిరిసిల్లాలో పనిచేశారు. చిన్నతనం నుంచే సంగీతంపై మక్కువ పెంచుకున్న జానకి మూడేళ్ల వయస్సులోనే వేదికలపై పాటలు పాడేవారు. నాదస్వర విద్వాంసుడు పైడిస్వామి వద్ద జానకి సంగీత సాధన చేసి గాయనిగా పేరు సంపాదించారు. అప్పట్లో లతా మంగేష్కర్, జిక్కి, లీల వంటి గాయకులు ఆలపించిన పాటలను జానకి వివిధ కార్యక్రమాల్లో ఆలపించి అందరి మన్ననలు అందుకున్నారు. 19 ఏళ్ల వయస్సులో తన మామయ్య సూచన మేరకు చెన్నై చేరుకున్న జానకి ఎవిఎం స్టూడియోలో తొలిసారిగా గాత్రాన్ని విపించారు. దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంలో 50 వేల పాటలు పాడిన >>2



## డి.సిఎం పవన్‌కు ముంబయిలో శస్త్రచికిత్స

కుడి భుజానికి మూడున్నర గంటలు సర్జరీ

**విజయవాడ,జులై11, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి శనివారం ఉదయం ముంబయిలో శస్త్ర చికిత్స జరిగింది. ఆయన రెండు భుజాలకు రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్ తీవ్రంగా ఉన్నాయి. ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు వీలైనంత త్వరగా శస్త్ర చికిత్స అవసరమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. అప్పటికే పవన్ కల్యాణ్ నిర్వహించాల్సిన అధికారిక కార్యక్రమాలు నిర్ణయం అయినందున వాటిని ముగించుకొన్న తరువాత శస్త్రచికిత్స చేయించుకొంటాను అని పవన్ కల్యాణ్ వైద్యులకు >>2

## సముద్ర రక్షణలో భారత్‌కు కొత్త శక్తి

అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని నౌకాదళంలో ప్రవేశపెట్టిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఆత్మనిర్భర్ భారత్‌కు మరో మైలురాయి


'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'


శనివారం విశాఖలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని నౌకాదళానికి అందజేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

**విశాఖపట్నం, జులై 11, ప్రభాతవార్త :** భారత నౌకాదళ శక్తిని మరింత పటిష్ఠం చేస్తూ స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన అత్యాధునిక స్టెల్త్ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' శనివారం విశాఖలో ఘనంగా భారత నౌకాదళంలో చేరింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో జరిగిన కమిషనింగ్ కార్యక్రమం భారత రక్షణ రంగ స్వావలంబనకు మరో చారిత్రక ఘట్టంగా నిలిచింది.75 శాతానికి పైగా స్వదేశీ విడిభాగాలతో నిర్మితమైన ఈ యుద్ధనౌక ప్రాజెక్ట్ 17ఎ కింద రూపొందించిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్. భారత నౌకాదళ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేయగా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. సుమారు 6,670 టన్నుల సామర్థ్యంతో, గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించే ఈ యుద్ధనౌక వైమానిక, సముద్ర ఉపరితల, జలాంతర్గామి దాడులను సమర్థంగా తిప్పికొట్టే అత్యాధునిక సామర్థ్యాలనుకలిగిఉంది. ఈ సంద >>2

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రులు పార్థసారధి, సత్యప్రసాద్ హామీ

21న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం


శనివారం మీడియా సమావేశంలో మంత్రులు పార్థసారధి, సత్యప్రసాద్

**విజయవాడ:జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని సమాచారపౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి,రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌లు స్పష్టం చేశారు.ఎపి సచివాలయంలో ఎపి జెఎసి అమరావతి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివారం ఇరువురు మంత్రుల నేతృత్వంలో సమావేశమై ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రాధమికంగా చర్చించారు. ఈసమావేశం అనంతరం మంత్రులు ఇరువురు మీడియాతో మాట్లాడగా ముందుగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఈసమావేశంలో రాష్ట్ర ఆర్ధిమంత్రి వర్యులు పయ్యావుల కేశవ్ హాజరు కావాల్సి ఉండగా ముందస్తు కార్యక్రమాలు మూలంగా ఆయన రాలేక పోయారని స్పష్టంచేశారు.గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా సమస్యలను ప్రక్కన పెట్టడంతో ఈసమస్య వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మొత్తం 23 డిమాండ్లను ఇవ్వడం జరిగిందని వాటన్నిటినీ మంత్రులు ఇరువురం క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని ఉద్యోగుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి పూర్తి సానుకూలంగా ఉన్నారని అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను కూడా >>2

## నాగరాజు పోలీస్ కస్టడీ విచారణపై సుప్రీంకోర్టుకు సిట్

**విజయవాడ.జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో తీవ్ర సంచలనం సృష్టించిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక మాజీ సిఐ నాగరాజు పోలీస్ కస్టడీ విచారణపై రాష్ట్ర హైకోర్టు విధించిన కఠినమైన నిబంధనలను సవాలు చేస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు పెట్టిన కొన్ని నిబంధనలు దర్యాప్తు స్వేచ్ఛను హరించేలా ఉన్నాయంటూ ప్రభుత్వం ఈ పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేసింది. ముఖ్యంగా నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న హైకోర్టు షరతును సిట్‌అధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల అత్యంత కీలకమైన ఈ కేసు దర్యాప్తులో గోప్యతదెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కరోనా వ్యాప్తికి అడ్డుకట్ట వేయండి

## నిబంధనలు కచ్చితంగా పాటించండి: మంత్రి సవిత

**విజయవాడ, జులై 11,ప్రభాతవార్తప్రతినిధి:** కడప జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశించారు. అదే సమయంలో కరోనా నివారణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కొవిడ్ 19 నిబంధనలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శ్రీధర్‌ను, డిఎంహెచ్ఒ రవిబాబును ఫోన్లో ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కడపలో ఎనిమిది కరోనా కేసులు నమోదు కావడమే కాకుండా ఇద్దరు మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ 19 నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. స్థానికుల్లో కరోనా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, ఆసుపత్రుల వద్ద మాస్క్‌లు వాడకం తప్పనిసరి చేయాలన్నారు. జ్వరం, దగ్గు, ఇతర కోవిడ్ లక్షణాలున్న వారిని గుర్తించి ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్, డిఎంహెచ్ఒ రవిబాబు మాట్లాడుతూ, ఎనిమిది కరోనా కేసులు మినహా కొత్తగా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుత కరోనా వెరియంట్ వ్యాప్తిపై శాంపిళ్లను పూణే ల్యాబ్‌కు పంపామన్నారు. ప్రస్తుతం నమోదైన కరోనా వేగవంతంగా వ్యాప్తి చెందుతుందా... నెమ్మదిగా సోకుతుందా? అనేది ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టులో వెల్లడవుతుందన్నారు. ఇప్పటికే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టామని, బ్లీచింగ్ వెదజల్లామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కరోనా నమోదైన కుటుంబాల్లో సభ్యులకు కూడా తక్షణమే పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ >>2

# తుపాకీ కంటే కలం గొప్పది


శనివారం 3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలో ప్రసంగిస్తున్న మంత్రి అనిత

పుస్తకమే సమాజాన్ని మారుస్తుంది

తెలుగు భాష, మహిళా గౌరవ పరిరక్షణ

ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత

3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభల్లో హోంమంత్రి అనిత

**విజయవాడ,జూలై 11వ,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలకు మాత్రమే కాదు... అబ్బాయిలకు కూడా విలువలు, గౌరవం నేర్పించే సమయం వచ్చిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.'అమ్మ' అనే ఒక్క పదంలోనే తెలుగు మమకారం, సంస్కృతి, ఆత్మీయత అంతా నిక్షిప్తమై ఉంది"ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత విద్యాశాఖా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా నిర్వహించిన 3వ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలు-2026'లోహోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు భాష, సాహిత్యం, మహిళా సాధికారత, పుస్తక పఠనం, సామాజిక విలువలు, మహిళల గౌరవ పరిరక్షణ వంటి అంశాలపై మంత్రి మాట్లాడుతూ దివిసీమ గాంధీగా పేరుపొందిన మండలి వెంకట కృష్ణారావు తెలుగుభాష, తెలుగు సంస్కృతి, సామాజిక సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. 1975లో హైదరాబాద్‌లో జరిగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో కీలకపాత్రపోషించి, ప్రపంచవ్యాప్తంగాఉన్న తెలుగు వారిని ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలుగు భాషకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో ఆయన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మండలి కుటుంబం తెలుగు భాషా పరిరక్షణను వారసత్వంగా కొనసాగిస్తోందని పేర్కొంటూ మండలి బుద్ధప్రసాద్ గారిని అభినందించారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో డిప్యూటీ స్పీకర్‌గా >>2




శనివారం విశాఖపట్నంలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

# సముద్రంలో పడవ బోల్తా

>> ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పర్యాటకులతో ప్రయాణిస్తున్న పడవ బలమైన గాలులు, అలల కారణంగా బోల్తా పడింది. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 36 మంది ఉన్నారు.ప్రమాదం అనంతరం 21 మందిని సహాయక బృందాలు రక్షించి ఆస్పత్రులకు తరలించాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వియత్నాం ప్రభుత్వ మీడియా వెల్లడించింది. మిగిలిన వారి కోసం స్థానిక అధికారులు గాలింపు, సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.స్థానిక మీడియా కథనాల ప్రకారం పడవలో 32 మంది భారతీయ పర్యాటకులు, ముగ్గురు సిబ్బంది, సహాయకుడు ప్రయాణిస్తున్నారు. హాన్ మే రుట్ న్హోయ్ ద్వీపం నుంచి అన్ థోయ్ నౌకాశ్రయానికి బయలుదేరిన కొద్దిసేపటికే బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా పడవ బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు, సిబ్బంది అంతా నీటిలో పడిపోయారు.ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, స్థానిక అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారని తెలిపింది. బాధితులకు అవసరమైన కాన్సులర్ సేవలు అందించేందుకు భారత రాయబారి, రాయబార కార్యాలయ అధికారులు ఫు క్వోక్ ద్వీపానికి బయలుదేరినట్లు వెల్లడించింది. దక్షిణ భారతానికి చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు, ఉద్యోగులు మొత్తం 110 మంది విహారయాత్ర కోసం వియత్నాం వెళ్లినట్లు సమాచారం.ఈ విషాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రిత్వ శాఖ వియత్నాం అధికారులతో సన్నిహితంగా పనిచేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఇంకా గల్లంతైన వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ప్రమాదంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు ఉన్నారని సమాచారం నేపథ్యంలో ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుంచి వివరాలు కోరారు. విహారయాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన కొందరు ఈ ప్రమాదంలో చిక్కుకుని ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపినట్లు సమాచారం.బాధితులు, వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.

ఒక మొబైల్‌కంపెనీ భారత్‌నుంచి తమ పంపిణీదారు కుటుంబాలను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లింది. మొత్తం 250 మంది ఈ యాత్రకువెళ్లారు. ఏపీనుంచి 35, తెలంగాణనుంచి 40 మందివరకు ఉన్నారు. ట్రిప్‌లోభాగంగా మూడుపడవల్లో సముద్రంలో విహార యాత్రకువెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో హాన్‌మేరుట్‌నుంచి అన్‌థోయ్‌పోర్టుకు ఒక స్పీడ్‌బోట్ బయలుదేరింది. అందులో 32 మంది భారతీయులు నలుగురు సిబ్బంది ఉన్నారు. పడవ తీరానికి 400మీటర్ల దూరంలోఉండగా ఒక్కసారిగా బోల్తాపడింది. దీనితోప్రయాణీకులు నీటిలోమునిగిపోయారు. సమీపంలోని ఇతర పర్యాటక బోట్లనిర్వాహకులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలుచేపట్టారు. గల్లంతయిన వారికోసం గాలింపు జరుగుతోంది. బోటులో ప్రయాణించిన 32 మంది ప్రయాణికుల జాబితాను భారత రాయబార కార్యాలయం విడుదలచేసింది.

# కడప, మచిలీపట్నం, హిందూపురం వాసులు ముగ్గురు మృతి



మృతి చెందిన శ్రీధర్ (ఫైల్)



మృతిచెందిన జయశ్రీ (ఫైల్)

**విజయవాడ, జులై 11, ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాం ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో స్పీడ్ బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది భారత టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు టూరిస్టులున్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ మరణించారు. కడపకుచెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డునఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. మరొకరు బందరువాసి గెల్లి కిశోర్‌కు తీవ్ర అస్వస్థతకుగురై పరిస్థితి విషమంగా ఉంది.

**సంఘటనపై మంత్రి లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి, తక్షణ సాయం కోసం ఆదేశాలు**

వియత్నాంలో జరిగిన బోటు ప్రమాదంపై అక్కడి భారత ఎంబసీ అధికారులతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌మాట్లాడారు. తక్షణ సాయం అందేలా చూడాలని లోకేష్ కోరారు. తెలుగు వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు. వియత్నాంలో జరిగిన బోటు ప్రమాద ఘటనపై దేశ, రాష్ట్ర ఉన్నతాధికారు లతో మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. ఢిలీంలలోని ఎపి భవన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన వారు ప్రాణాపాయంలో చిక్కుకున్నారన్న సమాచారంపై అధికారులను వివరాలు ఆరా తీశారు. ఎపినుంచి విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులు ప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోందని అధికారులు తెలిపారు. బోటు ప్రమాదంపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. కేంద్రం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు సహాయం అందించాలని లోకేష్ సూచించారు.

# కరోనా వ్యాప్తికి అడ్డుకట్ట వేయండి

>>నమోదయితే వారిని కూడా ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. నెగిటివ్ వస్తే... కొద్ది రోజుల పాటు వారి ఇళ్లల్లోనే ఐసోలేషన్‌లో ఉంచాలని తెలిపారు. మరోమరణం సంభవించకుండా, ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఉన్నవారికి మెరుగైన వైద్యసేవలుఅందించాలని, జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌ను, డిఎంహెచ్ఒ రవిబాబుకు మంత్రి సవిత ఫోన్లో స్పష్టంచేశారు. వియత్నాం సందర్శనకు వెళ్లిన కడప వాసి, ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో ముడియం శ్రీధర్ సహా 15 మంది మృత్యువాతపడడం బాధాకరమన్నారు. సంతోషంగా ముగియాల్సిన విదేశీ టూర్ విషాదంగా ముగియడంపై ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని మంత్రి సవిత వ్యక్తంచేశారు.

# 'మైక్రో' వద్దు.. ఉమ్మడి ముద్దు

>> చేశాం. 20 యేళ్ల క్రితం ఐటి లాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని సంపద సృష్టించాం. అప్పుడు ఐటి, ఇప్పుడు ఎఐ గురించి మాట్లాడుతున్నాను. జనాభా నిర్వహణ గురించి కూడా చర్చిస్తున్నాం. ఆడబిడ్డల్ని చదివిస్తేనే కుటుంబానికి ఆస్తి, గతంలో వరకట్నం ఉండేది ఇప్పుడు ఎదురు కట్నం అనే పరిస్థితి వచ్చింది. అందుకే మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ గురించి మాట్లాడుతున్నాం. టోటల్ ఫెర్టిలిటీ రేటు మన రాష్ట్రంలోనూ పెరగాల్సి ఉంది. ఎలాంటి అభివృద్ధి అయినా జనాభా ఉంటేనే అది సార్థకం అవుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు.


ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో జనాభా గణనీయంగా తగ్గిపోతోంది. భారత్‌లో దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి కూడా అదే. మన అభివృద్ధి సంతులనం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం. అంగన్‌వాడీలు, పాఠశాలల్లోనూ చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ప్రతీ వంద మంది జనాభాలో 89శాతం మందికి రెండో సంతానం లేదు. ఎపిలోని విశాఖ లాంటి జిల్లాల్లోనూ ఫెర్టిలిటీ రేటు అతి తక్కువగా ఉంది. ఎపి విస్తీర్ణంలో 7 స్థానంలో ఉన్నా పాపులేషన్ డెన్సిటీలో దిగువన ఉన్నాం. పిల్లలే మన రాష్ట్ర సంపద. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఆర్థిక ప్రగతి సాధించేలా రాష్ట్రంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తున్నాం. పీ4 ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచుతున్నాం. అభివృద్ధి ప్రాజెక్టులు కూడా సమతూకంలో జరగాలనే అన్ని ప్రాంతాలకూ పరిశ్రమలు, ప్రాజెక్టులు వచ్చేలా చూస్తున్నాం. ఆర్థిక అసమానతలు తగ్గించి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జనాభా సంరక్షణ అనేదే ఈ సమయంలో కీలకం. జనాభా పెంచాలని మాట్లాడితే విమర్శలు వచ్చాయి. పిల్లలను పెంచటం అనేది కేవలం మహిళలు ఒక్కరిదే బాధ్యత మాత్రమే కాదు అది ఉమ్మడి బాధ్యత. కాన్పుల్లో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలి. మహిళల ఆరోగ్య రక్షణ అత్యంత కీలకం. జనాభా నిర్వహణ ఇక ఓ వాస్తవిక అంశం అని గుర్తించాలి. సంతానం వద్దనుకునే దంపతులు పెరగటం దురదృష్టకరం. మైక్రో ఫ్యామిలీలు వద్దుభారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థే ప్రపంచానికి ఆదర్శం. పిల్లలే సంపద ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష" అని ముఖ్యమంత్రి వివరించారు

**సామాజిక మాధ్యమాలతో మానసిక సమస్యలు..**

"ఇవాళ తెలంగాణాలో జరిగిన ఘటన అత్యంత బాధాకరం. పోక్సో కేసులో ఉన్న నిందితుడు తనపై కేసు పెట్టిన వారి కుటుంబంలో 6 గురిని హత్య చేశాడు. అత్యంత దారుణమైన ఘటన ఇది. సామాజిక మాధ్యమాలు బాధ్యతారహితంగా వినియోగించటం, అసభ్యకరమైన, హింసాత్మక దృశ్యాల కారణంగా మానసిక సంతులన కోల్పోతున్నారు. విలువైన సమయాన్ని కూడా వృధా చేసుకుంటున్నారు. సోషల్ మీడియా వ్యసనంగా మారితే ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతాయి. టెక్నాలజీ స్పిర్చువాలిటీ ద్వారా యువతకు ప్రపంచాన్ని జయించే శక్తి సొంతం అవుతుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సంజీవని కార్యక్రమం చేపట్టాం. యువతతో పాటు వృద్ధులు సమాజానికి ఆస్తిగా తయారు కావాలి. త్వరలో ప్రభుత్వం వృద్ధుల కోసం క్షేమం అనే కార్యక్రమాన్ని తీసుకురావాలని ఆలోచన చేస్తోంది. నిరంతరం నైపుణ్యాలను అందిపుచ్చుకుంటేనే అత్యుత్తమ మానవ వనరులు దేశానికి అందుతాయి. టెక్నాలజీ నాలెడ్జ్ ఉన్న దేశంలో చాలా రంగాల్లో నాయకత్వ లేమి ఉంది. అంగన్‌వాడీల నుంచే పిల్లల ఆరోగ్యంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. పాఠశాలల్లో విద్య అందించడంతో పాటు తల్లికి వందనం కింద ప్రతీ బిడ్డకూ రూ.15వేల చొప్పున ఇస్తున్నాం. 2047 నాటికి మన తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేర్చాలన్నదే నా సంకల్పం. జనాభా లేకపోతే మనం చేసుకున్న అభివృద్ధి లక్ష్యాలను సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించే సత్తామనకుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనంతరం పాపులేషన్ మేనేజ్మెంట్ ఫ్రేమ్ వర్క్ డాక్యుమెంటేషన్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, వైద్యారోగ్యం కుటుంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీషా తదితరులు హాజరయ్యారు.

# సముద్ర రక్షణలో భారత్‌కు కొత్త శక్తి

>> ర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "ఐఎన్ఎస్ మహేంద్రగిరి కేవలం యుద్ధనౌక మాత్రమే కాదు.. సాంకేతికంగా అత్యాధునిక, యుద్ధ సన్నద్ధ భారత నౌకాదళ నిర్మాణానికి ప్రతీక. ఇది ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి మరో గర్వకారణం" అని పేర్కొన్నారు.ఈ నౌకలో బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు, మధ్యశ్రేణి వైమానిక రక్షణ క్షిపణులు, జలాంతర్గామి నిరోధక ఆయుధాలు, అత్యాధునిక రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, మల్టీ రోల్ హెలికాప్టర్, అత్యాధునిక స్టెల్త్ సాంకేతికతను అమర్చారు. దీంతో భారత సముద్ర సరిహద్దుల రక్షణతో పాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఆధిపత్యం మరింత బలోపేతం కానుంది.డ్రోన్లు, కృత్రిమ మేధస్సు, సైబర్ యుద్ధం, హైపర్‌సోనిక్ ఆయుధాలు వంటి ఆధునిక సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో తదుపరి తరం సాంకేతికతలో భారీగా పెట్టుబడులు పెడుతూనే సంప్రదాయ సైనిక సామర్థ్యాలను కూడా మరింత బలోపేతం చేస్తామని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "భవిష్యత్ యుద్ధాలు కృత్రిమ మేధస్సుతో సాగవచ్చు.. కానీ విజయాన్ని అందించేది దేశభక్తి, శిక్షణ పొందిన సైనికులే" అని అన్నారు.భారత్ హిందూ మహాసముద్ర ప్రాంతంలో విశ్వసనీయ భద్రతా భాగస్వామిగా ఎదిగిందని, సముద్ర దోపిడీ నిరోధక చర్యలు, విపత్తు సహాయక కార్యక్రమాలు, సంక్షోభ ప్రాంతాలనుంచి భారతీయులు, విదేశీయుల తరలింపులో భారత నౌకాదళం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన కొనియాడారు.తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరుతో నామకరణం చేసిన ఈ యుద్ధనౌక నిర్మాణంలో 200కు పైగా భారతీయ పరిశ్రమలు, అనేక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు భాగస్వామ్యం కావడం దేశీయ రక్షణ తయారీ రంగానికి నూతన ఉత్సాహాన్ని అందించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, తూర్పు నౌకాదళ కమాండ్ ఇన్‌చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ ప్రతినిధులు, నౌకాదళ ఉన్నతాధికారులు, మాజీ సైనికాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



# రాధా గాయత్రి భర్త శ్రీచరణ్ అరెస్ట్

**అదుపులోకి తీసుకున్న డెహ్రాడూన్ పోలీసులు**

**విశాఖపట్నం, జులై 11, ప్రభాతవార్త :** మస్సోరీలోని కియానాహోమ్‌స్టేలో అనుమానాస్పద పరిస్థితుల్లో రాధాగాయత్రి మృతిచెందిన కేసులో ఆమెభర్త శ్రీచరణ్‌ను డెహ్రాడూన్ పోలీ సులు అరెస్టు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డెహ్రాడూన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, చరణ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ పొందారు. అనంతరం నిందితుడిని న్యూఢిల్లీలో అదుపులోకి తీసుకుని మసూరీకి తరలించారు. కోర్టులో హాజరుపరచగా,న్యాయస్థానం 14రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ జిల్లా కారాగారం సుద్ధోవాలాకు తరలించాలని ఆదేశించింది.

## వారం - వర్జ్యం

12-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
త్రయోదశి రా. 10.29
రోహిణి ఉ. 8.28, మృగశిర తె. 5.41
వర్జ్యం : మ. 1.25-మ. 2.50
శుభసమయం : ఉ. 8.00-9.00
దు.సా. 4.55-సా. 5.47
రాహుకాలం - సా. 4.30-6.00

## వారఫలం

**మేషం:** అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారితీస్తాయి. వస్త్రలాభం కలదు.

**వృషభం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మిథునం:** విమర్శలను లెక్కచేయక మీ ఆలోచనలకు రూపకల్పన చేస్తారు. జీవిత భాగస్వామితో సంయమనం పాటించడం మంచిది.

**కర్కాటకం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ఋణాలు తీరుస్తారు.

**సింహం:** పాతబాకీలు వసూలవుతాయి. ఓర్పుతో ముందుకు సాగుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య:** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. వృత్తిలో పురోభివృద్ధి సాధిస్తారు.

**తుల :** పనులలో ఆటంకాలు ఎదురైనా అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. స్వల్పధన లాభం పొందుతారు.

**వృశ్చికం:** ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. పై అధికారులతో మెలకువగా వ్యవహరించండి.

**ధనుస్సు:** ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ముఖ్యమైన విషయాలు వాయిదా వేయడం మంచిది.

**మకరం:** సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్ఠి సాగిస్తారు. ఏకాంత చర్చలకు అనుకూలమైన సమయం కలదు.

**కుంభం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలుగుతుంది. కోర్టుకేసుల నుండి బయటపడతారు.

**మీనం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. స్త్రీ మూలంగా ధనలాభం పొందుతారు. స్థలాలు కొనుగోలుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



పాట్నాలో శనివారం భారీ వరదల మధ్య రోడ్లపై అవస్థలు పడుతున్న జనం

# పవన్‌కు ముంబయిలో శస్త్రచికిత్స

>> తెలియచేశారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్ర చికిత్స చేయడం వల్ల నొప్పి తీవ్రత భరించలేని స్థాయిలో ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో కుడి భుజానికి సంబంధించిన రొటేటర్ కఫ్ ఇంజ్యూరీకి శనివారం ఆపరేషన్ చేశారు. ముందస్తుగా చేయాల్సిన వైద్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. శనివారం రోజున నిర్వహించిన ఆపరేషన్‌కు మూడున్నర గంటల సమయం పట్టినట్లు వైద్యులు తెలిపారు. మరో భుజానికి రెండు నెలల వ్యవధిలో శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. పవన్ కల్యాణ్ 2016లో భుజానికి గాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు తగిన విశ్రాంతి అవసరం అని సూచించినా సమావేశాలలో పాల్గొన్నారు. 2018లో చేపట్టిన పోరాట యాత్ర సందర్భంలో జనసేన పార్టీ శ్రేణులు తమ అభిమాన నాయకుడికి దగ్గరగా వెళ్లి చేతులు కలపాలి అనే ఉద్దేశంతో చేతులు పట్టి లాగేవారు. ఆ సందర్భంలో నొప్పి కలిగినా భరించేవారు. ఈ యాత్రల్లో అభిమానులు దూసుకువచ్చి మరీ పవన్ కల్యాణ్‌తో కరచాలనం చేయాలని ఉత్సాహంతో చేతులు గుంజేవారు. అప్పుడు నొప్పి విపరీతంగా వచ్చినా పంటి బిగువున భరించారు. ఆ తరవాత కూడా ఆ గాయాలను అశ్రద్ధ చేశారు. 2019 ఎన్నికల అనంతరం రాయలసీమ జిల్లాల్లో.. ముఖ్యంగా మదనపల్లెలో టమోటా రైతుల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లిన సందర్భంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పవన్ కల్యాణ్‌కి చేరువగా వెళ్లి కరచాలనం చేయడం, ఆప్యాయంగా హత్తుకొనే సందర్భాల్లో గాయాలు తిరగబెట్టాయి. అయినా పట్టించుకోలేదు. గత సార్వత్రిక ఎన్నికలు, అంతకు ముందు వారాహి యాత్ర సందర్భంలోను అభిమానులు కరచాలనం కోసం దూసుకు వచ్చేవారు. గాయాల వల్ల నొప్పి వస్తున్నా భరించారు. ఏప్రిల్ మాసంలో పవన్ కల్యాణ్ ముక్కుకి శస్త్ర చికిత్స చేసే సందర్భంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంలో భుజాలకు రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్, మజిల్ టేర్స్ తీవ్ర స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఇంత తీవ్ర గాయాలు ఉన్నప్పటికీ ఏ విధంగా భరిస్తున్నారు అని వైద్యులు ఆశ్చర్యపడ్డారు. వీటికి వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని అప్పుడే వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే కొద్ది వారాల కిందట ముంబయిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో భాగంగా శనివారం కుడి భుజానికి ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతోంది.

# వియత్నాం బోటు ప్రమాదంపై సిఎం తీవ్ర విచారం

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాంలో జరిగిన పర్యాటక బోటు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందడం పట్ల సిఎం చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి మొత్తం 33 మంది వియత్నాం పర్యటనకు వెళ్లగా, వారిలో 19 మంది ప్రమాదానికి గురైన బోటులో ఉన్నారు. ఈ ప్రమాదంలో కడప జిల్లాకు చెందిన ముడియం శ్రీధర్, కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి జయలక్ష్మి, సత్యసాయి జిల్లాకు చెందిన నల్లపేట ఆదిశేషయ్య రవి తేజ మృతి చెందారు. కృష్ణా జిల్లాకు చెందిన గెల్లి కిశోర్ తీవ్ర అస్వస్థతతో ఐసియులో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారందరూ సురక్షితంగా ఉన్నారు. విహారయాత్రకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, ప్రాణాలతో బయటపడిన వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉండాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు వెంటనే అందించాలని సిఎం ఆదేశించారు. ఢిల్లీలోని ఎపి భవన్ అధికారులు వియత్నాం ప్రభుత్వ అధికారులు, అక్కడి భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే మృతదేహాలను స్వదేశానికి త్వరితగతిన తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ఎస్ జానకి ఇక లేరు

>> జానకి 'సౌత్ ఇండియా నైటింగేల్'గా ప్రసిద్ధి పొందారు. గత జనవరి నెలలో ఆమె కుమారుడు మురళీకృష్ణ (65) మరణించడంతో మనో వేదనతో బాధపడుతున్న జానకి చివరకు ఇదే కారణంగా గుండెపోటుకు గురై కన్ను మూశారు. దక్షిణాది దిగ్గజ గాయకులు ఎస్‌పి బాలసుబ్రమణ్యం, పి. సుశీలతో కలిసి జానకి వేలాది పాటలు పాడిన ఘనాపాటిగా పేరొందారు. 1957లో చెన్నైలోని ఎవిఎం స్టూడియోలో స్టాఫ్ సింగర్‌గా తన గాన ప్రయాణాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె పాడిన తొలిపాట తమిళంలో విదియిన్ విలయాట్టు సినిమాలోని విషాద గీతం. తెలుగులో తొలి పాట పెండ్యాల నాగేశ్వరరావు సంగీత దర్శకత్వంలో వచ్చిన ఎంఎల్ఎ సినిమాలోని నీ ఆశ అడియాస అనే పాట. ఈ పాటను ఘంటసాలతో కలిసి పాడారు. 1970 నుంచి 1990 వరకు దక్షిణాది రాష్ట్రాలలో మహిళా గాత్రానికి ప్రధాన స్తంభంగా ఆమె నిలిచారు. నా దస్వరం, వేణువు, షెహనాయ్ వంటి సంగీత వాయిద్యాలతో పోటీపడి పాడగల అరుదైన గాత్ర ప్రతిభ జానకి సొంతం. కాగా జానకికి నాలుగుసార్లు జాతీయ పురస్కారాలు అందాయి. దీంతో పాటు వివిధ రాష్ట్రాలు ప్రత్యేకంగా అవార్డులు ఇచ్చి సన్మానించాయి. 2017లో వయో భారంతో ఆమె పాటలు పాడడం మానేశారు. 2013 కేంద్రం ప్రకటించిన పద్మభూషన్ అవార్డును ఆమె తిరస్కరించడం సంచలనం రేపింది. తెలుగు భాషలో వేలాది పాటలు పాడిన ఆమెకు ప్రత్యేకంగా అభిమానులున్నారు. ఆదివారం ఆమె అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సమస్యలు పరిష్కరిస్తాం

>> దృష్టిలో ఉంచుకుని అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన ప్రయత్నం చేస్తుందని స్పష్టం చేశారు.ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు ఈనెల 21వ తేదీన సచివాలయంలో అన్ని ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారి అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రులు ఇరువురూ ప్రకటించారు.ఈలోగా రాష్ట్ర ఆర్థికమంత్రి వర్యులతో కూడా ఉద్యోగ సంఘాల సమస్యలపై మరొక సారి చర్చిస్తామని వారి పేర్కొన్నారు.కావున ఉద్యోగులు వారి ఆందోళన కార్యక్రమాల కార్యాచరణను వాయిదా వేసుకోవాలని మంత్రులిరువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు సూచించారురాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన సమావేశం పూర్తి సహృద్భావ వాతావరణంలో జరిగిందని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వర్యులు పూర్తి సానుకూలంగా ఉన్నారని పునరుద్ఘాటించారు.గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతోనే నేడు ఉద్యోగులకు ఈపరిస్థితి వచ్చిందని ఉద్యోగ సంఘాలు ఇచ్చిన 23 డిమాండ్లను పరిశీలించామని వాటన్నిటినీ ఏవిధంగా పరిష్కరించాలనే దానిపై ఈనెల 21న సిఎస్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# ఎరువుల కోసం క్యూలో వృద్ధురాలి పడిగాపులు అస్వస్థతకు గురై మృతి

**టెక్కలి (శ్రీకాకుళం జిల్లా), జూలై 11 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఎరువులు కోసం క్యూలైన్‌లో పడిగాపులు పడి అస్వస్థతకు గురై మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వంలో ఎరువులు వస్తాయో రావో అనే ఆందోళనతో ఆర్‌బికేల్లో ఉన్న ఎరువులు కొనుగోలు చేసేందుకు శుక్రవారం లవునిపల్లిలో ఉన్న ఆర్బికే కేంద్రానికి రైతులంతా చేరుకున్నారు. ఈ ఆర్‌బికే లో కేవలం 200 బస్తాలు మాత్రమే ఉండడం, ఒక్కో రైతుకి కేవలం ఒక బస్తా ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు తమకు యూరియా దొరుకుతుందో లేదో అని రైతులంతా ఒకేసారి అక్కడికి చేరుకున్నారు. ఇరుకు ప్రదేశం కావడం రైతులు అధికంగా చేరుకోవడంతో అందులో చిక్కుకున్న పినకాన కాంతమ్మ (70) అస్వస్థతకు గురైంది. వెంటనే అక్కడ ఉన్న రైతులు కాంతమ్మను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే కాంతమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో గత ఏడాది ఎరువులు కొరత ఏర్పడడంతో ఈ ఏడాది కూడా ఎరువులు దొరుకుతాయో లేదో అని ఆందోళనతో రైతులు ఉండడం శనివారం ఈ ఘటన జరగడం ఎరువుల కొరతకు ప్రత్యేక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# తుపాకీ కంటే కలం గొప్పది

>> ఆయన అందించిన మార్గదర్శకత్వాన్ని ఎన్నటికీ మరిచిపోలేనని, "ఆయన నాకు గురువులాంటి వారు... శిరసు వంచి నమస్కరిస్తున్నాను" అని మంత్రి అన్నారు.తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన యద్దనపూడి సులోచనారాణి పేరును సభా ప్రాంగణానికి పెట్టడం ఆమె సాహిత్య సేవలకు దక్కిన గొప్ప గౌరవమని మంత్రి పేర్కొన్నారు. అలాగే రంగనాయకమ్మ, ఓల్గా (పి.లలిత కుమారి), వాసిరెడ్డి సీతాదేవి, డి.కామేశ్వరి వంటి ప్రముఖ రచయిత్రుల సేవలను కొనియాడారు.

అదే సమయంలో మహిళా సాధికారత, ప్రజాజీవితం, సామాజిక చైతన్యానికి విశేష సేవలందించిన నన్నపనేని రాజకుమారి గారిని ప్రత్యేకంగా అభినందిస్తూ, "నాకు మాత్రమే కాదు... రాష్ట్ర మహిళలందరికీ ఆమె స్ఫూర్తిదాయక నాయకురాలు" అని పేర్కొన్నారు.జస్టిస్ జ్యోతిర్మయి సమాజం పట్ల అంకితభావం కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు., ఈ కార్యక్రమంలో తనతో పాటు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు."తెలుగుతనం అనేది కేవలం భాష కాదు... అది మన సంస్కృతి, మన ఆత్మ" అని మంత్రి అన్నారు. పిల్లలు ఇతర భాషల్లో మాట్లాడినా, ప్రేమలోనైనా, బాధలోనైనా, ఆప్యాయతలోనైనా వారి నోట మొదట వచ్చే పదం "అమ్మ" అని పేర్కొన్నారు. 'అమ్మఅనే ఒక్క పదంలోనే తెలుగు మాధుర్యం, మమకారం, అనుబంధం, ఆత్మీయత నిక్షిప్తమై ఉన్నాయి" అని తెలిపారు. తెలుగు భాషలో యాసలు మారినా మనసులు ఒక్కటేనని పేర్కొంటూ, శ్రీకాకుళం, కృష్ణా, రాయలసీమ, నెల్లూరు ప్రాంతాల యాసలు వేరైనా భాష గొప్పతనం మారదని అన్నారు. "ప్రాంతాలు వేరైనా... పలుకు వేరైనా... మనల్ని ఏకం చేసేది తెలుగు భాష, తెలుగు మమకారమే" అని పేర్కొన్నారు.హోంమంత్రిగా తన భద్రత కోసం తుపాకులు ఉన్నప్పటికీ, సమాజాన్ని మార్చే అసలైన శక్తి కలానిదేనని మంత్రి స్పష్టం చేశారు. "కత్తి కన్నా కలం గొప్పది... గన్ కన్నా పుస్తకం గొప్పది. తుపాకి భయాన్ని సృష్టిస్తుంది... పుస్తకం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది" అని అన్నారు.

చిన్నతనంలో తన తండ్రి పుస్తకాలు చదివే అలవాటు పెంచారని, అదే తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిందని గుర్తు చేసుకున్నారు. యువత పుస్తక పఠనాన్ని జీవనశైలిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు, సోషల్ మీడియాలో పెరుగుతున్న అసభ్యకర వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, మహిళలకు మాత్రమే కాదు... అబ్బాయిలకు కూడా మహిళలను గౌరవించడం, సంస్కారవంతంగా ప్రవర్తించడం, బాధ్యతతో వ్యవహరించడం నేర్పించే ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు.

"నేడు సోషల్ మీడియాలో తల్లి ఎదుట కూడా మాట్లాడలేని భాషను, భార్యతో కూడా ఉపయోగించలేని భాషను, సోదరి లేదా కుమార్తె ఎదుట పలకలేని పదాలను కొందరు ఉపయోగిస్తున్నారు. అలాంటి వికృత సంస్కృతికి సమాజంలో స్థానం ఉండకూడదు" అని మంత్రి అన్నారు.

# రాష్ట్రానికి మరిన్ని కొరియా పెట్టుబడులు




## 50కి పైగా కంపెనీలతో చర్చలు జరిపిన మంత్రి లోకేష్

## పల్లి..పల్లి మంత్రి అంటూ కొరియన్ ప్రతినిధుల ప్రశంసలు

**విజయవాడ, జులై11, ప్రభాతవార్తప్రతినిధి:** భారత్-కొరియా సంబంధాల బలోపేతమే లక్ష్యంగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (సౌత్ కొరియా) ఆహ్వానం మేరకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేపట్టిన సౌత్ కొరియా పర్యటన విజయవంతమైంది. మంత్రి లోకేష్ బృందానికి దక్షిణ కొరియా ప్రభుత్వంతోపాటు అక్కడి పారిశ్రామికవేత్తల నుంచి సముచిత గౌరవం లభించింది. ఎల్జీ లాంటి గ్లోబల్ కంపెనీలు ప్రత్యేకంగా తమ హెడ్ క్వార్టర్స్‌కు ఆహ్వానించి ఉన్నతస్థాయి బృం దంతో గౌరవార్థ విందు ఇవ్వడం మంత్రి లోకేష్‌కు దక్కిన అరుదైన గౌరవం. ఈనెల 5నుంచి 11వరకు నిర్వహించిన అధికారిక పర్యటనలో 50కి పైగా కార్పొరేట్ సంస్థల నాయకత్వాన్ని కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా లోకేష్ కోరారు. తొలిరోజు సియోల్ లో తెలుగు ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంతో ప్రారంభమైన పర్యటన శుక్రవారం సీఐఐ ఆధ్వర్యాన పెట్టుబడిదారులతో నిర్వహించిన రోడ్‌షోతో ముగిసింది. రాష్ట్రంతో ద్వైపాక్షిక, రాజకీయ, వాణిజ్య సహకారాన్ని బలోపేతం ప్రాధాన్యతను గుర్తిస్తూ, దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిత్వశాఖ మంత్రి లోకేష్‌ను అధికారికంగా ఈ పర్యటనకు ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌తో నిర్వహించిన భేటీల అనంతరం ఎల్జీ, హ్యుందయ్, శాంసంగ్, బీఎన్ కే ఫైనాన్షియల్ వంటి దిగ్గజ కొరియన్ కార్పొరేట్ సంస్థలు, తమ ఉన్నత నాయకత్వంతో సంప్రదించి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న స్పష్టమైన పారిశ్రామిక విధానాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, అందజేస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్‌తో వివిధ సంస్థల ప్రతినిధి బృందాలు ఫిదాఅయ్యాయి. పర్యటన తొలిరోజున సియోల్ లో భారత్ రాయబారి గౌరంగలాల్ దాస్‌తో నిర్వహించిన మర్యాదపూర్వక భేటీలో కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తూ ఆంధ్రప్రదేశ్ విజన్‌ను ఆవిష్కరించారు. దక్షిణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వర్యాన అపెక్స్ - కొరియా పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగంను ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలకు నిదర్శనం. శ్రీసిటీ పరిసరాల్లో ఇప్ప టికే కొలువై ఉన్న 40కిపైగా కొరియన్ కంపెనీలతోపాటు కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపే సంస్థలకు భరోసా ఇచ్చినట్లయింది. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రెండేళ్ల వ్యవధిలో 'కియా' సాధించిన విజయాన్ని ఉదహరిస్తూ, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, స్పీడ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ విధానాలు, 3ఎస్ మోడల్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమ తులపై మంత్రి లోకేష్ వివరించిన తీరుపై కొరియా మీడియా, దిగ్గజ కంపెనీలు సానుకూలంగా స్పందిం చాయి. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బృందం పర్యటనపై కోట్రా దక్షిణాసియా విభా గాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్ ప్రశంసల వర్షం కురిపిస్తూ నారా లోకేష్ బృందానికి హ్యాట్సాఫ్ అంటూ ట్విట్టర్ లో అభినందనలు తెలపడం పర్యటన విజయవంతానికి నిదర్శనం. కొరియన్ ప్రతినిధులు మంత్రి లోకేష్ వేగం చూసి పల్లి..పల్లి మంత్రిఅని కొత్త పేరు పెట్టారు. పల్లి.. పల్లి అనే కొరియన్ పదానికి అర్థం త్వరగా..త్వరగా అని. వారంరోజుల అధికారిక పర్యటనను పెట్టుబడుల యాత్రగా మార్చిన మంత్రి లోకేష్ లౌక్యం రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి, కమిట్ మెంట్‌ను తెలియజేస్తోంది.

ఇక తన సౌత్ కొరియా పర్యటన ముగింపు సందర్భంగా 'ఎక్స్' వేదికగా తన టూర్ విజయవంతం కావడానికి సహకరించిన దక్షిణ కొరియా విదేశాంగ శాఖ, సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం, ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'మళ్లీ కలుద్దాం సియోల్ అంతవరకు కమ్సు హమ్నిదా!' అంటూ కొరియన్ భాషలో పోస్ట్‌ను ముగించారు. కమ్సు హమ్నిదా అనేది కొరియన్ భాషా పదం. ఎవరికైనా అత్యంత మర్యాదపూర్వకమైన

# పడవ ప్రమాదంపై మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

## బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులకు ఆదేశం

**విజయవాడ,జూలై11, ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రమాద ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకున్న మంత్రి, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు చిక్కుకున్నారనే ప్రాథమిక సమాచారంపై తక్షణమే రంగంలోకి దిగారు. ఈ విషయమై ఢిల్లీలోని ఏపీ భవన్ సీనియర్ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ అత్యవసరంగా మాట్లాడారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను, తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరదాగా విహారయాత్ర (టూరిజం) కోసం వియత్నాం వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో ఏపీ భవన్ అధికారులు నిరంతరం టచ్‌లో ఉన్నట్లు మంత్రికి తెలిపారు. పమాదంలో చిక్కుకున్న తెలుగు పర్యాటకులకు అన్ని రకాల అత్యవసర సహాయాలు అందేలా కేంద్ర విదేశాంగ శాఖతో పాటు సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలతో పూర్తి స్థాయిలో సమన్వయం చేసుకోవాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ వైద్యుల పదవీ విరమణ వయసు పెంపునకు జూడా వ్యతిరేకం

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ వైద్యుల రిటైర్మెంట్ వయసు 70 యేళ్లకు పెంపు ప్రతిపాదనలను ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం (జూడా) వ్యతిరేకించింది. దీనివల్ల యువ వైద్యుల ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. వైద్యుల కొరతకు అర్హులు లేకపోవడం కారణం కాదని, ఖాళీలను భర్తీ చేయకపోవడమే అసలు సమస్య అని స్పష్టం చేసింది. వెంటనే పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. రోగుల రద్దీకి తగ్గట్లు అదనపు పోస్టులు ఇవ్వాలంది. స్పెషలిస్టుల నియా మకంతో ఆసుపత్రులను బలోపేతం చేయాలని సూచించింది. వైద్యులకు సకాలంలో ప్రమోషన్లు ఇవ్వాలని, సీనియర్ వైద్యులను కేవలం సలహాదారులు, మెంటార్లుగా మాత్రమే వాడుకోవాలని జూడా ప్రభుత్వానికి సూచించింది.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

## శ్రీకాకుళంలో ఉద్యమ సన్నద్ధ సభ తాత్కాలికంగా వాయిదా

**విజయవాడ, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మంత్రుల కమిటీ సానుకూలత వ్యక్తం చేసినందున ఈ నెల 12వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించనున్న ఉద్యమ సన్నద్ధ సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు అమరావతి ఏపీ జేఏసీచైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు శనివారం ప్రకటించారు. ప్రభుత్వంతో త్వరలో జరగబోయే సమావేశం అనంతరం ఉద్యమ కార్యాచరణ పై తమ తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆయన తెలిపారు. గత రెండేళ్లుగా ఉద్యోగుల సమస్యలపై తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో, ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించి, అన్ని జిల్లాలలో ఉద్యమ సన్నాహక పర్యటనలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకురెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, గృహ నిర్మాణ మరియు సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో అమరావతి ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఇతర నాయకులతో గత రెండు రోజులుగా జరిపిన చర్చలు ఫలించాయి.

# ఘనంగా ఎస్ఎస్‌జీ వార్షిక క్రీడల పోటీలు


## ముఖ్యఅతిథిగా హాజరైన ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్రలడ్డా

**విజయవాడ జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ విభాగంలోని స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ వార్షిక క్రీడల పోటీలు ఘనంగా జరిగాయి. ఎస్ఎస్ జీ గ్రౌండ్స్ లో నిర్వహించిన ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ చంద్ర లడ్డా, ఐజీ పీహెచ్ డీ రామకృష్ణ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ డైరెక్టర్ ఏ.జగదీష్, ఎస్పీ చెన్నుపాటి భద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షిక పోటీల్లో 25 క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా టగ్ ఆఫ్ వార్ పోటీలను ప్రారంభించారు. క్రీడల పోటీల్లో ఆరు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎస్. కమలేంద్రరావు ఈ ఏడాది వార్షిక క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచారు. క్రీడలు శారీరక ధృడత్వాన్ని మానసిక ఉల్లాసాన్ని, టీమ్ స్పిరిట్ ను పెంపొందిస్తాయని ఇంటెలిజెన్స్ చీఫ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో అందరికీ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీలను నిర్వహించేందుకు సహకరించిన ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయం అధికారులు, శాప్ చైర్మన్ రవినాయుడు, ఇతర అధికారులకు స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ధన్యవాదాలు తెలియచేసింది.

# బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

## 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2026' జాబితాలో చోటు

### అభినందనలు తెలిపిన సిఎం చంద్రబాబు, హర్షం వ్యక్తం చేసిన మంత్రి లోకేష్




న్యూఢిల్లీలో ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ సదస్సులో అవార్డు అందుకుంటున్న నారా బ్రాహ్మణి

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారాబ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ -2026' జాబితాలో ఆమె చోటు సంపాదించుకున్నారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలిచారు. ఢిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ 2026సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్రఎనలేనిదని, పాలఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన ఆశయమని స్పష్టంచేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకితమిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రతిష్ఠాత్మక జాబితాలో తన కోడలు, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి స్థానం సంపాదించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించారు. జాతీయ స్థాయిలో లభించిన ఈ అరుదైన గౌరవంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, తన 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలియ జేశారు. ఫార్చ్యూన్ ఇండియా 100 మంది అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో గుర్తింపు పొందిన బ్రాహ్మణికి నా హృదయపూర్వక అభినం దనలు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు కేవలం ఒక అవార్డు మాత్రమే కాదు. వ్యాపార రంగంలో ఆమెకున్న తిరుగులేని నాయకత్వ పటిమ, అంకితభావం, నిబద్ధతకు దక్కిన నిదర్శనం అని ముఖ్యమంత్రి కొనియాడారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.




# తీరం మాదే,ఇక్కడ వేట మాదే

## సీజ్ చేసిన 7బోట్లు వదిలే ప్రసక్తే లేదు

### రాష్ట్ర మత్స్యకారులకు జరుగుతున్న నష్టాన్ని తమిళనాడు అధికారులకు ఆధారాలతో వివరించాం: కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, జూలై 11, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** ఆంధ్రప్రదేశ్ తీరానికి 23 కిలోమీటర్ల పరిధిలోకి ఇతర రాష్ట్రాలకు చెందిన చేపల వేట బోట్లు ప్రవేశించడం చట్టవిరుద్ధమని, రాష్ట్ర మత్స్యకారుల జీవనోపాధి, సముద్ర జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ - తమిళనాడు అంతర్‌రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, జిల్లా అటవీశాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా, మెరైన్ మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డా. పి. సురేష్, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి. లక్ష్మణరావు, ప్రకాశం జిల్లా సంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్ బాషాతో పాటు మెరైన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.తమిళనాడు రాష్ట్రం నుంచి మత్స్యశాఖ, మత్స్యకారుల సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. విజయ కార్తికేయన్, చెన్నై జిల్లా కలెక్టర్ మాలతి హెలెన్, రాయపురం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరమనాథం, స్టేట్ ఇంటెలిజెన్స్ వింగ్ డీఎస్పీ కరియప్పన్, అదనపు మత్స్యశాఖ డైరెక్టర్ నూర్‌జహాన్ బీవి, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎలంగో సమావేశానికి హాజరయ్యారు.తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మత్స్యకారుల సమస్యలు, సముద్ర జలాల్లో అక్రమ ప్రవేశాల వల్ల కలుగుతున్న నష్టం తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎస్పీ తమిళనాడు అధికారులకు వివరించారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మీడియాతో మాట్లాడుతూ, గత మూడు నెలలుగా మన జిల్లా సరిహద్దు తీర ప్రాంతంలోని సముద్ర జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్న తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన మత్స్యకారుల వల్ల మన రాష్ట్ర మత్స్యకారులకు కలుగుతున్న నష్టాన్ని తమిళనాడు అధికారులకు సమావేశంలో సవివరంగా వివరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మే నెల నుంచి ప్రత్యేక సముద్ర గస్తీ ప్రారంభించిన అనంతరం అక్రమ ప్రవేశాలపై కఠిన నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు.

మత్స్యకారుల సమస్యలను నాలుగు విభాగాలుగా వర్గీకరించి తమిళనాడు ప్రతినిధులకు వివరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బోట్లు, తమిళనాడుకు చెందిన బోట్లు, తమిళనాడు బోట్లలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, చిన్న అవుట్‌బోర్డ్, ఇన్‌బోర్డ్ ఇంజిన్ బోట్ల ద్వారా అక్రమంగా ప్రవేశించే వారి సమస్యలను విడివిడిగా వివరించామని, ముఖ్యంగా నాలుగో కేటగిరీ వల్లే అధిక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం అత్యధిక సమస్య పుదుచ్చేరి నుంచి వస్తోందని, అక్కడి నుంచి 640 హార్స్‌పవర్ సామర్థ్యం గల భారీ ట్రాలర్లు గుంపులుగా వచ్చి ఆంధ్రప్రదేశ్ జలాల్లో చేపల వేట నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ బోట్లు రాష్ట్ర మత్స్యకారుల వలలను ధ్వంసం చేయడంతో పాటు సముద్ర జీవవైవిధ్యానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అక్రమ చేపల వేటకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు, జీపీఎస్ టైమ్‌స్టాంప్‌లు, బోట్ల వివరాలు వంటి సాంకేతిక ఆధారాలను సమావేశంలో తమిళనాడు ప్రతినిధులకు ప్రదర్శించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే భారీ ట్రాలర్లు, నిషేధిత వలల వినియోగం వల్ల రక్షిత జాతికి చెందిన ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృతి చెందుతున్న విషయాన్ని కూడా వివరించినట్లు చెప్పారు.ఈ ఆధారాలను పరిశీలించిన తమిళనాడు ప్రతినిధులు సమస్య తీవ్రతను, మన బాధను అర్థం చేసుకొని, తమ రాష్ట్రానికి చేరుకున్న వెంటనే చెన్నైలో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకారులకు అవగాహన కల్పించి, ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు.మన తీరం పరిధిలోని సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిన తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన సీజ్ చేసిన ఏడు బోట్లను విడుదల చేయాలని తమిళనాడు ప్రతినిధులు విజ్ఞప్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఏ బోటును విడుదల చేసే ప్రసక్తే లేదని, తమిళనాడు అధికారులు తీసుకునే చర్యలను పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మాత్రమే బోట్ల విడుదలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి చేపల వేట బోటులో ట్రాన్స్‌పాండర్‌ను తప్పనిసరిగా అమర్చాలని తెలిపారు. 23 కిలోమీటర్ల పరిధిలోకి ప్రవేశించే సమయంలో ట్రాన్స్‌పాండర్ ద్వారా హెచ్చరిక సందేశాలు అందే విధంగా వ్యవస్థ పనిచేస్తోందని వివరించారు.జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో సముద్ర గస్తీ నిరంతరం కొనసాగుతోందని, భవిష్యత్తులో కూడా అక్రమంగా ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి ప్రవేశించే ఏ బోటునైనా స్వాధీనం చేసుకుని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు తరలిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశానికి పుదుచ్చేరి అధికారులు హాజరు కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన అధికారులు, రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, మత్స్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై అత్యాచారం: నిందితునికి జీవిత ఖైదు



**వడమాలపేట, జూలై 11 ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడికి సహజ మరణం వరకు జీవిత ఖైదు కఠిన కారాగార శిక్ష విధిస్తూ చిత్తూరు జిల్లా ఫోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఏఎం పురం గ్రామంలో 2024లో మూడు సంవత్స రాల బాలికకు వరుసకు మామ అయిన నిందితుడు పాముల నాగరాజు అనే సుశాంత్ బిస్కెట్లు తీసిస్తానని ఆశ చూపించి గ్రామంలోని దుకాణానికి తీసుకెళ్లాడు. అనంతరం గ్రామ చివరిలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అమానుషంగా లైంగిక దాడి చేసి గొంతు నులిమి హత్య చేశాడు. అత్యంత హీనమైన ఈ చర్యను తీవ్రమైన నేరంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్వయంగా సంఘటన జరిగిన ప్రదేశాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి నిందితుడిని త్వరగా అరెస్టు చేసి కచ్చితంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బా రాయుడు నేతృత్వంలో దర్యాప్తు అధికారిగా పుత్తూరు డీఎస్పీ జి.రవికుమార్ శాస్త్రీయ ఆధారాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు, వైద్య నివేదికలు, క్లూజ్ టీంసేకరించిన సాక్ష్యాలతో పటిష్టంగా దర్యాప్తు కొనసాగించారు. నేరం రుజువు కావడంతో చిత్తూరు జిల్లా ఫోక్సో కోర్టు ముద్దాయి కి శిక్ష ఖరారు. ముద్దాయి జీవించి ఉన్నంత వరకు కఠిన కారాగార శిక్షతో పాటు బాధిత కుటుంబానికి 10 లక్షల రూపాయల పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇచ్చారు.

# డిసిఎం పవన్ శస్త్రచికిత్స విజయవంతంపై మంత్రి దుర్గేష్ హర్షం

## త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్ష

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై11,ప్రభాతవార్త:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ముంబయిలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి కావడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యులు కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని తెలిపినట్లు మంత్రి దుర్గేష్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అచంచలమైన నిబద్ధత, పట్టుదల గల ప్రజా నాయకుడని, నిరంతరం ప్రజల శ్రేయస్సు, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా శ్రమిస్తున్నా రన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని, మళ్లీ యథావిధిగా ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.సమస్య ఏదైనా, ప్రజల్లో ఉంటూ వారి కన్నీళ్లు తుడవాలనే తపన ఉన్న జనసేనాని పవన్ కళ్యాణ్ కు కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, అభిమానుల ప్రార్థనల బలం అండగా ఉన్నాయని, ఆయన తనశారీరక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసమే తపించే నిఖార్సైన ప్రజా నాయకుడని కొనియాడారు. రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తు న్నారని, ఆయన త్వరలోనే పూర్తి శక్తి సామర్థ్యాలతో,రెట్టింపు ఉత్సాహంతో విధుల్లోకి చేరుకుంటారని ఆశిస్తున్నట్లుమంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఆయన అనా రోగ్యంతో ఉన్నా ప్రజాసమస్యలపై ఆలోచన నిరంతరం సాగుతూనే ఉంటుం దని, అలసట ఎరుగని ఆయన పోరాట పటిమ, దృఢ సంకల్పం మనందరికీ ఎల్లప్పుడూ

# డి.సిఎం పవన్‌పై కుట్రలకు సూత్రధారి జగనే..

## రావణ్ వెనుక అంతర్జాతీయ నిధులు: ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి విద్య, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో క్రైస్తవులను రెచ్చగొట్టి మత ఘర్షణలను సృష్టించేందుకు వైస్సార్సీపీ తాడేపల్లి ప్యాలెస్ వేదికగా పెద్ద ఎత్తున కుట్రలు చేస్తోందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం తిరుపతిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడారు.

# మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

## రాష్ట్ర ప్రసూతి మరియు స్త్రీ వైద్యశాస్త్ర సదస్సులో మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి




**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రసూతి మరియు స్త్రీ వైద్య శాస్త్ర సొసైటీ ఆధ్వర్యంలో "ఉమెన్స్ హెల్త్ - నేషన్స్ ప్రైడ్" అనే నినాదంతో ఒంగోలులో నిర్వహిస్తున్న మూడు రోజుల రాష్ట్రస్థాయి సదస్సు రెండో రోజు శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్, ప్రముఖ ప్రసూతి, స్త్రీరోగ వైద్య నిపుణులు, వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం ఒక కుటుంబానికే కాకుండా సమాజం, రాష్ట్ర అభివృద్ధికి కూడా కీలకమని అన్నారు. గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు, ప్రసూతి సేవలు, అవసరమైన పరికరాలు, నిపుణుల సేవలను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు తల్లి, శిశు మరణాలను తగ్గించే దిశగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" లక్ష్యంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని వివరించారు.ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ ఆధునిక వైద్య విజ్ఞానం ప్రజలకు చేరువ కావడంలో ఇలాంటి రాష్ట్రస్థాయి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు నాణ్యమైన ప్రసూతి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, సురక్షిత ప్రసవాలకు ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం పట్ల ప్రతి కుటుం బం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో కీనోట్ ఉపన్యాసాలు, శాస్త్రీయ పత్రాల ప్రదర్శనలు, ప్రత్యక్ష శిక్షణా కార్యక్రమాలు, వైద్య చర్చలు నిర్వహించారు. అధిక ప్రమాద గర్భధారణలు, వంధ్యత్వ చికిత్స, ప్రసూతి అత్యవసర పరిస్థితుల నిర్వహణ, గర్భాశయ క్యాన్సర్ నివారణ, నవజాత శిశు సంరక్షణ, ఆధునిక శస్త్రచికిత్స విధానాలపై నిపు ణులు సవివరంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వైద్యులు తమ అనుభవాలను పంచుకుని వైద్య రంగంలో వస్తున్న నూతన మార్పులపై చర్చించారు.

# వైసిపి మహిళా నేత ఆత్మహత్యాయత్నం: రంగంలోకి రాయపాటి శైలజ



**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త:** ఒంగోలుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మహిళా నాయకురాలు పేరం ప్రసన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ఇటీవల జిల్లా పార్టీ కార్యాలయంలో తనపై జరిగిన దాడి, వేధింపుల అనంతరం తీవ్ర మనోవేదనకు గురైన ఆమె నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో రికార్డు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆమెను ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. సెల్ఫీ వీడియోలో పార్టీ నాయకత్వం తనకు న్యాయం చేయలేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్ప టికీ స్పందన లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ వాట్సాప్ గ్రూపుల నుంచి తనను తొలగించడం, తాను పంపిన వీడియోలు, వాయిస్ మెసేజ్‌లను డిలీట్ చేయడం ద్వారా తనను అవమానించారని ఆరోపించారు. కొందరు తనపై అసభ్య వ్యాఖ్యలు చేసినప్పటికీ వారిపైన చర్యలు తీసుకోకుండా నాయకత్వం వారికి మద్దతు ఇస్తోందని విమర్శించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని ప్రసన్నను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు బాధితురాలితో ప్రత్యేకంగా మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ సునంద, వన్ స్టాప్ సెంటర్ మేనేజర్ ఎన్. సుప్రియ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాయపాటి శైలజ మాట్లాడుతూ, మహిళలు గౌరవంగా, భద్రంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని అన్నారు. గత ఏడాదిగా ప్రసన్న లైంగిక వేధింపులు, అసభ్య వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తనను ఎదుర్కొన్నట్లు తనకు వివరించిందన్నారు.

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
(ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
(CIN:L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001
అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

ఇదిలా ఉండగా దిగువ సంతకందారు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు (చట్టం, 2002 (54 ఆఫ్ 2002)" క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని (నియమం 3)తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఋణగ్రహీత గద్దతోటి రాజేంద్రబాబు (ఋణగ్రహీత), గద్దతోటి ఆగ్నేశ్వరి(సహ-ఋణగ్రహీత), (ఋణ ఖాతా నెం. 2463000008694)లను, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులలో పేర్కొన్న రూ.4,48,131/- (నాలుగు లక్షల నలభై ఎనిమిది వేల ఒక వంద ముప్పై ఒకటి మాత్రమే) మొత్తాన్ని తిరిగి చెల్లించమని కోరుతూ 10-ఫిబ్రవరి-26 తేదీన డిమాండ్ నోటీసును జారీ చేసారు.
ఇదిలా ఉండగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క విలీన పథకం ప్రకారం, 1 ఏప్రిల్ 2024 నుండి అమలులోకి వచ్చేలా ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌ను, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ప్రకారం, పైన పేర్కొన్న ఋణ ఖాతా, మంజూరు చేయబడిన సదరు క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించవలసిన మొత్తం సొమ్ముతో పాటు, తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించిన అంతర్లీన సెక్యూరిటీ మరియు సెక్యూరిటీ వడ్డీతో సహా, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు బదిలీ చేయబడింది.
ఋణగ్రహీత/సహఋణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మొత్తం సొమ్ము తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, దిగువ సంతకందారు 6 వ రోజు జూలై 2026వ సంవత్సరం ఇక్కడ క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీత/తాకట్టుదారుకు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయబడుతుంది.
ముఖ్యంగా ఋణగ్రహీత/సహఋణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరించబడింది. ఆస్తితో చేసే ఏ లావాదేవీలకైనా, 9-ఫిబ్రవరి-26 నాటికి రూ.4,48,131/- (నాలుగు లక్షల నలభై ఎనిమిది వేల ఒక వంద ముప్పై ఒకటి మాత్రమే) మొత్తం మరియు పూర్తి చెల్లింపు జరిగే వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు) వారి ఛార్జీకి లోబడి ఉంటుంది.
హామీగా ఉంచిన ఆస్తులను తిరిగి పొందటానికి అందుబాటులో ఉన్న సమయం, అనగా ఈ సమాచారం అందిన తేదీ నుండి 30 రోజులు, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను రూల్ 8(6)తో చదువబడే దానిని ఋణగ్రహీత దృష్టికి తీసుకురావడం అయినది.

**స్థిరమైన ఆస్తుల వివరణ**

ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు Sd చిన్నగంజాం మండలం రాజబంగారుపాలెం గ్రామ పంచాయత్ ఏరియా చిన్నగంజాం గ్రామం S.No. 348/11 స్థలం యొక్క విస్తీర్ణం 96.8చ.గ॥ ఇం.నం.3-163 అసెస్‌మెంట్ నం.426 RCC ఇల్లు మరియు స్థలం ఈ సరిహద్దులలో సరిహద్దులుచే: 96.8చ.గ॥ యొక్క విస్తీర్ణం లేదా 81.312చ.మీ॥ల స్థలం అందులో 250చ.అ॥ యొక్క RCC ఇల్లు మరియు 40చ.అ॥ యొక్క ACC గది అని ఫిక్చర్లు మరియు ఈజ్‌మెంట్ హక్కులతో. తూర్పు: కంచర్ల శ్రీను యొక్క ఇంటిస్థలం. పడమర: గుద్దతోటి వెంకటేశ్వర్లు యొక్క ఇంటి స్థలం. ఉత్తరం: గుద్దతోటి సుబ్బారావు యొక్క మిగిలిన స్థలం. దక్షిణం : పంచాయత్ రోడ్.
తేది: 06/జూలై/2026 సం/-అధీకృత అధికారి
ప్రదేశం : ప్రకాశం, ఆంధ్రప్రదేశ్ AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

# పౌరసరఫరాల ప్రక్షాళనతో అవినీతి నిర్మూలన

**భాగ్యనగర్ భాస్కర్‌కుమార్**

పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎకసెక్కాలు చేసినట్లు.. తెలంగాణ పౌరసరఫరాలశాఖ అక్రమార్కులకు స్వర్గధామంగా మారింది. తెలంగాణ పౌరసరఫరాలశాఖ రైతుల నుంచిధాన్యం సేకరణ చేయడంతోపాటు ఒక కోటి ఐదులక్షలకు పైగాకుటుం బాలకు తలసరి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. మరోవైపు పెట్రోల్, డిజిల్, ఎల్‌పిజి వంట గ్యాస్ ప్రజలకు సరఫరా చేయడంలో అత్యంత కీలకపాత్రదా రైన పౌరసరఫరాల శాఖకు తెలంగాణ ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో రూ.7366 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వం వేల కోట్లు పేద ప్రజల కోసం బడ్జెట్‌లో పెట్టినా అవి చివరకు అక్రమార్కుల జేబులు నిపండానికి మాత్రమే దోహదపడుతు న్నాయి. అక్రమార్కులను పట్టుకొన్నా పౌరసరఫరాల చట్టాల లో ఉన్న లొసుగులతో ఎంత పెద్ద నేరం చేసినా చిన్నపాటి శిక్షలతో బయటపడి మళ్ళీ అదే నేరం చేయడం రివాజుగా మారింది. పౌరసరఫరాల శాఖ ధాన్యం సేకరణ అంశం ఇటు రైతులను అటు ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసే తంతుగా మారింది. రబీ సీజన్‌లో 72.30 ఎంఎల్‌టి ధాన్యం సేకరణ చేసి 14,006కోట్ల రూపాయలు 10.78లక్షలమంది రైతులకు చెల్లించారు. ఇంత పెద్ద ఆర్థిక యజ్ఞమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఉద్దేశ్యపూర్వకంగానే ఆలస్యం చేసి విక్రయ కేంద్రా లలో కుప్పలుగా పేరుకుపోయాక తూకం వేసి రైతులను దోపిడి చేసేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తొలి పావును కదుపుతారు. ధాన్యం విక్రయానికి వచ్చిన రైతుల వద్ద కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలకు 50 రూపాయలు వసూలు చేస్తారు. అందులో 35 రూపాయలు హమాలీలకు చెల్లిస్తున్నామని మిగతా 15 రూపాయలు తాగునీరు, జనుము తాడు (సుతిలి) సమకూర్చుకోవడానికి ఖర్చు చేస్తున్నామని సెంటర్ నిర్వహకులు రైతులకు చెబుతూ దోపిడిని వ్యవస్థీ కృతం చేశారు. టార్పాలిన్ కవర్లకు రోజుకు ఐదు రూపాయలు అద్దెకూడా వసూలు చేసుకొనే బిజినెస్ మొదలైంది. ధాన్యం తూకం వేశాక వాహనాలు సకాలంలో రాకపోవడంతో రైతులే సొంత ఖర్చులతో వాహనాల్లో ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఈ సమయంలో సొంత వాహనంలో తరలించినా వాహనానికి కొనుగోలు కేంద్ర నిర్వాహకులు డబ్బులు చెల్లించాల్సి ఉండగా చాలా ప్రాంతాల్లో చెల్లించడం లేదు. దీంతో రైతులు ట్రక్కుల డబ్బులు సొంత జేబులో నుంచి ఖర్చు చేయాల్సి వస్తుంది. మరోవైపు ప్రభుత్వం ఇస్తున్న ట్రక్ డబ్బులు అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి. ధాన్యం తరలించే డ్రైవర్లు కూడా రైతు నుంచి బస్తాకు ఐదు రూపాయల చొప్పు బత్తా పేరుతో దోపిడి చేస్తున్నారు. ఇక తాలు, సడెం, చేట, గన్నీబ్యాగ్



బరువు అంటూ క్వింటాల్‌కు సుమారు పదికిలోల వడ్లు అద నంగా తూకం వేస్తారు. తెలంగాణ వ్యాప్తంగా అదనపు కలె క్టర్లకు నుంచి మొదలు కొని పౌరసరఫరాలశాఖ రెవెన్యూ క్షేత్రస్థాయి సిబ్బందికి రైసుమిల్లర్లతో ఉన్న స్నేహబంధంతో మిల్లు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయిస్తూ బహిరంగ మార్కెట్లో అమ్ముకోవడానికి దొడిదారులు వెతుక్కొంటున్నారనీ ఆరోపణలున్నాయి. ఇలా సిఎం ఆర్‌ధాన్యం వేల కోట్ల విలువై నవి దారిమళ్ళించి నీకింతా నాకింత అని పంచుకొన్నారు. దీనితో అధికారులను కూడా రైస్‌మిల్లర్లు సవాల్ చేసే స్థాయికి ఎదిగారు. రైస్ మిల్లులో ఉన్న ధాన్యం తనిఖీ కోసం వెళ్లిన అధికారుల లెక్కలు కాకి లెక్కలు తప్పితే ఒరిజినల్‌గా లెక్కించే విధానం వారి వద్ద లేదు అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి. సిఎంఆర్ బియ్యాన్ని ఇవ్వడానికి రేషన్ బియ్యం కొను గోలు చేసి ఇస్తున్నారు. బియ్యం కొంటామని వీధుల్లో ఉదయం బైక్‌పై మైక్‌తో అనౌన్స్‌చేస్తూ తిరిగే కొనుగోలుదారు మొదలు కొని రేషన్‌డీలర్లు, ఎంఎల్ఎస్ పాయింట్ల ఇంచార్జీలు వీరికి రేషన్ బియ్యం సమకూర్చే వనరులుగా మారిపోయారు. సిఎంఆర్ ఎగ్గొట్టిన మిల్లర్లకు క్రిమినల్ కేసులు పెట్టి ఆస్తుల వేలం వేస్తున్న ప్రభుత్వం వారి అక్రమాలకు అండగా నిలిచిన కొంత మంది అధికారులపై చర్యలు తీసుకోవడం లేదనీ విమ ర్శలు పౌరసరఫరాలశాఖపై వినిపిస్తోంది. దీనికితోడు పంచ నామా రిపోర్టు, ఎఫ్ఐరా చార్జిషీటు రిమాండ్ రిపోర్టు, రికార్డు రికవరీ వంటి అంశాలకు శాస్త్రీయంగా కోర్టుల్లో నిలబడేలా నివేదికలు రూపొందించే విధానం ఇప్పటివరకు లేకుండా పోవడం అక్రమార్కులదే పైచేయిగా ఇప్పటివరకు కొనసాగింది. పౌరసరఫరాలశాఖ చట్టాలు వినియోగించుకోవడంలో సరైన నైపుణ్యంలేని ఉద్యోగుల కారణంగా ఏడేళ్ళ శిక్షపడే కేసుల్లో కూడా బెయిల్ వచ్చేది. పౌరసరఫరాలశాఖ కమీషర్‌గా స్టీఫెన్ రవీంద్ర వచ్చాక పరిస్థితి మారిపోయింది. పౌరసరఫరాలశాఖ కేసులు కోర్టుల్లో వీగిపోకుండా, నిందితులకు ముందస్తు బెయి ల్ ఇవ్వకుండా ఒక లీగల్‌టీం ఏర్పాటు చేసి మార్గదర్శకాల ను రూపొందించడమే కాకుండా పోలీసు, సివిల్ సప్లయ్‌శాఖ సిబ్బందికి పంచనామా రిపోర్టు, ఎఫ్ఐరా చార్జిషీటు రిమాండ్ రిపోర్టు, రికార్డు రికవరీ వంటి అంశాలకు శాస్త్రీయంగాకోర్టుల్లో నిలబడే విధంగా నివేదికలు రూపొందించే శిక్షణ ఇచ్చారు. మూడేళ్ల క్రితం పెండింగ్లో ఉన్న యాసంగి సీజన్‌కు సంబం ధించిన బకాయిలను ఆగస్టు ఐదులోగా త్వరితగతిన చెల్లించా ల్సిందిగా మిల్లర్లకు నోటీసులతో లీగల్ చర్యలు పకడ్బందిగా తీసుకొనేందుకు సివిల్ సప్లయ్ కమీషనర్ కఠిన నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో 348 రైసుమిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు, 128 మిల్లుయజమాను లపై ఆర్ఆర్ యాక్టును నమోదు చేశారు. కోర్టు కేసుల్లో విజయం సాధించడానికి చట్టపరంగా బలోపేతం అవుతున్నా, పౌరసరఫరాలశాఖ అంతర్గతంగా ఇప్పటికి కాలం చెల్లిన జిపిఎస్ యంత్రాలను ఇంకా వాడుతున్నారు. దాని స్థానంలో ప్రతి బండికి గోదాముల్లో కేమెరాలను బిగించడం వల్ల సగం అక్రమాలు తగ్గే అవకాశం ఉంది. వడ్లు బియ్యం తరలించే వాహనాలకు జిపిఎస్ బదులుగా అదే ధరకు అందుబాటులో ఉన్న వెబ్ కెమెరాలు బిగించడం మంచిది. ప్రస్తుతం ఏఐ విస్తృతంగా వాడుకలోకి వచ్చింది.దీన్ని ఉపయోగించి మిల్లుల్లో జరుగుతున్న మోసాలను అరికట్టే అవకాశంఉంది. ప్రతి మిల్లు లో సార్ టెక్స్ యంత్రాలు ఉన్నాయి. వాటికి నియంత్రిస్తున్న కంప్యూటర్లను లేదా యంత్రాలను ఏఐతో అనుసంధానం చేసి ధాన్యం ఎంతవేశారు, ఎంత మిల్లింగ్ వచ్చిందనీ ఎప్పటికప్పుడు లెక్కపెట్టే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి మిల్లును కమాండ్ కంట్రోల్ తరహాలో అనుసంధానం చేసి లెక్కలు ఎప్పటికప్పుడు సెంట్రల్ సర్వర్లో నమోదైతే అక్రమాలకు తావుఉండదు. చౌక ధరల బియ్యం రీసైకిల్ చేసి ఇవ్వకుండా నియంత్రించడానికి ఒక క్వింటాలు ధాన్యం మిల్లింగ్ చేస్తే ఎంత కరెంటు బిల్లువస్తుందో ఆ మేరకు ఆ మిల్లు సిఎంఆర్ కింద పెట్టిన మిల్లింగ్ అయిన ఖర్చు అయిన విద్యుత్ వినియోగాన్ని లెక్కిస్తే ఇట్టే దొంగతనాన్ని దొరకబట్టే అవకాశం ఉంది. అధికారులు అలా చేయకపోవడంతోయథేచ్ఛగా సిఎంఆర్ బియ్యంకు రేషన్ బియ్యం వాడుతున్నారు. రేషన్‌దుకాణాల్లో తూకాల్లో మోసాలు కూడా పెరిగిపోయాయి. తూనికల కొలతలశాఖ అధి కారులు తీసుకొన్న జీతాలకు న్యాయంచేయ డానికి రేషన్ షాపుల్లో తూకాలను తనిఖీ చేయాల్సిన అవస రం ఉంది.ప్రస్తుతం మార్కెట్లో ఎలక్ట్రానిక్ కాంటాల్లో రిమోట్ కంట్రోల్‌తో తూకాన్ని నియంత్రించే ఏర్పాట్లు వచ్చా యి. ఇది మార్కెట్లో రూ.1500లకే లభిస్తుంది. ఇది ప్రతి దుకాణదారు రేషన్ షాపుల దుకాణాలు బిగించుకొని వినియో గదారులను మోసం చేస్తున్నా నియంత్రించడంలో అధికారులు విఫలమౌ తున్నారు. తెలంగాణలో మహాలక్ష్మీ పథకంలో భాగంగా వంట గ్యాస్ సబ్సిడి చాలావరకు అందడంలేదని మహిళలుఆరోపిస్తు న్నారు. రూ.500కు వంటగ్యాస్ ఇస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం చెబుతున్నా కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడి 46.90పైసలు మాత్రమే పడుతున్నాయని వినియోగదారులు అంటున్నారు. అర్హులైన తెల్లరేషన్ కార్డుదారులకు రూ.500కు వంటగ్యాసు సిలెండర్లు ఏడాదికి 12ఇస్తారు. సబ్సిడి కావాల్సి నవారు ఇకెవైసి చేయాల్సిఉంటుంది. వార్షిక ఆదాయం పది లక్షలలోపు ఉన్నవారికి సబ్సిడిలభిస్తోంది. ఈ పథకంలో లేని వారు బుక్‌చేస్తే సర్వర్‌ఒటిపి రాకపోవడంతో ఎక్కువధర పెట్టి బయట కొనుగోలు చేయాల్సివస్తోందని అంటున్నారు. ●

కరీంనగర్‌లోని భగత్‌నగర్‌కు చెందిన బండారి మారుతి, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామానికి చెందిన సొక్కం అంజయ్య సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాలలో సౌభాగ్య ఇండస్ట్రీస్ నడిపిస్తున్నారు. ధాన్యం పక్కదారి పట్టించడంతో వారిని సుల్తానాబాద్‌పోలీసులు అరెస్టుచేసి జైలుకూడు తినిపించారు. స్టీఫెన్ రవీంద్ర చొరవతో లీగల్‌గైడ్‌లైన్స్ పుస్తకాలు తెలంగాణలోని పోలీసుస్టేషన్‌లు, తహసిల్, సివిల్ సప్లయ్ అధికారులకు సుమారు వెయ్యి పుస్తకాలు అందుబాటులోకి రావడంతో గతం లో రైసుమిల్లర్లు అక్రమాలు చేసి అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ పొందినట్లు పొంద లేకపోతున్నారు. లీగల్‌ఎక్స్‌పర్ట్స్ తో రూపొందించిన ఏకరూప గైడ్‌లైన్స్‌తో శాస్త్రీ యంగా కేసు నమోదు చేసి కోర్టుల్లో వీగిపో కుండా చర్యలు చేపట్టారు. ఆస్తుల వేలం కూడా మొదలైంది. నల్లగొండ సూర్యపేటలో సిఎంఆర్ ధాన్యం ఇవ్వనివేలం వేసినబియ్యం అందిం చని రైసు మిల్లర్ల ఆస్తులు అటాచ్ చేశారు. నాలుగవేల కోట్ల ఆస్తులు స్వాధీనం కు మార్గం సుగమం చేశారు. రాబోయే 2026-27 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ఎలాంటిఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా చూడడానికి, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరా ల శాఖ ఈరోజు 'మిషన్ కె100' ను స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. కొత్త దిగుబడి రాకముందే గోదాములను సిద్ధం చేసే ఉద్దే శ్యంతో, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థకి అప్పగించడంపై సివిల్ సప్లయ్‌శాఖ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. తక్షణమే నిధు లను సమకూర్చుకోవడంతో పాటు గోదాముల అద్దె భారాన్ని తగ్గించుకునే లక్ష్యంతో, ధాన్యా న్ని ఒక క్రమపద్ధతిలో, దశల వారీగా వేలం వేయడంపై ఇది ప్రధానంగా దృష్టి సారిస్తుం ది. భారీ స్థాయిలో ధాన్యం వచ్చే కొనుగోలు కేంద్రాలను ఆధునీకరించ డమే మిషన్ కె100లక్ష్యంగా పెట్టుకొంది.

# గుడి దొంగలు!

ఉత్తరాఖండ్

**ఎ.వి.వి ప్రసాద్**

గుడిని మింగేవారు కొందరైతే గుడిలోని లింగాన్ని మింగే వారు మరికొందరంటారు. ఆ ఇద్దరూ ఒకేచోట ఉంటే! మొత్తం ప్రపంచాన్నే మింగేయగలరన్న మాట. దేవాలయాలకు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే పేరు. అవి క్రమంగా ఆర్థిక కేంద్రాలుగా కూడా మారుతూండడంతో దొంగల కన్ను కూడా ఇప్పుడు వాటిపైనే ఎక్కు వగా పడుతోంది. వారు బయటి దొంగలుకాదు.. ఇంటి దొంగలే.వారికైతేనే గుడి ఆనుపాన్లు ఎక్కు వగా తెలుస్తాయి. చాలా తేలికగా స్వాహా చేయగ లుగుతారు. అయోధ్య రామాలయ కుంభకోణం వివాదం ఇంకా కొలిక్కి రాకుండానే బద్రీనాథ్ ఆలయం వార్తల్లోకి రావడం చూస్తే ఎన్నెన్ని ఆలయాల్లో ఇంకెన్నెన్ని కుంభకోణాలు జరుగు తున్నాయో అనే అనుమానం తప్పక కలుగు తుంది. ఉత్తరాఖండ్‌లోని అలకనంద నదీ తీరాన ఉన్న బద్రీనాథ్ ఆలయానికి భక్తులు తండోపతం డాలుగా వస్తూంటారు. దానికి తగినట్లుగానే బద్రీనారాయణునికి లభించే విరాళాలు, కాను కలు కూడా విశేషంగానే ఉంటాయి. అందుకే అక్కడా దొంగల కన్ను పడింది. భక్తులు సమ ర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనీ, గుడిలోని ఇంటి దొంగలు కొన్ని కోట్ల మేర స్వాహా చేశారనీ గత వారం వార్తలు గుప్పుమనడంతో ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఈ ఆలయం కూడా అందరి నోళ్లలో నానుతోంది. అక్రమాల ఆరోపణలు రాగానే ఉత్త రాఖండ్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే ప్రమోద్ నౌటియార్ అనే ఆలయ ఉద్యోగిని సస్పెండ్ చేసింది. బద్రీ నాథ్, కేదార్నాథ్ ఆలయ కమిటీ (బికెటిసి) చైర్మన్‌కు ప్రైవేటు సెక్రటరీగా చేసిన ఆ ఉద్యోగి సారథ్యంలోనే మొత్తం కుంభకోణమంతా సాగిం దన్నది వింటే గుడులలో అరాచకాలు ఎలా మితి మీరుతున్నాయో అర్థమవుతుంది. పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వం నియమించిన ముగ్గురుసభ్యుల కమిటీ ఆ ఆరోపణలన్నీ నిజమేనని ప్రాథమికం గా నిర్ధారించగానే ఆ ఉద్యోగిపై వేటు పడింది. 'భైరవ్ సేన' అనే సంస్థ బద్రీనాథ్ ఆలయంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు చేయ డంతో తుట్టె కదిలింది. ధామి ప్రభుత్వం గత మంగళవారం త్రిసభ్య కమిటీని నియమించి 15 రోజుల్లో నివేదిక ఇస్తుందని తెలిపింది. సిసి టీవీ ఫుటేజిని పరిశీలించగా ఆరోపణలు నిజమేనని తేలింది. నౌటియాల్ నాయకత్వంలో కొందరు కౌంటింగ్ సిబ్బంది చాలా కాలం నుంచి చేతి వాటం ప్రదర్శిస్తున్నారనీ, పెద్ద మొత్తంలోనే సొమ్ము కాజేశారనీ వెల్లడయింది. అయితే దీని వెనుక ఇంకాఎవరెవరు ఉన్నారో తేలవలసిఉంది. భైరవ్ సేన ఆరోపణల ప్రకారం ఆలయం నుంచి దాదాపు 90 కోట్ల విలు వైన కానుకలు, నగదు పక్కదారి పట్టినట్లు తెలు స్తోంది. ఈ వ్యవహారం చాలా కాలం నుంచే గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నా బికెటిసి పెద్ద లకు ఎంతమాత్రం అను మానం రాకపోవడమే విచిత్రం.దర్యాప్తు కమిటీకి నాయకత్వం వహిస్తున్న గరేవాల్ కమిషనర్‌ఆనంద్



బద్రీనాథ్ ఆలయం

స్వరూప్ ప్రాథమికంగా చెబుతున్న వివరాలను బట్టి చూస్తే బద్రీనాథ్ ఆలయం నుంచి భారీగానే స్వాహా అయినట్లు తెలుస్తుంది. కోట్లాది భక్తులు పవిత్ర క్షేత్రంగా భావించే బదరీనారాయణుని సన్నిధిలోనే ఇంతపెద్ద కుంభకోణం జరిగితే ఇక మిగిలిన క్షేత్రాల విషయం చెప్పేదేముంది! ఇటు వంటిదే గతవారం వెలుగు చూసిన మరో కుంభ కోణం మధ్యప్రదేశ్‌లోని బగళాముఖి ఆలయం వ్యవహారం. అగర్ మాల్వా జిల్లాలోని బగళాము ఖి ఆలయంలో విరాళాల అక్రమాలు పెద్దమొత్తం లోనే జరిగిన వార్త కూడా ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఈ గుడిలో ప్రభుత్వం నియమిం చిన కమిటీ ఉండగానే,ఓ ప్రైవేటు కమిటీ కూడా మొదలయింది. అది భారీగానే విరాళాల వసూళ్లు మొదలు పెట్టింది. వాటికి రసీదులు ఉండవు. భక్తితోనో, భయంతోనో ప్రజలు ఇచ్చే విలువైన కానుకలు గుడికి చేరకుండా పక్కదారి పడుతూం టాయి.ఈ కథ చాలాకాలం నుంచేసాగుతోందట. నడిపేవారు 'పెద్దమనుషులు' కావడంతో భక్తులు కూడా నోరెత్తకుండా కానుకలు సమర్పించుకొని 'తల్లీ! నీ సంపదను నువ్వే రక్షి ంచుకోవా'లంటూ మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయంమొత్తానికి బయటకు రావడంతో కలెక్టర్ నాలుగు రోజుల క్రితం విచారణ కమిటీని నియమించారు.ప్రైవేటు కమిటీ వసూలు చేస్తున్న వెండి, బంగారాలు ఏమవుతున్నాయో కనిపెట్టడానికి నియమించిన ఈ కమిటీ ఏంచెబుతుందో, ఎవరిపై అభియోగా లు మోపుతుందో చూడాలి. పవిత్రతకు నిలయా లుగా భావించే ఆలయాల్లో ఇలా వెలుగు చూస్తు న్న అక్రమాలు ఒకటీ రెండూ కావు. మరోవంక అయోధ్య బాలరాముని ఆలయం కుంభకోణం వ్యవహారం కూడా రోజుకో కొత్త మెరుపుతో సాగుతూనే ఉంది. దర్యాప్తు జరుపుతున్న సిట్ కే కొన్ని విషయాలు అంతుచిక్కడం లేదంటే ఆ కుంభకోణం ఎంత లోతుగా పాతుకుపోయిందో అర్థమవుతుంది. కనీసం 180 రోజుల సిసి టీవీ ఫుటేజి ఉండాలనే నిబంధన ఉన్నా కేవలం 45 రోజులదే లభ్యమవుతున్నదిట. అంటేఅవసరమైన ఆధారాలన్నీ ముందుగానే మాయంచేశారన్న మాట. అంత పకడ్బందీగా అయోధ్య ఆలయం లోనే చౌర్యం జరిగితే ఇంకెక్కడ జరగదనుకోవా లి! సిట్ ప్రాథమిక నివేదిక ప్రకారం ఎనిమిది మందిని తొలుత అరెస్టు చేశారు. రామజన్మ భూమి తీర్థ క్షేత్రట్రస్టు ప్రధాన కార్యదర్శిచంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా చేసిన రాజీనామాల ను గతవారం ట్రస్టు ఆమోదించింది కానీజరిగిన కుంభకోణంపై ఏ చర్యలు తీసుకొంటుందో చెప్ప నేలేదు.అరెస్టయిన అవినాశ్ శుక్లాయే ఈ కేసులో ప్రధాన నిందితుడని సిట్ తేల్చింది. 70 సార్లు నగదును దారి మళ్లించినట్లు కూడా తేలింది. 200కోట్లు పైనే దారిమళ్లిన అయోధ్య కుంభ కోణం అసలు గుట్టుతేలాలంటే సిబిఐ రంగంలోకి దిగవలసిందే. గుడులకు ఆదాయం ఇప్పుడు కోట్లల్లో ఉంటోంది. అందువల్ల దానిపై నిఘా కూడా ఆస్థాయిలోనే ఉండాలి. అందుకు ప్రభు

# జలప్రళయానికి డ్రాగన్ బీజం

చైనా

**గన్ని మోహన్**

ఆసియాలోనే అతిపెద్ద దేశంఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న చైనా పొరుగున ఉన్న దేశాల భూభాగా లను చేజిక్కించుకోడానికి సకలవిద్య లు ప్రయోగిస్తుందన్నది తెలియంది కాదు. నిన్నమొన్నటివరకూ ఇరుగు పొరుగుదేశాలను ఎగదోసి భారత్‌పై పెత్తనం చేయాలని చూసిన డ్రాగన్‌కు భారత్ చెక్‌పెట్టడం తో ఒక్కసారిగా అవాక్కయింది. అటుచొరబాట్లు, ఇటు ఆక్రమణలతోపాటు ఇప్పుడు తాజాగా జలయుద్ధానికి ప్రణాళికలు వేసింది. చైనా చేపట్టి ప్రారంభించిన ఈప్రాజెక్టుపై భారత్ ఎప్పటి నుంచో అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. టెక్టానిక్ ప్లేట్ల కదలికలు ఎక్కువ ఉండటం వల్ల భూకంప ప్రభావిత ప్రాంతంగా కూడా హెచ్చరించింది. అయితే చైనా మాత్రం దేశ విద్యుత్ అవసరా లకు అనుగుణంగానే ఈప్రాజెక్టు చేపట్టినట్లు చెప్పుకుంటోంది. భారత్‌కు అత్యంత సమీపం లోని టిబెట్ సరిహద్దులో 1.5 లక్షలకోట్ల వ్యయంతో అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించింది. భారత్‌లో బ్రహ్మపుత్రనదిగా ప్రవహించే ఈనది అస్సాం మీదుగా బంగ్లాదేశ్ లో జమునానది పేరుతో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రాజెక్టు పరివాహక రాష్ట్రాలకు ఈ మెగా ప్రాజెక్టువల్ల అత్యంత ముప్పు పొంచి ఉందని, పైగా ఈప్రాజెక్టు భూ ప్రకంపనల ప్రాంతంలో ఉందన్న హెచ్చరికలు ఇప్పుడు రెండు దేశాలకు భవిష్యత్ ముప్పును సూచిస్తు న్నాయని చెప్పాలి. ప్రపంచంలోనే అత్యంత పెద్దదిగా భావించే త్రీగోర్జెస్ డ్యామ్‌కంటే పెద్ద దిగా ఇప్పుడు చైనా మెగా ప్రాజెక్టు నిలుస్తోంది. ఈ ప్రాజెక్టు భూకంప ప్రభావిత ప్రాంతంలో చేపడుతోందని శాస్త్రవేత్తలు చెపుతున్నా జిన్‌పింగ్ సర్కారు చెవికెక్కడం లేదు. ఏడాదికి 300 బిలి యన్ కిలోవాట్ అవర్స్ విద్యుత్ ఉత్పత్తిసామర్థ్యం ఈ ప్రాజెక్టుకుంది. టిబెట్ ప్రాంతంలో బ్రహ్మ పుత్ర నదికి యార్లుంగ్ సాంగ్పో అని పేరు అదే భారత్‌లో బ్రహ్మపుత్ర నదిగా వస్తోంది. ఇప్పుడు తాజాగా కడుతున్న ఈ ప్రాజెక్టునుంచి భారీ వర దలు ప్రకృతి విపత్తుల సమయంలో డ్యామ్ నుంచి నీటిని విడుదలచేస్తే అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ వంటి ఈశాన్యరాష్ట్రాలకు జలప్రళయం తప్పదు. భారత్ పరంగా ఈప్రాజెక్టు నుంచి ముప్పు ఉంటుందని పలుసార్లు హెచ్చరించినా కూడా చైనా ఎక్కడా లక్ష్యపెట్టకుండా డ్యామ్ నిర్మిస్తోంది. జలాశయం చుట్టూ ఉన్న ప్రాంతం బలహీనంగా ఉందని, అందువల్ల ఎక్కడముంపు విలయం ఉంటుందని హెచ్చరించినా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. హిమాలయాల్లో భూకంపాలు తరచూ వచ్చే ప్రాంతంలో పైజన్ ప్రాజెక్టు ఉందని సంప్ పేరిట నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ఎప్పటికీ భారత్‌కు ప్రమాదమే. ఈ ప్రాజెక్టు ప్రాంతంలోనే పదేళ్లక్రితం టిబెట్‌లో 6.9తీవ్రతతో భూకంపం సంభవించింది. అందుకు ధీటుగా అరుణాచల్‌ప్రదేశ్ లో భారత్‌కూడా మెగా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణ ప్రతి పాదనలను పరిశీలిస్తే జలప్రళయానికి బీజం



జలవిద్యుత్

వేసినట్లుగా ఉంది. విద్యుదుత్పత్తి లక్ష్యమే కాకుండా వర్షాకాలంలో ఏర్పడేభారీ వరదలకు ఎగువప్రాంతంలోని మిగులు నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించేందుకు చైనా ఎంతమాత్రం వెనుకాడదు. భారత్ సరిహద్దుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో మాత్రమే నిర్మిస్తున్న ఈ మెగా హైడల్ ప్రాజెక్టు వల్ల భారత్‌లోని ఈశాన్య ప్రాంతానికి ఎప్పటికీ ముప్పే ఉంటుందని పాల కులకు తెలిసినప్పటికీ చైనా మాత్రం తన మెగా ప్రాజెక్టుతో దూకుడుగా ఉంది. ఇప్పటికే నేపాల్ వైపు సరిహద్దుల్లో గ్రామాలనే నిర్మిస్తున్నట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేసాయి. అదేవిధంగా సైన్యం, మిలిటరీ వాహనాల రాకపోకలకు వీలు గా భారత సరిహద్దుల్లోనే రహదారులను నిర్మి స్తోంది. వీటన్నింటినీ ఎప్పటి కప్పుడు భారత్ వ్యతిరేకిస్తున్నప్పటికీ డ్రాగన్ భిన్న వ్యూహాలతో ముందుకు సాగుతున్నది. నిన్న మొన్నటివరకూ ఇరాన్‌కు సహకరించిందని, మిలిటరీ సాయం చేసిందన్న ఆరోపణలు ఎదుర్కొన్న చైనాతో దగ్గరయ్యేందుకు ఇప్పుడు అమెరికా కూడా ఉవ్వి ళ్లూరుతోంది. చడీచప్పుడు కాకుండా తన దేశ సరిహద్దులను విస్తరించడంలో చైనా పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. నాటి మావోజెడాంగ్ నుంచి నేటి జిన్‌పింగ్ వరకూ ఈ విస్తరణ కాంక్ష కొనసాగుతూనే ఉంది. సరిహద్దుల ఒప్పందం జరగకపోవడం ఈశాన్యంలోని అరుణాచల్ మాదే నని చెప్పుకోవడం ఈ విస్తరణ కాంక్షల్లోభాగమే. ఆరువేల చదరపు కిలో మీటర్లకు పైగా తమ ప్రాంతం అనిచెప్పుకుంటూ వస్తున్న చైనా ఈ ప్రాంత విస్తరణ కోసమే సైనిక స్థావరాలతోపాటు మిలిటరీ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు, ఇప్పుడు తాజాగా జలవిద్యుత్ మెగా ప్రాజెక్టులు నిర్మిం చింది. కొండచరియలను బలోపేతం చేసుకోవా లని, రిటైనింగ్ గోడలు నిర్మించి ప్రాజెక్టు పటి ష్టతను మరింత పెంచుకోవాలని సొంత శాస్త్ర వేత్తలు హెచ్చరించినప్పటికీ చైనా మాత్రం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిం ది. ప్రత్యేకించి చైనా ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉన్న భూగర్భ సర్వేశాఖ నిర్వహించిన అధ్యయ నంలోనే ప్రాజెక్టు ప్రాంత కింద చురుకైన భూకంప ఫాల్ట్‌లైన్ వెళుతోందని వెల్లడించింది. పైజన్ ఫాల్ట్ ప్రాంతం ఈ భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు కింద నుంచే కొనసాగుతోంది. దీనివల్ల ఇక్కడ నిర్మించే ఆనకట్టలు వంతెనలు, రహదా రులు, సొరంగాలు ఇతర మౌలిక వనరుల నిర్మాణ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ ఫాల్ట్‌లైన్ వల్లనే పునాదుల బలంతగ్గిస్థిరత్వం కూడా దెబ్బతింటుందని చైనా శాస్త్రవేత్తలే హెచ్చ రించారు. అయినా కూడా చైనా పాలకులకు ఇవేమీ పట్టడంలేదు. జలవిద్యుత్ ఉత్పత్తికోసమే ఈ ప్రాజెక్టు పూర్తిచేసామని, ఇతర దేశాలకు ఎలాంటి ప్రభావం ఉండదని సమర్థించుకుంటు న్న చైనా ప్రత్యేకించి భారత్‌వైపే ఎక్కువ ఫోకస్ పెట్టిందనడంలో ఎలాంటి సందేహంలేదు. తాజా గా ఈ మెగా జలవిద్యుత్ ప్రాజెక్టుతో ఈశాన్య రాష్ట్రాలకు చెక్‌పెట్టే వ్యూహంతోనే చైనా వ్యవహ రిస్తున్నదని నిస్సందేహంగా చెప్పవచ్చు. ●

# రాజధాని పేరు రాజకీయ నినాదమా?



**రుద్రరాజు శ్రీనివాస రాజు**

ఒక రాష్ట్రానికి రాజధాని అనేది కేవలం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం మాత్రమే కాదు. అది ఆ రాష్ట్ర పరిపాలనకు కేంద్ర బిందు వు, ఆర్థికాభివృద్ధికి చోదకశక్తి, పెట్టు బడిదారులకు విశ్వాసానికి ప్రతీక, ప్రజల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే శాశ్వత వ్యవస్థ. అలాంటి రాజధాని అంశం ప్రతి ఎన్నికకు ఒక రాజకీయ నినాదంగా మారితే, నష్టపోయేది ఏ పార్టీ కాదు మొత్తం రాష్ట్రం. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన రాజధాని వివాదం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అమరావతే ఏకైక రాజధాని అనే వాదన, మరోవైపు మావి గాన్, విజయవాడ, దొనకొండ వంటి కొత్త ప్రతిపాదనలు. ఈ నేపథ్యంలో అసలు ప్రశ్న ఒక్కటే రాజధాని మార్పు నిజంగా అంత సులభమా? 2014లో రాష్ట్ర విభజన అనం తరం హైదరాబాద్‌ను పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పేర్కొన్నారు. అనంతరం అప్పటి ప్రభుత్వం శాసనసభ తీర్మానం ద్వారా అమరావతి ని రాజధానిగా నిర్ణయించింది. అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే, వేలాది మంది రైతులు ప్రభుత్వంపై నమ్మ కంతో ల్యాండ్ పూలింగ్ ద్వారా 30 వేల ఎకరాలకు పైగా భూమిని స్వచ్ఛందంగా అప్పగించారు. ప్రభుత్వంతో చట్ట బద్ధమైన అభివృద్ధి ఒప్పందాలు చేసుకుని భూములను ఇచ్చారు. ప్రతిఫలంగా అభివృద్ధి చేసిన ప్లాట్లు, మౌలిక సదుపాయాలు, రాజధాని అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజ నాలపై వారు విశ్వాసం ఉంచారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన వచ్చింది. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో శాసన, కార్యనిర్వాహక, న్యాయ రాజధానులను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే ఈ ప్రతిపాదన రాజకీయంగా ఎంత చర్చకు దారితీసిందో, అంతకంటే ఎక్కువగా న్యాయపరమైన వివాదాలకు కూడా కారణమైంది. రాజధాని అభివృద్ధి ఆగిపోవడం వల్ల పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు. భూములు ఇచ్చిన రైతులు తీవ్ర ఆందో ళనకు గురయ్యారు.రాజధాని మార్పుకు మొదటి పెద్ద ప్రతిబంధకం రైతులతో ప్రభుత్వం చేసు కున్న ఒప్పందం. ఇది ఎన్నికల హామీ కాదు. ప్రభుత్వఉత్తర్వులు, చట్టబద్ధమైన అభివృద్ధి ప్రణాళికలు, భూసమీకరణ ఒప్పందాల ఆధా రంగా జరిగిన ప్రక్రియ. ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని చూపించి రైతుల నుంచి భూములు తీసుకుంది. అలాంటి పరిస్థితిలో తరువాత వచ్చిన ప్రభుత్వం ఆ లక్ష్యాన్నే పూర్తిగా మార్చేస్తే, అది ఒప్పంద నమ్మకాన్ని దెబ్బతీసినట్లవుతుంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వానికైనా ప్రజలు భూములు ఇవ్వడా నికి వెనుకాడే పరిస్థితి ఏర్పడుతుంది.అమరావతి రైతులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పులో,ప్రభుత్వం రైతులతో చేసుకున్న ఒప్పందా లను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొంది. రాజధాని అభివృద్ధి విషయంలో ప్రభుత్వం తన బాధ్యత లను విస్మరించకూడదని స్పష్టం చేసింది. ఈ తీర్పు మీద తదుపరి న్యాయపరమైన పరిణామాలు ఎలాఉన్నా, రైతుల ఒప్పందాలకు న్యాయపరమైన ప్రాధాన్యం ఉందనే విషయం స్పష్టమైంది. ఇటీవల కేంద్రప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో సవరణ చేసి అమరావతి పేరును రాజధానిగా చేర్చిందని, రాష్ట్రపతి ఆమోదం గెజిట్ ప్రకటన వెలువడిందని ప్రభుత్వం పేర్కొం టోంది. చట్టపరంగా రాజధాని పేరు స్పష్టంగా నమోదై ఉండటం వలన భవిష్యత్తులో దానిని మార్చాలంటే కేవలం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం సరిపోదు. మళ్లీ పార్లమెంటులో చట్ట సవరణ అవసరమయ్యే అవకాశం ఉంటుంది. అంటే రాష్ట్ర రాజకీయ సంకల్పం ఒక్కటే సరిపోదు. కేంద్రప్రభుత్వ మద్దతు, పార్లమెంట్ ఆమోదం కూడా అవసరమవు



తుంది. అయితే పార్లమెంట్‌లో ప్రధాన ప్రతి పక్షంతోసహా అనేక రాజకీయ పక్షాలు అమరావతిని సమర్థించాయి. అయితే మరలా పార్లమెంట్‌లో రాజధాని మార్పుకు ఇవి ముందుకు వచ్చే అవకాశం ఉందా? ఇప్పటికే కేంద్ర ప్రభు త్వం రాజధాని నిర్మాణానికి గణనీయమైన నిధులు కేటా యించింది. కేంద్రహామీతో ఆర్థిక సంస్థల నుంచి రుణాలు కూడా సమకూరాయి. ఇలాంటి పరిస్థితిలో నిర్మాణంలో ఉన్న రాజధానిని పూర్తిగా మార్చాలని ప్రతిపాదిస్తే అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఇప్పటికే ఇచ్చిన నిధుల పరిస్థితి ఏమిటి? తీసుకున్న రుణాల బాధ్యత ఎవరిది? కొనసాగు తున్న ప్రాజెక్టుల భవిష్యత్తు ఏమిటి?కేంద్ర ప్రభుత్వ కార్యా లయాల పరిస్థితి ఎలా ఉంటుంది? ఇవి రాజకీయ ప్రశ్నలు మాత్రమే కాదు, ఆర్థిక, పరిపాలనా ప్రశ్నలు కూడా. కొన సాగుతున్న ప్రాజెక్టుల భవిష్యత్తు ఏమిటి? కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఎలా ఉంటుంది? ఇవి రాజకీయ ప్రశ్నలు మాత్రమే కాదు, ఆర్థిక, పరిపా లనా ప్రశ్నలుకూడా. ఒక ప్రాంతం రాజ ధానిగా ప్రకటించిన తర్వాత పెట్టుబడు లు రావడం ప్రారంభమవుతుంది. రోడ్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ఐటీ సంస్థలు, వాణిజ్య సముదాయాలు, నివాస ప్రాజెక్టులు ఇవి అన్నీ దీర్ఘకాలిక ప్రణాళికలతో వస్తాయి. రాజధాని తరచూ మారుతుందనే భావన ఏర్పడితే పెట్టుబడిదారులు సహజంగానే వెనక్కి తగ్గుతారు.పెట్టుబడులకు రాజకీయ స్థిరత్వం ఎంత అవసరమో, విధాన స్థిరత్వం కూడా అంతే అవసరం. ప్రతి ప్రభుత్వం రాజధాని మార్చితే? ఇలా ప్రతి ఎన్నిక తర్వాత రాజధాని మారితే రాష్ట్ర పరిపాలన స్థిరత్వం ఎక్కడ ఉంటుంది? రాజధాని అనేది ఐదేళ్ల రాజ కీయ అజెండా కాకూడదు. అది కనీసం యాభై సంవత్స రాల దూరదృష్టితో నిర్మించాల్సిన వ్యవస్థ. ప్రతిపక్షం రాజ ధాని నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తే, ప్రజాస్వా మ్యంలో దానికి స్పష్టమైన మార్గాలున్నాయి.దానికై నిస్పాక్షిక విచారణ జరగాలి. సాక్ష్యాలు ఉంటే దర్యాప్తు జరగాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రజాధనం దుర్వినియో గమై ఉంటే తిరిగి రాబట్టాలి. కానీ అవినీతి ఆరోపణలకు పరిష్కారం రాజధానినే మార్చడంకాదు. తప్పు జరిగి ఉంటే దానిని సరిదిద్దాలి. మొత్తం వ్యవస్థనే మార్చేయడం సరైన ప్రజాపాలన కాదు.ప్రభుత్వాలు మారడం ప్రజాస్వామ్యంలో సహజం. కానీ ప్రభుత్వం ఇచ్చిన చట్టబద్ధమైన హామీలపై ప్రజలకు విశ్వాసం లేకపోతే, భవిష్యత్తులో ఏ అభివృద్ధి ప్రాజెక్టు కూడా ముందుకు సాగదు. పెట్టుబడిదారులు పెట్టు బడులు పెట్టారు. ఆర్థికసంస్థలు రుణాలు ఇవ్వడంలో వెను కడుగు వేస్తాయి. అందుకే రాజధాని అంశంలో రాజకీయాల కంటే ప్రజా విశ్వాసమే ముఖ్యమైనది. ముగింపు రాజధాని మార్పుఅనేది కేవలం ఒక ప్రకటనతో జరిగిపోయే విషయం కాదు. దానికి చట్టపరమైన, రాజ్యాం గపరమైన, ఒప్పంద పరమైన, ఆర్థిక, పరిపాలనా, రాజకీయ అంశాలు అన్నీ ముడిపడి ఉంటాయి. ప్రత్యేకించి రైతులతో జరిగిన భూ సమీకరణ ఒప్పందాలు, న్యాయస్థానాల తీర్పులు, కేంద్ర నిధులు, రుణాలు, కొనసాగుతున్న నిర్మాణాలు, పెట్టుబడి దారుల విశ్వాసం, పార్లమెంట్ స్థాయిలో జరిగిన చట్టపర మైన మార్పులు ఇవన్నీకలిసి రాజధాని మార్పును అత్యంత సంక్లిష్టమైన అంశంగా మారుస్తాయి. అందువల్ల రాజధాని గురించి చర్చజరిగితే అది ప్రాంతాలమధ్య పోటీగాకాకుండా, రాష్ట్రభవిష్యత్తు, ప్రజా విశ్వాసం, చట్టబద్ధత, అభివృద్ధి అనే నాలుగుసూత్రాల ఆధారంగా జరగాలి. రాజధాని ఒక రాజ కీయ నినాదంకాదు.అది తరతరాల భవిష్యత్తును నిర్ణయించే రాష్ట్ర నిర్మాణానికి పునాది. ఆ పునాదిని ప్రతి ఎన్నికకు మార్చడంకంటే, దానిని బలోపేతంచేయడం రాష్ట్రప్రయో జనాలకు మరింత అనుకూలమైన మార్గం.ఇప్పటికైనా రాజ ధాని రాజకీయాలకు ముగింపుపలికి, అభివృద్ధి రాజకీయా లకు శ్రీకారం చుట్టవలసిన సమయం ఆసన్నమైంది. ●

ong-5_ong-5.qxd 7/11/2026 10:42 PM Page 1



# మహిళా సాధికారతకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలులో సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్, మదర్ థెరిసా బహుజన సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రకటించారు. సావిత్రిబాయి పూలే ఆశయాలకు అనుగుణంగా మహిళలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీర్చిదిద్దేందుకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ, శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్ అందజేస్తామని మదర్ థెరిసా బహుజన సేవా సంస్థ వ్యవస్థాపకురాలు వేమవరపు వరలక్ష్మి, సూర్యశ్రీ ట్రస్ట్ చైర్‌పర్సన్ షేక్ షహనాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా బహుజన సేవా సంస్థ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా సయ్యద్ షహనాజ్‌ను ఎంపిక చేయగా, కమిటీ సభ్యులుగా సుమతి, విజయలక్ష్మి, నూర్జహాన్, శివకుమారి, శృతి, లక్ష్మి, బెల్లం సుబ్బారావును నియమించి నియామక పత్రాలను అందజేశారు. నూతన కమిటీ మహిళల సంక్షేమం, సాధికారత కోసం సేవలు అందించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా శ్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్పై గౌతమి, న్యాయవాది స్పందన పాల్గొని మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని, వేధింపులు ఎదురైతే వెంటనే దిశ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది మహిళలు పాల్గొని మహిళా భద్రత, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన పొందారు.

# సనాతన ధర్మ పరిరక్షణకు వి.హెచ్.పి కృషి కొనసాగాలి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న రాష్ట్ర విస్తృత స్థాయి వర్షారంభ సమావేశాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒంగోలు జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు అచలానందాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణ సిద్ధానంద స్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, సనాతన ధర్మానికి ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే సంస్థగా విశ్వహిందూ పరిషత్ పనిచేస్తోందని అన్నారు. సమాజంలో ధార్మిక, సాంస్కృతిక విలువల పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేసి సంస్థను గ్రామస్థాయి వరకు విస్తరించాలని పిలుపునిచ్చారు. ఉదయం గోపూజ, జ్యోతి ప్రజ్వలనతో సమావేశాలను సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సమావేశాలకు తమ కళాశాల ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని, సమాజ ప్రయోజనాల కోసం ఇలాంటి కార్యక్రమాలకు తమ సంస్థలు ఎల్లప్పుడూ సహకరిస్తాయని తెలిపారు. ప్రధాన వక్తగా పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ మాట్లాడుతూ సంస్థ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి కొత్త కార్యకర్తలను తీర్చిదిద్దాలని, ప్రతి కార్యకర్త శిక్షణ పొందుతూ సేవా కార్యక్రమాలు, ధార్మిక చైతన్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సంస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ కార్యకారిణి సభ్యులు వై. రాఘవులు, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ సంఘటన కార్యదర్శి గుమ్మళ్ల సత్యం, దక్షిణాంధ్ర రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రం విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పర్రె కోటేశ్వరరావు, సహ కార్యదర్శి ఎస్. ప్రాణేష్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా రోటరీ క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం

**అద్దంకి, జులై 11, (ప్రభాతవార్త)**







రోటరీ క్లబ్ ఆఫ్ సింగర్ కొండ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం, స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా పువ్వాడ రామకోటేశ్వరరావు, కార్యదర్శిగా కె.రామయ్య కోశాధికారిగా గూడా లక్ష్మారెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి పీడీజీ అన్నే రత్న ప్రభాకర్ మాట్లాడుతూ, సింగరకొండ రోటరీ క్లబ్ సేవా , కార్యక్రమాలను ముమ్మందు మరింత విస్తృతపరచాలన్నారు. రోటరీ జిల్లా ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రికి రూ.1.5 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలు అందజేయడంతో పాటు, గుంటూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం, అన్నపూర్ణ క్యాంటీన్‌కు రూ.1.5 కోట్ల విలువైన అధునాతన యంత్రాలను సమకూర్చడం వంటి సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, వీరవల్లి రుద్రయ్య,బి. వి. క్రిష్ణా రెడ్డి,పంచాగ్నుల ఉదయభాస్కర్, సందిరెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమోళి, మాజీ అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, అద్దంకి లేవి ప్రసాద్, చప్పిడి వీరయ్య,యర్రమోతు రమేష్,మహమ్మద్ రఫీ, చిన్ని మురళీకృష్ణ, ఖాజావలి, చుండూరి మురళీ సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, అన్నంగి సుబ్బారావు, కొల్లా భువనేశ్వరి, సంకా సుబ్రహ్మణ్యం, గార్లపాటి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

# ఘనంగా జిల్లా టీడీపీ నాయకులు బొమ్మనేని రామాంజనేయులు జన్మదిన వేడుకలు

**సంతనూతలపాడు, జులై 11, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరు గ్రామానికి చెందిన జిల్లా టీడీపీ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త బొమ్మినేని రామాంజనేయులు జన్మదిన వేడుకలు ఒంగోలులోని తన కార్యాలయం నందు శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నడుమ ఘనంగా జరిగాయి. టీడీపీ నేత బొమ్మినేని రామాంజనేయులు కేక్ కట్ చేశారు. పలువురు బొమ్మినేనికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి టీడీపీ మండల అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు నల్లూరి నారాయణరావు, ఎన్నెస్పీ డిస్ట్రిబ్యూటర్స్ కమిటీ అధ్యక్షులు నల్లూరి కృష్ణారావు, టీడీపీ నేతలు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, పాతూరి రాంబాబు, కరిచేటి సురేష్, మారెళ్ళ రామారావు, దాసరి రవి, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, సాదినేని ఆంజనేయులు, ఈదర విష్ణువర్ధన్, నువ్వుల మీరయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, దావులూరి అనిల్ కుమార్, తాటితోటి నరసింహారావు, మొలకలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులతో రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేత

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని గాంధీ పార్క్ నుంచి రంగారాయుడు చెరువు వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల కారణంగా జూలై 15, 16 తేదీల్లో పలు ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. రంగారాయుడు చెరువు నుంచి ఓల్డ్ ఫిల్టర్ బెడ్‌కు వెళ్లే 300 మి.మీ. సీఐ పైప్‌లైన్ ప్రస్తుతం రోడ్డు మట్టం కంటే ఎత్తులో ఉండటంతో దానిని క్రిందకు మార్చే పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జూలై 15న, అలాగే జూలై 16న రోడ్డు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా నిలిపివేయనున్నారు. ఈ ప్రాంతాలకు జూలై 19 న యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. సంబంధిత ప్రాంతాల ప్రజలు ముందస్తుగా తాగునీటిని నిల్వ చేసుకుని నగరపాలక సంస్థకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# లార్డ్ కృష్ణలో ఘనంగా ప్రారంభమైన బ్యాడ్మింటన్ పోటీలు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం జరిగిన 53వ ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2026 జిల్లాస్థాయి అండర్ 11,13, 15,17,19 బాల బాలికల జిల్లా స్థాయి సెలక్షన్ టోర్నమెంట్ ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా శనివారం నుండి ఆదివారం వరకు జరిగిన పోటీలలో అండర్ 11,13,15 బాల బాలికల ప్రిలిమనరి పోటీలు నువ్వా నేనా అన్నట్టు సాగాయి. క్రీడాకారులు ఎంతో ఉత్సహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. శనివారం జరిగిన పోటీలలో విజేతలకు ఆదివారం సెమీ ఫైనల్స్ మరియు అండర్ 17,18 మేన్స్ ఉమెన్స్ పోటీలు జరుగుతాయి అని లార్డ్ కృష్ణా బ్యాడ్మింట్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళి కృష్ణ, ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ పి.విజయ కృష్ణ తెలిపారు.

# మహిళల ఆరోగ్యమే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది

*- మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి*

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**






ఆంధ్రప్రదేశ్ ప్రసూతి మరియు స్త్రీ వైద్య శాస్త్ర సొసైటీ ఆధ్వర్యంలో "ఉమెన్స్ హెల్త్ - నేషన్స్ ప్రైడ్" అనే నినాదంతో ఒంగోలులో నిర్వహిస్తున్న మూడు రోజుల రాష్ట్రస్థాయి సదస్సు శాస్త్రీయ చర్చలు, వైద్య నిపుణుల భాగస్వామ్యంతో ఘనంగా కొనసాగుతోంది. సదస్సు రెండో రోజు నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాం జనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్, పలువురు ప్రజాప్రతి నిధులు, ప్రముఖ వైద్య నిపుణులు, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాల వీరాంజ నేయస్వామి మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రసూతి, స్త్రీ వైద్య రంగంలో ఆధునిక వైద్య విధానాలు, పరిశోధనలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తల్లి-శిశు ఆరోగ్యాన్ని మరింత మెరుగు పరచవచ్చని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" లక్ష్యంగా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణలో వైద్యుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని అన్నారు. ఇలాంటి రాష్ట్రస్థాయి శాస్త్రీయ సదస్సులు వైద్యులకు తాజా వైద్య పరిజ్ఞానం అందించడంతో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అం దించే అవకాశాన్ని కల్పిస్తాయని తెలిపారు. ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై అవగా హన పెరగడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. వైద్యులు సేవాభావంతో పనిచేస్తూ తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు మరింత కృషి చేయాలని సూచించారు. కీనోట్ ఉపన్యాసాలు, శాస్త్రీయ పత్రాల ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వైద్యులకు నూతన వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి వచ్చిన వైద్యులు తమ పరిశోధన పత్రాలను సమర్పించి అనుభవాలను పంచుకున్నారు. యువ వైద్యులకు ఆధునిక చికిత్సా విధానాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అనంతరం అతిథులు సదస్సు నిర్వాహకులను అభినందించి, మహిళల ఆరోగ్య పరిరక్షణలో ఇలాంటి శాస్త్రీయ సదస్సులు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ రోహిణి కుమారి, డాక్టర్ నల్లూరి అరుణ, డాక్టర్ మండవ కమల, డాక్టర్ నల్లూరి ఇందు, డాక్టర్ కరప తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# యువత-4, ప్రకాశం పోలీసు ఆవిష్కరణల పోటీ-2026ను ప్రారంభించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**





ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ప్రకాశం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు. శనివారం ప్రకాశం జిల్లా పోలీసు కళ్యాణ మండపంలో నిర్వహించిన మిషన్ యువత-4 ప్రకాశం పోలీసు ఆవిష్కరణల పోటీ-2026 కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. సాధారణంగా మహానగరాల్లో నిర్వహించే ఇలాంటి ఆవిష్కరణల పోటీని ప్రకాశం జిల్లాలో నిర్వహించడం అభినందనీయమని, పోలీసు శాఖతో పాటు సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాల కోసం యువత ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ పోటీల్లో సుమారు 12 సమస్యలకు పరిష్కారాలను కనుగొనే లక్ష్యంతో 45 బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి యువత ఉత్సాహంగా హాజరుకావడం విశేషమన్నారు. యువతలోని సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు పోలీసు వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన యువతకు మార్గదర్శకత్వం, నవ సంస్థల స్థాపనకు ప్రోత్సాహం, శిక్షణా అవకాశాలు కల్పించి వారి ఆవిష్కరణలను ఆచరణలోకి తీసుకురావడానికి సహకరిస్తామని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వినూత్న కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఉప పోలీసు అధికారి ఆర్. శ్రీనివాసరావు, ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఒంగోలు ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, తాలూకా ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ, గ్రామీణ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, సమాచార సాంకేతిక విభాగం ఇన్‌స్పెక్టర్ జగదీష్, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఒంగోలు 2టౌన్ సీఐగా వీర నాయక్ బాధ్యతల స్వీకరణ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఒంగోలు 2టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా వీర నాయక్ శనివారం ఉదయం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహించిన సీఐ బదిలీ కావడంతో ఆయన స్థానంలో వీర నాయక్ నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమై పోలీసింగ్‌కు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీర నాయక్ మాట్లాడుతూ, ఒంగోలు పట్టణ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే పోలీసింగ్‌ను అమలు చేస్తూ, నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే శాంతిభద్రతలను మరింత సమర్థవంతంగా పరిరక్షించవచ్చని సీఐ వీర నాయక్ పేర్కొన్నారు.

# ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

**ఒంగోలు, ప్రభాతవార్త**




ప్రపంచ జనాభా దినోత్సవం-2026 సందర్భంగా వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) ఆదేశాల మేరకు ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ఏడీఎంఈ/ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీవాణి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి.శ్రీదేవి మార్గదర్శకత్వంలో ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.అశ్వన్ సమన్వయంతో నేడు ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజలకు కుటుంబ నియంత్రణ, పునరుత్పత్తి ఆరోగ్యం, జనాభా నియంత్రణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం పీజీ విద్యార్థులు, జూనియర్ వైద్యులు ఫ్లాష్‌మాబ్, వీధి నాటిక(స్కిట్) ప్రదర్శించి ఉజ్వల భవిష్యత్ కోసం కుటుంబ నియంత్రణ అనే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.అస్వన్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణలో సరైన ఎంపిక, పునరుత్పత్తి ఆరోగ్యం పరిరక్షణ, దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని వివరించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల ఒంగోలు కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తదనంతరం కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, ప్రసూతి- స్త్రీ వైద్య విభాగం సంయుక్తంగా నిరంతర వైద్య విద్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వినీల ప్రియాంక భారతదేశ జనాభా ధోరణులపై, ప్రసూతి- స్త్రీ వైద్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షోనిమా కుటుంబ నియంత్రణ పద్ధతులపై సమగ్రంగా ప్రసంగించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల సోషల్ సైన్సెస్ లెక్చరర్ రవిశంకర్, ఎంపీహెచ్ఈఓ తాళ్లూరి వెంకటేశ్వర్లు, పీజీ విద్యార్థులు డాక్టర్ మొహిద్దిన్, డాక్టర్ అరివుక్కరసు, డాక్టర్ రేష్మా, డాక్టర్ జయప్రీతి, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ హెప్సిబా, డాక్టర్ ముబీనా, డాక్టర్ జైరాం, డాక్టర్ లక్ష్మీదేవితో పాటు ఇంటర్న్ వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా కుటుంబ నియంత్రణ, ఆరోగ్యకరమైన కుటుంబ జీవనం, బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా యువతలో అవగాహన పెంపొందించడం ద్వారా సమాజంలో సుస్థిర అభివృద్ధికి దోహదపడే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.

# లోక్ అదాలత్‌లో 1248 కేసులకు పరిష్కారం

**అద్దంకి జూలై 11( ప్రభాతవార్త)**




అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ లో 1248 కేసులు కు పరిష్కారం లభించింది. సివిల్ 29, క్రిమినల్ 166, పెట్టి కేసులు1053 కు పరిష్కారం లభించింది. ఈ కేసులో మొత్తానికి కలిపి96, 54,329,00. లావాదేవీలు జరిగినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జె.శ్రీ సీత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తుల రామకోటయ్య, లోక్ అదాలత్ సభ్యులు శ్రీను, సత్యవతి ,సంజీవ బాబు, కృష్ణంరాజు, శ్రీహర్ష, నాగ స్వప్న, న్యాయవాదులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వద్దు

*- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు*

**ఒంగోలు, ప్రభాతవార్త**





ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల సంక్షేమం, విద్య, ఆరోగ్యం పంట్ల ఎంత మాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. కేవలం విద్యార్థులుగా కాకుండా తమ సొంత బిడ్డలుగా భావించి వారి సర్వతోముఖాభివృద్ధికి అధికారులు దృష్టి సారించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందితో బుధవారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలను, గత విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో సాధించిన ప్రగతిని సంబంధిత ఉన్నతాధికారులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో పేద బిడ్డలు ఉంటున్నారని, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. ప్రవర్తన పనితీరు సక్రమంగా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నందున సానుకూల అభిప్రాయం కనీసం 90శాతానికి తగ్గకుండా వచ్చేలా సిబ్బంది, అధికారులు పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో చురుగ్గా మాట్లాడుతూ విద్య, ఆరోగ్యపరమైన విషయాలలో వారి బిడ్డల ప్రగతిని వివరించాలన్నారు. గత ఏడాది వన్ ఆఫీసర్- వన్ ఇనిస్టిట్యూట్ కార్యక్రమం ద్వారా పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు రాబట్టేలా ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. హాస్టళ్లలో ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక వసతులను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, దాతల సహాయం తీసుకోవాలని ఆయన చెప్పారు. కొన్ని చోట్ల వంట మనుషుల కొరత ఉందని అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రాజాబాబు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలకోఆర్డినేటర్ జయ, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్‌బాబు, ఆయాశాఖల మండల స్థాయి సంక్షేమ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

6:6.qxd 7/11/2026 11:45 PM Page 1



# కోటి మంది ఆకలి తీర్చడమే తమ ధ్యేయం

## - మల్లిఖార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ రమణమ్మ మెమోరియల్ ట్రస్టు

## - పొలిమేర సోదరులు





**పామూరు, జులై 11, ప్రభాతవార్త**
భగవంతుడు తమకు ఇచ్చిన దాంట్లో కొంతైనా పేదలకు సహాయ సహకారాలు అందించాలన్న తమ తల్లి రమణమ్మ కోరిక మేరకు మల్లిఖార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పొలిమేర మల్లిఖార్జునరెడ్డి యువ సముద్రం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పొలిమేర మాధవరెడ్డిల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాలు పామూరు పట్టణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పామూరు పట్టణంలోని పోలీసు స్టేషన్ ఎదురుగా 29వ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. నిరుపేదలు, అభాగ్యులు రిక్షా భవన నిర్మాణ కార్మికులతో పాటు వలస కూలీలకు ప్రతి శనివారం నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు వారు తెలిపారు. మారుమూల ప్రాంతంలో జన్మించిన తమకు పేదల కషాటలు వారు అధికారులు స్థితిగతులపై అవగాహనతోనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న తలంపుతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. తమకు అన్ని విధాల సహకారాలు అందిస్తున్న ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. ప్రతి వారం 500 మంది వరకు ఆకలి తీర్చడం తమకు ఎంతో ఆనందదాయకం అన్నారు. భవిష్యత్తులో ఆరు మండలాల్లో అన్నదాన కార్యక్రమాలను విస్తరించేందుకు ఏర్పాటు చేస్తున్నామని పొలిమేర సోదరులు తెలిపారు. పేదలకు ఆకలి తీర్చడంలో ఉన్నంత ఆనందం సంతృప్తి మాటల్లో చెప్పలేమన్నారు. రాజకీయ రంగ ప్రవేశంపై వారు మాట్లాడుతూ భవిష్యత్తులో తమ అవసరం ఉందనుకున్న సమయంలో అదరూ ఆశీస్సులతో రాష్ట్రానికి మేలు చేసే పార్టీతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పొలిమేర సోదరులు తెలిపారు.

## శ్రీశ్రీశ్రీ అచ్చమాంబ పేరంటాల అమ్మవారిని దర్శించుకున్న కోటపాటి



**పామూరు, జులై 11, ప్రభాతవార్త**
పామూరు మండలం కమ్మవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ అచ్చమాంబ పేరంటాల అమ్మ దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో కనిగిరి ఎమ్మెల్యే ,ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటపాటి జనార్ధన్‌రావు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులతో ఆప్యాయంగా మమేకమై, అమ్మవారి కృపాకటాక్షాలతో నియోజకవర్గంలోని ప్రజలందరికి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

# మానసాదేవి అమ్మవారిని దర్శించుకున్న యారవ



**పామూరు, జులై 11, ప్రభాతవార్త**
నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రొంపిదల గ్రామంలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ మానసా దేవి అమ్మవారి 12వ వార్షికోత్సవ కార్యక్రమంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నాయకులు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీనివాస్‌ను దుశ్శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఉండి దేవాలయం నిర్మాణంలో పాలుపంచుకుని ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవడం అభినందనీయమని యారవ శ్రీనివాస్ తెలిపారు.

# సర్ ప్రక్రియ పురోగతిపై జేసీ సమీక్ష



**పామూరు, జులై 11, ప్రభాతవార్త**
పామూరు మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న ఇంటింటి ధృవీకరణ, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను సమీక్షించారు. ప్రస్తుతం పామూరు మండలంలో సుమారు 85శాతం డిజిటలైజేషన్ పూర్తి అయినట్లు అధికారులు జాయింట్ కలెక్టర్‌కి వివరించారు. మిగిలిన డిజిటలైజేషన్ పనులను జులై 14వ తేదీలోగా 100శాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు, బీఎల్‌వో, బీఎల్ఏలకు సూచించారు. అనంతరం పోలింగ్ స్టేషన్ నెంబరు 281, పోలింగ్ స్టేషన్ నెం.264లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించి, నిబంధనల ప్రకారం ఏఎస్‌డీ జాబితాను సిద్ధం చేయాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏ.లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓ, బీఎల్ఏలు పాల్గొన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా 100 శాతం పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి అరవిందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు ఉప్పలపాటి బాబు, బీజేపీ సీనియర్ నాయకులు కొండిశెట్టి రమణయ్య, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ నాయకులు నర్సింగ్ సాంబశివరావు, బండ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**పామూరు, జులై 11, ప్రభాతవార్త**
విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన పామూరు మండలంలోని మార్కొండాపురం గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. ఈ ఘటనలో పెద్ద వెంగయ్య(45) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటిని శుభ్రం చేస్తున్న సమయంలో టీవీకి ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌బాక్స్ తగిలి మృతుని భార్య రాములమ్మ కేకలు వేయగా భార్యను రక్షించే క్రమంలో భర్తకు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పామూరు ఎస్సై కట్టా అనూక్ తెలిపారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్




**పర్చూరు, జులై 11, ప్రభాతవార్త**
పర్చూరు పోలీసు స్టేషన్‌లోని రౌడీ షీటర్లకు బాపట్ల డీఎస్పీచంద్రమౌళి శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్లు తమ గత ప్రవర్తనను మార్చుకుని సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు, బెదిరింపులు, గొడవలు,అక్రమ వసూళ్లు, భూ వివాదాలు,మద్యం,మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రౌడీ షీట్‌లో ఉన్న ప్రతి వ్యక్తి కదలికలను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తారని, మళ్లీ నేరాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ వంటి చట్టాల కింద కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీఐ నాగభూషణం, ఎస్సై పులి గోపిలు మాట్లాడారు. ప్రశాంతమైన జీవితం గడపాలన్నారు. ప్రవర్తనపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని తెలియజేశారు.

## అంకమ్మ దేవర బంగారు లెక్క

**నాగులుప్పలపాడు, జులై 11, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో అంకమ్మ దేవర బంగారం విలువలపై నెలకొన్న సందేహాలు అపోహాలు నివృత్తి చేసేందుకు రెవెన్యూ అధికారులు, పోలీసులు ఇప్పటి వరకు ఉన్న కేసుల వివరాలు సేకరించి బంగారు వివరాలు తెలుసుకునేందుకు స్థానిక నాలుగులుప్పలపాడు యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్‌కు లిఖితంగా లెటర్ అందించి లాకర్‌ను ఓపెన్ చేశారు. ఇరు గ్రూపులు కుల పెద్దలు అధికారుల సమక్షంలో బంగారు లెక్కింపు ప్రక్రియ కొనసాగించాడు. చిన్న పెద్ద వస్తువులు మొత్తం కలిపి 820 గ్రాములు బంగారం అంకమ్మ దేవరం ఉన్నట్లు నిర్ధారించారు. వివరాలను ఉన్నతాధికారులతో పాటు కోటి సమర్పిస్తామని పోలీసు అధికారులు ఒకరు తెలిపారు. దీంతో గత కొంత కాలంగా బంగారంపై వస్తున్న పుకార్లకు నేటితో ముగింపు పలికినట్లు అయింది.

## కారంచేడులో నేడు విద్యుత్ అంతరాయం




**పర్చూరు, జులై 11, ప్రభాతవార్త**
కారంచేడు మండలంలోని కారంచేడు, స్వర్ణ గ్రామాల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. నిర్వహణ పనుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణం





**గుడ్లూరు, జులై 11, ప్రభాతవార్త**
మండల కేంద్రం గుడ్లూరులో శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం, పంచామృత అభిషేక పూజలు, అష్టోత్తర శతనామావళి పూజ శనివారం జరిగాయి. చెమిడిదపాడు శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవాలయం ట్రస్టు ఆధ్వర్యంలో చలువాది సుబ్బారావు, రంజిత ఇంటి వద్ద ఈ కార్యక్రమం ఘనంగా ట్రస్టు అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి సిస్టర్స్‌తో పాటు గరటయ్య, ఎయిర్ టెల్ చిన్న, తిరుమలరావు, అరుణ్ దంపతులు పాల్గొన్నారు. స్వామీ వారి చాలీసా పారాయణంతో పాటు పంచామృత అభిషేక పూజలు అష్టోత్తర శతనామావళి పూజలు జరిగాయి. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు వితరణతో అన్న ప్రసాద వితరణ కూడా సుబ్బారావు, రంజిత దంపతులు చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హనుమంతరావు తెలిపారు.

# కందుకూరులో సీపీఐ రాజకీయ శిక్షణా తరగతులు




**కందుకూరు జూలై 11, ప్రభాతవార్త**
సమాజ మార్పుకు సైద్ధాంతిక రాజకీయ శిక్షణ ఎంతో అవసరమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య అన్నారు. ఈ శిక్షణతో కార్యకర్తలు సామాజిక చైతన్యం తీసుకరాగలని ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం పట్టణంలోని స్వర్ణప్యాలెస్‌లో జిల్లా స్థాయి కార్యకర్తలకు 2రోజులపాటు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీపీఐ కార్యదర్శి బి.సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ఉపన్యసించారు. బిజేపీ పాలనను నిందించారు. ప్రజల్లో కులమత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయం చేస్తుందన్నారు. తద్వారా ప్రజల మధ్య అంతరాలు సృష్టిస్తుందని ఆరోపించారు. అయితే భారత్ వెలిగి పోతుందని బిజెపి ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. మతోన్మాదులైన ఆర్ఎస్ఎస్ నేతలు తాము నిజమైన దేశభక్తులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా ఇంచార్జ్ జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశం వెనక్కి వెళ్తుందన్నారు. మనుధర్మం ముసుగులో బీజేపీ రాజ్యాంగంతోపాటు దేశ స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ వందేళ్ల చరిత్రలో సిపిఐ సాధించిన పలితాలు వివరించారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్ సమాజ పరిణామం అనే అంశం గురించి డా॥ సీఎన్ క్షేత్రపాల్ రెడ్డి చారిత్రక సత్యాలపై ఆర్ఎస్ఎస్, బిజెపి వక్రీకరణ ప్రచారం అనే అంశంపై వివరించారు. బి.సాగర్ కుల,మత,మూడ విశ్వాసాలు, కమ్యూనిస్టు నియమాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యం మండలి రాష్ట్రకార్యదర్శి ఆర్ రామకృష్ణ,సిపిఐ జిల్లా నాయకులు ఎం వెంకయ్య,కరుణానిధి,ముస్తఫా, కందుకూరు నేతలు పి.బాలకోటయ్య,వై.ఆనంద్ మోహన్,కె.మురళీకృష్ణ, దుర్గాప్రసాద్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలాపించారు.

# బేషరతుగా మహిళా రిజర్వేషన్ అమలు

## - ఏపీ మహిళాసమాఖ్య



**కందుకూరు జూలై 11, ప్రభాతవార్త**
మహిళా రిజర్వేషన్‌ను బేషరతుగా తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు ఎం. విజయ, గౌరవ అధ్యక్షురాలు ఎస్ రామమ్మలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ప్రధాని మోదీకి రక్తంతో రాసిన ఉత్తరాలును కందుకూరు పోస్టాఫీస్‌లో పోస్టుబాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వర్షాకాల సమావేశంలోనే జనగణ డి లిమిటేషన్, షరతులు లేని మహిళా రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలని కోరారు. మహిళలకు కల్లబొల్లి మాటలు చెబుతూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఎందుకు అరికట్టలేకపోతున్నారు అని ప్రశ్నించారు. బేషరతుగా మహిళా రిజర్వేషన్లను తక్షణం అమలు చేయకపోతే దేశ వ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. మా రక్తంతో లేఖలు రాశామంటే మహిళలకు రిజర్వేషన్ల పట్ల ఎంత అన్యాయం జరుగుతుందో ప్రతి ఒక్కరికి తెలియాలని వారు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల అబద్ధపు ప్రకటనలు మానుకోవాలని మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నేతలు ఆర్ లక్ష్మి, కల్పన, శైలజ, మాధురితోపాటు పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామయపట్నం పోర్టు ప్రైవేటీకరణను ఆపండి

## - కందుకూరు వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా



**కందుకూరు జూలై 11, ప్రభాతవార్త**
రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలని కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. తమ ప్రభుత్వ హాయంలో రామాయపట్నం పోర్టు 95 శాతం పనులను పూర్తిచేశామన్నారు. మిగిలిన 5శాతం పనులు పూర్తి చేయలేక ప్రైవేటు పరం చేస్తూ కూటమి ప్రభుత్వం చేతులు ఎత్తెయడం దారుణమన్నారు. కందుకూరు ప్రాంత ప్రజల చిరకాల కోరికను సాకారమయ్యే సందర్భంలో కూటమి ప్రభుత్వం కుట్రజేసి ప్రైవేటు వ్యక్తులకు అత్యంత చవకగా అమ్మటం దారుణమన్నారు. పోర్టు పూర్తి అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద ప్రజలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేయని అన్నారు. ఆక్వారంగం ఉత్పత్తులు, ఎగుమతులు వలన, మత్స్యకార రంగానికి, రవాణారంగానికి, చుట్టుపక్కల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు జరిగే పోర్టును ప్రైవేటుపరం చేసేంత దుర్మార్గమైన విషయం మరొకటి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరు ప్రాంత ప్రజల పట్ల ఏమాత్రం గౌరవం, ప్రేమ ఉంటే తక్షణమే పోర్టు ప్రైవేటీకరణను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు కమిషనులకు కక్కుర్తి పడి ప్రాజెక్టు ప్రైవేటీకరణకు అంగీకరించారని బుర్రా తీవ్రంగా విమర్శించారు. ప్రైవేటీకరణను ఆపకపోతే నిర్బంధాలు, కేసులును లెక్కచేయకుండా వైఎస్ఆర్సిపి అన్ని వర్గాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడుతుందని ఆయన శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు.

# బాధితులకు చరవాణిల అప్పగించిన ఎస్సై




**కందుకూరు జూలై 11, ప్రభాతవార్త**
కందుకూరు పట్టణంలో పలువురు ఇటీవల రకరకాల కారణాలతో తమ చరవాణిలను పోగొట్టుకున్నారు. అత్యంత విలువైన ఈ మొబైల్‌ఫోన్‌లు గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించడంతో బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ నేపద్యంలో ఎస్సై పి,శివనాగరాజు బాధితుల పట్ల ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సంబందిత వర్గాలను అప్రమత్తం చేశారు. తాజా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఇందులో కొన్ని మొబైల్స్‌ను సేకరించారు. శనివారం బాధితులుకు అప్పగించారు. దీంతో వారంతా ఎస్సైకు కృతజ్ఞతలు తెలిపారు.

# కందుకూరులో జనాభాదినోత్సవ ర్యాలీ

## - జనాబా పెరుగుదల నియంత్రిద్దాం - వైద్యాధికారిణిలు



**కందుకూరు జూలై 11, ప్రభాతవార్త**
జనాభా పెరుగదలను నియంత్రించాలని కందుకూరులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో అదిక జనాబాను అరికట్టాలని నినదస్తూ ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డా॥బ్యూలా గ్రేస్ మాట్లాడుతూ అధిక జనాభా వలన కలిగే అనర్దాలను వివరించారు. ప్రతి ఏడాది జూలై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. జనాభా పెరుగుదల, దానివల్ల కలిగే సమస్యలు, మరియు కుటుంబ నియంత్రణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ ర్యాలీ లో డా బ్యూలా గ్రేస్, డా స్టెల్లా కారుణ్య, ఆయుర్వేదక్ డా॥ లక్ష్మికుమారి, హోమియో వైద్యాధికారిణి డా రత్నావళి, పిహెచ్ఎన్ ఐ.పద్మావతితోపాటు పలువురు ఏఎన్ఎంలు, ఆషాలుతోపాటు పలువురు విద్యార్దులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మానవహారం




**పర్చూరు, జులై 11, ప్రభాతవార్త**
పర్చూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. కుటుంబ నియంత్రణ, మాతా శిశు ఆరోగ్యం, జనాభా పెరుగుదల ప్రభావాలపై డాక్టర్ పృధ్వి ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. మొదటి, రెండో సంతానం, మధ్య కనీసం ఏడాది విరామం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్వరిత న్యాయం.. 844 కేసులకు పరిష్కారం

## - సింగరాయకొండలో జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతం

## - రాజీతో వివాదాలకు శాశ్వత పరిష్కారం






**సింగరాయకొండ, జూలై 11, ప్రభాతవార్త**
మెగా లోక్ అదాలత్ ద్వారా కక్షి దారులకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో శాశ్వత న్యాయ పరిష్కారం లభిస్తుందని సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జి డా. వి.లీలా శ్యాంసుందరి అన్నారు. సింగరాయకొండ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగాలోక్ అదాలత్ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజీ మార్గంలో వివాదాలను వేగంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు మాట్లాడుతూ, లోక్ అదాలత్ ప్రజలకు సులభ, వేగవంతమైన న్యాయ పరిష్కార వేదిక అని అన్నారు. భవిష్యత్తులో కూడా లోక్ అదాలత్ విజయానికి బార్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ మెగా లోక్ అదాలత్‌లో కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న మొత్తం 844 కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యాయి. వాటిలో 24 సివిల్, 148 క్రిమినల్, 672 ఎస్‌టీసీ కేసులు ఉన్నాయి. కార్యక్రమం విజయవంతం కావడంలో బార్ అసోసియేషన్, పోలీసు శాఖ సిబ్బంది సహకారం అందించినట్లు న్యాయమూర్తి తెలిపారు. ప్రామిసరీ నోటు ఆధారంగా దాఖలైన ఓ సివిల్ దావాలో డిక్రీ అనంతరం పెండింగ్‌లో ఉన్న ఎగ్జిక్యూషన్ పిటిషన్‌ను కూడా లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించారు. కోర్టు సమక్షంలో డిఫెండెంట్ రూ.1.75 లక్షలను 75 ఏళ్ల డిక్రీ హోల్డర్‌కు చెల్లించడంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదానికి ముగింపు లభించింది. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు బి.వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, కోర్టు సూపరింటెండెంట్ సుధాకర్ నాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన ర్యాలీ



**సింగరాయకొండ, జూలై 11, ప్రభాత వార్త**
ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా వల్ల సామాజిక, ఆర్థిక,పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిస్తూ చిన్న కుటుంబాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య విద్యావేత్త పీరయ్య మాట్లాడుతూ.. వివాహానికి తగిన వయస్సు, కాన్పుల మధ్య తగిన వ్యవధి, తల్లి-శిశు ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం, కుటుంబ నియంత్రణలో పురుషుల భాగస్వామ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, డాక్టర్ కలైసెల్వం, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, విజయమ్మ, మల్లేశ్వరి, ఆరోగ్య సహాయకుడు సుభాకర్, సి.హెచ్ సుధాకర్‌రావు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జనాభా నియంత్రణపై అవగాహన




**తాళ్లూరు, జులై 11, ప్రభాతవార్త**
తూర్పు గంగవరం పీ హెచ్ సీ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శనివారం జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది నిర్వహించిన ఈ ర్యాలీలో డాక్టర్ మోనిక పాల్గొని ప్రసంగించారు. ప్రణాళికా బద్ధమైన మాతృత్వం, గర్భధారణల మధ్య ఆరోగ్య కరమైన సమయం అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సరైన వివాహ వయస్సు, యుక్త వయస్సులో గర్భధారణ వలన కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా, లభ్యం అవుతున్న వనరుల మధ్య సమతుల్యత పాటించే విధంగా అవగాహన కల్పించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ర్యాలీలో సిబ్బంది చంద్రశేఖర్ బాబు, రమణమ్మ, సుశీల,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రముఖ గాయని ఎస్ జానకికి ఒంగోలుతో అనుబంధం



**ఒంగోలు కల్చరల్,జులై 11, ప్రభాతవార్త**
ప్రముఖ గాయని ఎస్ జానకి ప్రకాశం జిల్లా ఒంగోలుకు ప్రత్యేకమైన అనుబంధ ఉంది. ప్రకాశం జిల్లాలో జరిగిన పలు సంస్కృతిక కార్యక్రమాలు సంగీత కార్యక్రమాలకు ఎస్ జానకి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర మాంటిస్సోరి స్కూల్ పక్కన నివాసముంటున్న ఈలపాట ప్రముఖ సంగీతం ఆర్లయ్యతో ఎస్ జానకి మంచి అవినాభావ సంబంధం ఉంది. ఒంగోలులో జరిగిన శత గీత సంగీత విభవరిలో,2013 ఏప్రిల్ నెలలో జరిగిన 12 13 14 తేదీలలో తెలుగు మహాసభలకు లో కూడా ఎస్ జానకి పాల్గొన్నారు. ముఖ్యంగా ఈల పాట సంగీతం ఆర్లయ్య సంగీత కచేరిలకి ఎస్ జానకికి ఎక్కువగా పాల్గొనేదని ఆయన తెలిపారు

## విస్తృతంగా సర్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా



**కొనకనమిట్ల, జులై 11, ప్రభాతవార్త**
మండలంలోని చిన్నారికట్ల, పెద్దారికట్ల, చినమనగుండం గ్రామాలలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి ,గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం విస్తృతంగా పాల్గొన్నారు. ఆయా గ్రామాలలో నాయకులతో కలిసి సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హులైన వారందరి ఓట్లు పోకుండా చూడాలని సూచించారు. చిన్నారికట్ల సర్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి, ఎంపీపీ మురళి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు మోర శంకర్‌రెడ్డి, నాయకులు రెడ్డం వెంకటరెడ్డి, ఏలూరి సంజీవ్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంచికల చిన్న కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చినమనగుండం సర్ కార్యక్రమంలో జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు,మాజీ వైస్ ఎంపీపీ పొన్నం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి రూ.10 వేల జరిమాన



**పర్చూరు, జులై 11, ప్రభాతవార్త**
పర్చూరు పోలీసు స్టేషన్ పరిదిలో నమోదైన రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరు నిందితులకు పర్చూరు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి వెంకట వాహిని తలా రూ.10వేల చొప్పున జరిమాన విధించారు. మొదటి సారి కావడంతో జైలు శిక్ష విధించకుండా హెచ్చరికతో విడిచిపెట్టామని, మళ్లీ ఇలాంటి నేరానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఎస్సై గోపి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దని అన్నారు.

### పొదిలిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన మార్కాపురం ఆర్డీవో శివరామిరెడ్డి

## - ఈ నెల 14 లోగా వివరాలు అందించాలని ఓటర్లకు సూచన



**పొదిలి, జులై 11, ప్రభాతవార్త**
మార్కాపురం ఆర్డీవో శివరామిరెడ్డి శనివారం పొదిలి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విరాట్ నగర్‌లో పర్యటించిన ఆయన, అక్కడి దేవాలయం అరుగుపై స్థానికులతో కలిసి కూర్చొని ఓటర్ల సర్వే ప్రక్రియపై అత్యంత ఆత్మీయంగా అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా నమోదు, సవరణల ప్రక్రియలో భాగంగా ఓటర్లందరూ తమ పూర్తి వివరాలను సంబంధిత బీఎల్ఓ లకు సమర్పించాలని ఆర్డీవో కోరారు. ఈ ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్లు తమ పూర్తి వివరాలను సంబంధిత బీఎల్ఓలకు సమర్పించడానికి ఈనెల 14వ తేదీని చివరి గడువుగా నిర్ణయించారన్నారు. ఆ లోపు అర్హులైన వారందరూ తమ వివరాలను సరి చూసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన అనంతరం బీఎల్‌వోలు, బీఎల్ఏలు , మున్సిపల్ సిబ్బందితో ఆర్డీవో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విధుల్లో అలసత్వం వహించకుండా, క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి పక్కాగా వివరాలు సేకరించాలని పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంపీ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమీషనర్ ఆంజనేయులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

7:7.qxd 7/11/2026 11:47 PM Page 1



# మార్కాపురం వార్త



## మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

### - వైద్య సేవలపై సమీక్ష





**మార్కాపురం, జూలై 11, ప్రభాతవార్త**

మార్కాపురంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులను క్షుణ్ణంగా పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీల సందర్భంగా రోగులను ఆప్యాయంగా పలకరించిన కలెక్టర్, వారికి అందుతున్న చికిత్స, మందులు, ఆహారం, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. రోగుల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకుంటూ సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించారు.అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌తో పాటు థైరాయిడ్ పరీక్షల కోసం ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన యంత్రాల పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులకు అందిస్తున్న ఆహార మెనూ, ఔషధాల నిల్వ గది (స్టాక్ రూమ్)ను పరిశీలించి మందులు తగినంత నిల్వలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, మెరుగైన సౌకర్యాలు అందేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా ఆసుపత్రిలో అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకుని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## కలెక్టరేట్‌కు 7 కంప్యూటర్లు అందించిన యూనియన్ బ్యాంక్



**మార్కాపురం, జూలై 11, ప్రభాతవార్త**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో మార్కాపురం కలెక్టరేట్‌కు ఏడు నూతన కంప్యూటర్లను శనివారం అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం వి రవికుమార్, ఎల్‌డీఎం షాహీర్, మార్కాపురం మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులకు కంప్యూటర్లను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో సాంకేతిక వసతుల అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు. కలెక్టరేట్‌లో సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించేందుకు ఈ కంప్యూటర్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కంప్యూటర్లతో పాటు కలెక్టరేట్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కూడా బ్యాంక్ ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. వచ్చే వారంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు మాట్లాడుతూ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ బ్యాంక్ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. వెంకట శివరామిరెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దయాకర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి మహిళా సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**మార్కాపురం, జూలై 11, ప్రభాతవార్త**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న ఒంగోలులోని పేస్ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహిళా సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను శనివారం మార్కాపురంలోని సీతారామశాస్త్రివైద్యశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, విద్య, సమాన హక్కులు, శాస్త్రీయ దృక్పథం, సామాజిక సాధికారత వంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చలు జరుగుతాయని తెలిపారు. మహిళలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి. శరత్, యుటీఎఫ్ జిల్లా నాయకులు ఒద్దుల వీరారెడ్డి, బి. శ్రీరాములు, పి. వెంకటేశ్వర్లు, పి. యలమందారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు యు. వెంకట్రావు, ఏనుగుల రవికుమార్, ఆర్. విప్లవ్ కుమార్, వై. రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో గిద్దలూరువాసికి విశిష్ట సన్మానం



**గిద్దలూరు, జూలై 11, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణానికి చెందిన పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధనరావుకు తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక "శాలివాహన విశిష్ట ప్రతిభ పురస్కారం" లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రీ వరకవి సిద్ధప్ప జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో,2013 నుంచి గిద్దలూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న ఆయన సేవలను గుర్తించి తెలంగాణ శాలివాహన చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఇటికాల వీరయ్య ప్రజాపతి శాలువాతో ఘనంగా సన్మానించి పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు అద్దంకి మధుసూధనరావును అభినందిస్తూ, ఆయన సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు

## దివ్యాంగుల సమస్యల పరిష్కారం కొరకు సమావేశం



**రాచర్ల, జూలై 11, ప్రభాతవార్త**

రాచర్ల ప్రాథమిక పాఠశాల ఆవరణలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం కొరకు శ్రీశైలం రీజినల్ మరియు ఎర్రగొండపాలెం గిద్దలూరు యూనిట్ కమ్యూనిటీ ఆర్గనైజర్ సుంకప్ప ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు ప్రభుత్వ, ప్రభుత్వేతర వనరులు పొందేందుకు పాటించాల్సిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలానికి కొంతమంది సభ్యులు చొప్పున కమిటీగా ఏర్పాటు చేసి ప్రతి నెలలో ఈ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించుకుని సమస్యలను చర్చించుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దివ్యాంగులకు రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంపూర్ణ సహకారం అందిస్తుందని ట్రస్టు సభ్యులు తమకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రూప్ ఆర్గనైజర్ వై యోసేపు, మండల దివ్యాంగ కమిటీ సభ్యులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి ఓటు హక్కు కల్పించాలి

### - నియోజకవర్గ పరిశీలకులు బ్రహ్మేశ్వర ప్రసాద్



**సీఎస్‌పురం, జులై 11, ప్రభాతవార్త**

ఓటర్ల జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వహించాలని అర్హులందరికి ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ బీజేపీ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పరిశీలకులు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మంచాల బ్రహ్మేశ్వర ప్రసాద్ అన్నారు. మండలంలోని కోవిలంపాడు, శీలంవారిపల్లి, సీఎస్‌పురం గ్రామాలలో నిర్వహిస్తున్న సర్ వెర్ఫికేషన్ పక్రియను శనివారం పర్యటించి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాలలో విధులలో బీజేపీ బీఎల్ఏలతో కలిసి బూత్ లెవల్ అధికారులు వద్దకు వెళ్లి సర్ కార్యక్రమం పురోగతిపై సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు నమోదు చేసిన వివరాలు ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్ల తొలగింపు పక్రియ, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలు, డూప్లికేట్ నమోదుల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అదే విధంగా ఇంటింటి సర్వే నిర్వహణ, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, ఓటర్ల నుంచి అందిన అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడం ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చూడటంతో పాటు మరణించిన వారు ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం ద్వారా అర్హుల జాబితాను రూపొందించవచ్చని అన్నారు. ఓటర్ల సర్ పక్రియను సద్వినియోగం చేసుకుని పూర్తి వివరాలను బీఎల్‌వోలను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర మాజీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్, జిల్లా బీజేపీ కార్యదర్శి వద్దిపాటి వెంకటేష్, బీజేపీ సీనియర్ నాయకులు ముక్కు వెంకటరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గుమ్మ సుబ్బారావు, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, కనిగిరి మండల బీజేపీ అద్యక్షులు ఒంటిపెంట నారాయణరెడ్డి, బీఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌టీకేఫ్ సేవలు ప్రశంసనీయం

### - నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి - పొలిమేర సోదరులు





**కనిగిరి, జులై 11, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని నూతనంగా ప్రారంభమైన ఆన్‌టీ కప్పును రమణమ్మ చారిటబుల్ ట్రస్టు, యువ సముద్రం ఫౌండేషన్,నెక్స్ట్ జెన్ రోటోటిక్స్ నిర్వాహకుడు పొలిమేర మాధవరెడ్డి, రమణమ్మ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరక్టర్ పొలిమేర మల్లిఖార్జునరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీవీఆర్ హాస్పిటల్ డైరక్టర్ డాక్టర్ పిల్లి ప్రతాప్‌రెడ్డి, బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ప్రముఖ రియల్టర్ పల్నాటి భాస్కర్‌రెడ్డితో కలిసి కేఫ్‌ను పరిశీలించారు. కేఫ్‌లో అందిస్తున్న టీ, కాఫీ రుచులను ఆస్వాదించారు. పరిశుభ్రమైన వాతావరణం,వినియోగదారులకు కల్పిస్తున్న సౌకర్యాలు,సేవా విధానాన్ని అభినందించారు. నాణ్యత, పరిశుభ్రత,వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యం ఇస్తూ సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆన్‌టీ కేఫ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసిన పొలిమేర సోదరులు, ఇదే నాణ్యతను కొనసాగిస్తూ ప్రజల ఆదరణతో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు అమానుషం

### - నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### - దద్దాల నారాయణ యాదవ్





**పీసీపల్లి, జులై 11, ప్రభాతవార్త**

పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని అడవిలోపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరిగిన దాడి అమానుషమని కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ విమర్శించారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు పాల్పడడం తగదని ఆయన హెచ్చరించారు. శనివారం దాడిలో గాయపడి కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోడూరి కొండారెడ్డి, కోడూరి మాలకొండారెడ్డి, కోడూరి మల్లిఖార్జునరెడ్డి, వనిపెంట నాగరత్తమ్మలను పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. బాధితులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దాడికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులపై అక్రమ కేసులు నమోదు చేయడం, వ్యక్తిగత దాడులు పెరిగాయని ఆరోపించారు. ఇటువంటి ఘటనలను సహించబోమని స్పష్టం చేశారు. దాడి ఘటనపై డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డీఎస్పీని కోరినట్లు చెప్పారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరిరెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, ఒకే రెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, పరిమి వెంకటరావు చౌదరి, రేగుల బాలయ్య చౌదరి, మూలే రాజశేఖర్‌రెడ్డి, చెన్నుపాటి వెంకటరావు చౌదరి, భూమిరెడ్డి కొండారెడ్డి, చిలుకూరి నారాయణ చౌదరి, మీనిగా రమణయ్య,పెద్దిరెడ్డి పెద్దన్న, తిరుమలపూడి మహేష్, మిట్ట రమేష్‌రెడ్డి, మచ్చ మాలకొండయ్య,ప్రత్తి సురేష్, మాదాల కృష్ణ,చెన్నుపల్లి ఓంకారం,కాకర్ల వెంకటేశ్వర్లు, సంగటి బాబు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 618 కేసులు పరిష్కారం



**గిద్దలూరు, జూలై 11, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని స్థానిక కోర్టు సముదాయాల ప్రాంగాణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా మొత్తం 618కేసులకు పరిష్కారం చూపినట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ఓంకార్, అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె భరత్ చంద్రలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిట, ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశముల మేరకు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో మొదటి బెంచ్‌కు ప్రీసైడింగ్ ఆఫీసర్‌గా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ఓంకార్, మెంబర్లుగా జి. ఆనంద్ కుమార్ మరియు డి.కేశవ వ్యవహరించారు. రెండవ బెంచ్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె భరత్ చంద్ర, మెంబర్లుగా ఎం పిచ్చయ్య, జె.రంగమోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా 9 డబ్బు బాకీ వసూలు కేసులకు రూ.17,56,100లు, 1 భాగ పంపిణీ కేసు, 9 డిక్రీ అమలు కేసులుకు రూ.6,28,707లు, 7 భరణం కేసులు, 4 గృహ హింస కేసులు, 69 క్రిమినల్ కేసులు, 75 ఎక్సైజ్ కేసులు రూ.1,48,491, 437 పెట్టి కేసులకు రూ. 43700లు, 1 బ్యాంక్ ప్రీ లిటీగేషన్ కేసుకు రూ.75,000, 6 టెలిఫోన్ ప్రీలిటిగేషన్ కేసులు రూ.9,871లు పరిష్కారమయ్యాయని మొత్తం 618 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ సిహెచ్ రమేష్, సిఐ కెసురేష్,కంబం సిఐమల్లికార్జున,ఆరు మండలాల కోర్ట్‌కానిస్టేబుల్స్,సీనియర్,జూనియర్ న్యాయవాదులు, జూనియర్ టెలికాం ఆఫీసర్ పి రాజేష్ కుమార్ బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం నిర్వహించిన యువ సముద్రం ఫౌండేషన్ అధినేత



**పామూరు, జులై 11, ప్రభాతవార్త**

పామూరులో 29 వారాల నుంచి ప్రతి శనివారం పేద ప్రజలకు అన్నదానం నిర్వహిస్తున్న యువ సముద్రం ఫౌండేషన్ అధినేత శ్రీ మాధవరెడ్డి డాక్టర్ పి.మల్లిఖార్జున్‌రెడ్డి, ఒగురు ఏడుకొండలు, జాతీయ బీసీ చైతన్య సమితి అధ్యక్షులు ఉప్పుగండ్ల రమేష్, గాజులపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మిత్రబృందం పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ లో 854 కేసులు పరిష్కారం

### - జూనియర్ సివిల్ జడ్జి వి.ప్రత్యూష



**పొదిలి, జులై 11, ప్రభాతవార్త**

పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 854 కేసులు పరిష్కారమయ్యాయని జూనియర్ సివిల్ జడ్జి లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.ప్రత్యూష తెలిపారు. కక్షిదారులకు 18లక్షల నష్టపరిహారం అందించడం జరిగిందన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. 134 ఐపీసీ కేసులు, ఎన్ఎల్ యాక్ట్ కేసులు-1, సివిల్ మని కేసులు-6, పర్మనెంట్ ఇంజెక్షన్ కేసులు-1, ఈపీ-10,మెయింటైన్స్ కేసులు-1, డివిఎస్-1, ఎస్‌టీసీ కేసులు 700 చొప్పున మొత్తం కలిపి 854 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రంగస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు





**రాచర్ల, జూలై 11 ప్రభాతవార్త**

మండలంలోని జేపీ చెరువు నల్లమల అడవుల్లో వెలసి ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. రెండో శనివారం సెలవు దినం కావడం, దానికి తోడు మాస కల్యాణం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలో భక్తుల దర్శనం కొరకు ఆలయ ఈవో మల్లవరపు నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెండవ శనివారం సందర్భంగా ఆలయంలో స్వామివారి మాస కళ్యాణం కార్యక్రమాన్ని వేద పండితులు అన్నవరం వెంకట రంగాచార్యుల బృందం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ అన్నసత్రం, శ్రీ గోపాల కృష్ణ యాదవ అన్నసత్రాలతోపాటు పలు అన్నసత్రాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ చైతన్య చైర్మన్ నరసింహులు ఆలయ సిబ్బంది పాలక మండలి పాల్గొన్నారు.

## సాయినాధుడు భక్తుల పాలిట అపద్బాంధవుడు

### - శకుంతల పరమేశ్వరన్



**మార్కాపురం, జూలై 11, ప్రబాతవార్త**

గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం నెహ్రూ బజార్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాల్లో భాగంగా నెల్లూరుకు చెందిన శకుంతల పరమేశ్వరన్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయినాధుడు భక్తుల పాలిట అపద్బాంధవుడని, తన జీవితకాలంలో అనేక మంది భక్తులను కష్టాల నుంచి కాపాడి దివ్య మహిమలను ప్రదర్శించారని తెలిపారు. తాత్యాకు ప్రాణదానం చేయడం, మరణించిన వారిని తిరిగి బ్రతికించడం, ఊదితో అనేక మంది రోగాలను నయం చేయడం వంటి ఎన్నో మహిమలను సాయిబాబా ప్రదర్శించారని వివరించారు. అలాగే షిర్డీలో ఉండి దూర ప్రాంతంలో కొలిమిలో పడబోతున్న చిన్నారిని కాపాడిన ఘటనను గుర్తుచేస్తూ, నేటికీ సాయినాధుడు తనను విశ్వసించే భక్తులను ఎల్లప్పుడూ రక్షిస్తూ ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు, అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు పర్యవేక్షించారు. అనంతరం మహిళా సంఘ సభ్యులు బొంతల భారతి, అలవాల సుబ్బరత్నమ్మ, గౌరీ, వరలక్ష్మి, మల్లీశ్వరి తదితరులు శకుంతల పరమేశ్వరన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సాయిభక్తులు పాల్గొన్నారు.

## స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి

### - సిఐటియు మండల కన్వీనర్ బి నరసింహులు



**గిద్దలూరు, జూలై 11 ,ప్రభాతవార్త**

వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ బి.నర్సింహులు డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశం ఎం మేరీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బి నర్సింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ కార్మికుల వేతనాలను పెంచకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ రెండేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినా కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదని అన్నారు. ఉద్యోగులు, కార్మికుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేసే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 31న మార్కాపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు ఏ కుమారి, ఎన్ లక్ష్మీదేవి, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి మరియమ్మ, పి పీరాంభి, డి అనిత తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్ కిరణ్



**కంభం, జూలై 11, ప్రభాతవార్త**

కంభం పట్టణంలోని పలు సచివాలయాలను తహశిల్దార్ కిరణ్ శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా సచివాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమ పురోగతిని ఆయన పరిశీలించారు. ఈఎఫ్ ఫార్ములా పెండింగ్ దరఖాస్తులను వెంటనే డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సంబంధిత అధికారుకు సూచించారు. సర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా అన్ని దరఖాస్తులను పూర్తి చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

**సర్ కార్యక్రమంపై పోలీసుల అవగాహన :**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై కంభం పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాడ్, కందులాపురం సెంటర్, తదితర ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రత్యేక ప్రచార వాయిస్ క్లిప్‌లను ప్రచారం చేశారు. ఓటర్లు తమ ఓటు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని,అర్హులైన వారు ఓటరు జాబితాలో పేర్ల నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

## పోగొట్టుకున్న మొబైల్ అందజేత

**పర్చూరు, జులై 11, ప్రభాతవార్త**

కారంచేడు మండలం పోతినివారిపాలెం గ్రామానికి చెందిన చంద్రిక ఈనెల 3న తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లు కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్ ఫోన్‌ను కనుగొన్నారు. దానిని శనివారం ఎస్సై ఖాదర్ భాష తిరిగి బాధితురాలికి అందించారు.దీంతో ఆమె ఎస్సై,స్థానిక పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.




## సర్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

### - కాకపోతే చర్యలు కఠినమే - కలెక్టర్ విజయ సునీత



**త్రిపురాంతకం,జులై 11, ప్రభాతావార్త**

సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. మండలంలోని త్రిపురాంతకం, రాజుపాలెం సచివాలయాలను ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేయవలసిన సమయానికి పని పూర్తి చేయకపోతే సంబంధిత బిఎల్ఓ ఉద్యోగులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని మార్కాపురం హెచ్చరించారు. ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియ కార్యక్రమం సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. త్రిపురాంతకంలోని 9 మంది బిఎల్ఓల పరిధిలో నలుగురు ఉద్యోగులు సకాలంలో చేయవలసిన ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయలేదని వారిపై తీవ్రంగా కలెక్టర్ మండిపడ్డారు. ఈ విషయంలో పనిచేయని వారి పైనే కాకుండా పని చేయించాల్సిన వారిపై కూడా ఆమె కఠినంగా హెచ్చరించారు. మండలంలో 49,252 ఓటర్ల దరఖాస్తులను పూర్తి చేయవలసి ఉండగా అందులో 42,997 దరఖాస్తులు పూర్తి చేశారని కలెక్టర్ అన్నారు. పూర్తి చేసేందుకు ఒక్కరోజు మాత్రమే గడువు ఉన్నదని ఈ లోగా పూర్తి చేయాలని ఆమె అన్నారు. కలెక్టర్ విజయ సునీత వెంట త్రిపురాంతకం తహశిల్దార్ రామచంద్రుని వాసుదేవరావు,రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు,ఎంపిడిఓ, తహశిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ong-8_ong-8.qxd 7/11/2026 10:42 PM Page 1



## నవజాతి శిశువును రోడ్డు పక్కన పడేసిన కర్కాస తల్లి

**ముండ్లమూరు, జులై 11, ప్రభాతవార్త**



తొమ్మిది నెలలు మోసి కన్న బిడ్డని అల్లరి ముద్దుగా పెంచుకోవాల్సిన తల్లి రోడ్డు పక్కన మొక్కజొన్న గడ్డిలో పడేసిన సంఘటన శనివారం ముండ్లమూరు లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ముండ్లమూరు శ్రీరామ్ డైరీ పాలకేంద్రం సమీపంలో నవజాతి శిశువుని రోడ్డు పక్కన పడేసిన ఘటన ముండ్లమూరు గ్రామానికి చెందిన దుద్దాల గోపి పొలంలో పని చేయడానికి వెళ్ళగా శిశువు ఏడుపు వినిపించడంతో పరిశీలించగా, బేబీ కిట్‌లో పది రోజుల క్రితం జన్మించిన ఆడ బిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లారు. శిశువుని చూసిన గోపి ముండ్లమూరు గ్రామస్లుకు ఫోన్ చేయగా గ్రామస్తులు వెళ్లి 108కి ఫోన్ చేయటంతో ముండ్లమూరు 108 సిబ్బంది వచ్చి ఆ శిశువును ముండ్లమూరు వైద్యశాలకు తీసుకువచ్చి డాక్టర్ వెంకటేశ్వర్లరెడ్డి, జాస్మిన్‌లు ప్రధమ చికిత్స అందించి మట్టితో ఉన్న శిశువుని శుభ్రపరిచి ఐసీడీఎస్ అధికారులకు తెలియజేయడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.ఇందిర అంగన్‌వాడీ టీచర్లు కల్పన విజయకుమారి, ఏఎన్ఎం రాజేశ్వరి శిశువుని 108లో అద్దంకి ప్రాథమిక వైద్యశాలకు తరలించి అక్కడి నుండి ఒంగోలు రిమ్స్‌కి తరలించారు.

## న్యావెరా మహిళల ఐక్యత- భద్రత- సాధికారత న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమంలో గొట్టిపాటి

**దర్శి, జులై 11, ప్రభాతవార్త**







దర్శి పట్టణం, కురిచేడు రోడ్డులోని సైదా మౌలా కాలేజీ వారు ఏర్పాటు చేసిన న్యావెరా మహిళల ఐక్యత, భద్రత, సాధికారత న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీతో పాటు కాలేజీ ప్రిన్సిపాల్ షేక్ అల్లాబక్షు, దర్శి ఎస్సై జి. ఏడు కొండలు, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగేవేణి సుబ్బారావు, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు ,ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానంపై, సైబర్ భద్రతపై ఈ సదస్సులో అవగాహన కల్పించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణ చట్టాలు, ఫోక్సో చట్టంపై అవగాహన కల్గి ఉండాలన్నారు. మహిళలు విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో, ఉద్యోగం మనం ఆర్థికంగా నిలబడితేనే మన మాటకు విలువ ఉంటుందన్నారు.

## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీని మర్యాదపూర్వకంగా కలిసిన దర్శి, ముండ్లమూరు ఎస్సైలు

**దర్శి, జులై 11, ప్రభాతవార్త**





దర్శి, ముండ్లమూరు మండలాలకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు జి.ఏడుకొండలు, పి.కోటేశ్వరరావులు దర్శిలోని టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైలకు తెలిపారు.

## సర్ పక్రియను పర్యవేక్షించిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి

**దర్శి, జులై 11, ప్రభాతవార్త**



దర్శి అసెంబ్లీ నియోజకవర్గం అర్బన్ పోలింగ్ కేంద్రం 112,113,128,132ల్లోని సర్ పక్రియను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఏ.శాంతి లక్ష్మీ శనివారం పర్యవేక్షించారు. డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని, 100శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ

**ముండ్లమూరు, జులై 11, ప్రభాతవార్త**



ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ శనివారం ముండ్లమూరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు వెంకటేశ్వర్లరెడ్డి జాస్మిన్‌లు ఆట్లాడుతూ పిల్లల మధ్య ఎడం ఆరోగ్యకరమైన కుటుంబానికి ఆధారం, పిల్లల మధ్య ఎడమని పాటిద్దాం ఆరోగ్యకరమైన సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అధికారులు శారద, సుబ్బారావు, పద్మావతి, ఏఎన్ఎంలు, ఎమ్మెల్యే హెచ్‌పీఎస్ ఆశా కార్యకర్తలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**దర్శి, జులై 11, ప్రభాతవార్త**




ఆర్థిక స్థోమత లేక తీవ్ర ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. దర్శిలోని టీడీపీ కార్యాలయంలో శనివారం దర్శి నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన ఆరుగరికి చెక్కులను, ముగ్గురికి ఎల్‌ఓసీ మొత్తం రూ.10,67,487 విలువైన చెక్కులను దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అందజేశారు. తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చొరువ తీసుకున్న ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీకి, కూటమి ప్రభుత్వానికి లబ్దిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండల టౌన్ టీడీపీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు సత్యనారాయణ, సూరారెడ్డి, అంబటి గోవిందరెడ్డి, వెంకట నారాయణ, పిన్నిక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**దర్శి, జులై 11, ప్రభాతవార్త**

నేడు ఆదివారం 132 కేవీ లైన్ పొదిలి నుండి దర్శి వరకు మరమ్మత్తుల విషయమై పొదిలి, దర్శి సప్లై బదులుగా 132 కేవీ సబ్ స్టేషన్ అద్దంకి, గుళ్ళాపల్లి, యర్రగుండంపాలెం నుండి విద్యుత్ సరఫరా చేయబడును. ఈ మార్పు విధానంలో ఏమైనా విద్యుత్ సరఫరా అంతరాయం ఉండిన యెడల వినియోగదారులు సహకరించాల్సిందిగా డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు.

## అండగా మేమున్నాం..స్నేహితుని కుటుంబానికి టెన్త్ బ్యాచ్ సహకారం

**వేటపాలెం, జూలై 11, ప్రభాతవార్త**



బండ్ల పాపయ్య హిందూ జూనియర్ కాలేజీ టెన్త్ క్లాస్ 1995 బ్యాచ్ విద్యార్థులు తమ తోటి స్నేహితుల కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. వివరాలలోకి వెళితే వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ రామానగర్ కు చెందిన పసుమర్తి వెంకట సుబ్బారావు, అమరావతి సచివాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందారు. ఆయన మృతి పట్ల 1995-96 టెన్త్ క్లాస్ బ్యాచ్ స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎన్నారై పింజల విజయ్ కుమార్ తన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తూ, పసుమర్తి వెంకట సుబ్బారావు భార్య శివకుమారికి కుటుంబ అవసరాల నిమిత్తం రూ.50,000 ఆర్థికసహాయం అందజేశారు. ఈ సందర్భంగా పింజల విజయ్ కుమార్ మాట్లాడుతూ "నా స్నేహితుడు పసుమర్తి వెంకట సుబ్బారావు అకాల మరణం చాలా బాధాకరం. ఆయన కుటుంబానికి నా వంతు సహాయం అందించడం సంతోషంగా ఉంది. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అందరూ అండగా నిలవాలి" అని అన్నారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ ఇలాంటి కష్ట సమయంలో నా కుటుంబానికి అండగా నిలిచిన పసుమర్తి వెంకట సుబ్బారావు స్నేహితులకి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జిలాని, ముంగర పూర్ణ, ఆలీ, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు. 199596 టెన్త్ క్లాస్ బ్యాచ్ సభ్యులు చూపిన ఈ సహృదయతను స్థానికులు అభినందించారు.

## ఎస్ఐఆర్‌ను వేగవంతం చేయాలి

**వేటపాలెం, జూలై 11, ప్రభాతవార్త**



శాసనసభ్యులు ఎం ఎం కొండయ్య సూచన మేరకు వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం ను మండల పార్టీ నాయకులు కార్యకర్తలు సమీక్షించారు. బిఎల్ఓలు ఈ ప్రక్రియను వేగవంతం చేసి తొందరగా పూర్తి చేయవలెనని సూచించారు. సర్ ప్రక్రియ ఎటువంటి అవకతవకలు లేకుండా సమగ్రంగా జరిగేందుకు తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాచక వీరభద్రయ్య, మండల పార్టీ అధ్యక్షులు గుత్తి సీత రామాంజనేయులు, తెలుగు రైతు అధ్యక్షులు పోలకం చంద్రశేఖర్, పాపాయిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకట నారాయణ, దేశాయిపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు మాచర్ల సాంబశివరావు, క్లస్టర్ ఇంచార్జ్ పేరిసెట్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు

## "నాకంటే ముందే" కవితా సంకలనం ఆవిష్కరణ

**అద్దంకి జూలై 11( ప్రభాతవార్త)**



అద్దంకి పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త చందలూరి నారాయణరావు కలం నుండి జాలువారిన "నాకంటే ముందే" కవిత సంకలనం శనివారం ఘనంగా ఆవిష్కృతమైంది. విజయవాడలోని ఏం బి. విజ్ఞాన కేంద్రంలో మాకినేని బసవపున్నయ్య, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన సాహిత్య సమ్మేళనం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా కొనసాగింది .ప్రముఖ కవి రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఆవిష్కరించారు. గత ముప్పై ఏళ్ళుగా కవిత్వం వ్రాస్తూ, నేడు నాలుగున సంకలనాన్ని తెచ్చారని తెలిపారు. అదే విధంగా ప్రముఖ పాత్రికేయులు సాహితీవేత్త తెలకపల్లి రవి సమీక్షించారు. తనలో పుట్టిన ప్రశ్న ను ప్రేమించటం ద్వారా పుట్టిన ఆలోచనను కవిత్వంలో చొప్పించడం ద్వారా పుట్టిందే ఈ నా కంటే ముందే అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యాజి, చీకటి దివాకర్, వరప్రసాదు, రాష్ట్ర వ్యాప్తంగా మూడు వందల మందిపైగా వర్ధమాన కవులు పాల్గొన్నారు.

## మాలకొండ ఆదాయం రూ.14,25,015

**వలేటివారిపాలెం, జులై 11, ప్రభాతవార్త**



మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి కి శనివారం భక్తుల ద్వారా రూ. 14,25,015 లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ పి. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.అష్టోత్తరానికి రూ.9450,కుంకుమార్చనరూ.26,160,తలనీలాలకు రూ.69,200 ,వాహనాలపూజలకు రూ. 5,720,ప్రత్యేక దర్శనాలకు రూ.6,17,700, స్థలపురాణం పుస్తకాల అమ్మకాలకు రూ. 180,రూము అద్దెలకు రూ. 27,570, కవర్లకు రూ. 14,940,లడ్డు ప్రసాదానికి రూ. 2,61,960,అన్నదానానికి 3,07,670, విరాళాలు రూ.4,000,వచ్చాయని ఆయన. తెలియజేశారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

## సవరణకు మరో మూడు రోజులే.. !

**- బల్లికురవలో 86 పూర్తి**

**బల్లికురవ జూలై 11 (ప్రభాతవార్త)**



భారత ఎన్నికల సంఘం పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాలన్న లక్ష్యంతో సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2002 2004 మధ్య, ఓటర్ల సవరణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి 21 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సర్ కార్యక్రమాన్ని చేపట్టారు. నాటి వివరాలతో ప్రస్తుత ఓటర్ల వివరాలను సరిపోల్చనున్నారు.2002 జాబితాలో పేర్లు లేని వారు తమ తల్లిదండ్రులు, తాతా , నాయనమ్మల పేర్లు జత చేయాల్సి ఉంది. ఈ మొత్తం ప్రక్రియ మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఇప్పటివరకు బల్లికురవ మండలంలో 86 సవరణ కార్యక్రమం పూర్తయినట్లు తాసిల్దార్ రవి నాయక్ శనివారం సాయంత్రం తెలియజేశారు. అధికార యంత్రాంగం మొత్తం ఓటర్ల సవరణ పాలుపంచుకుంటున్నప్పటికీ, అధికార పార్టీ నేతలు మాత్రం ఓటర్ల సవరణ కార్యక్రమం పై తగిన శ్రద్ధ చూపలేకపోవడం గమనార్హం. కూటమిలోని జనసేన, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలతో పోలిస్తే, సైకిల్ కార్యకర్తలు ఖిసర్‌ఖి కార్యక్రమంలో వెనుకబడ్డారని చెప్పక తప్పదు. క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకగణం పర్యవేక్షణ లోపం సర్ కార్యక్రమంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొన్ని గ్రామాలలో బి ఎల్ ఓ ల ప్రశ్నలతో విసిగిపోతున్న ఓటర్లు సర్ కార్యక్రమం వైపు కన్నెత్తి చూసేందుకు భయపడుతున్నారు. అలాంటి వారి వెన్నంటి ఉంటూ, వారి దరఖాస్తులను సమర్పించడంలో మిగిలిన రెండు పార్టీల కార్యకర్తలు ముందంజలో ఉన్నారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ అందిస్తున్న డిజిటల్ సేవల పట్ల కూడా ప్రాంతాల్లోని కార్యకర్తలకు అవగాహన లేకపోవడం గమనార్హం. పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. బూతు స్థాయి నుండి పకడ్బందీగా ఓటర్ నమోదులో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పేర్కొన్నారు. దీనితోపాటు సంస్థాగత నిర్మాణం పై క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని కూడా పిలుపునిచ్చారు. పాలన పరంగా ప్రభుత్వం నుండి సంక్షిప్త సవరణపై ప్రత్యేక దృష్టి సారించిన కారణంగానే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది తప్ప, అధినేత ఆదేశాలు అధికార పార్టీ కార్యకర్తలకు అంతగా చెవికెక్కలేదు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**బల్లికురవ జులై 11( ప్రభాతవార్త)**

శివ ఐ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం, బల్లికురవలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు శిబిర నిర్వాహకులు తెలియజేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉదయం తొమ్మిది గంటలకు ఆరంభమై సాయంత్రం నాలుగు గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, ద్వారా కంటిపొరల ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందన్నారు.

## సర్ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

**ముండ్లమూరు, జులై 11, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలో జరుగుతున్న సర్ పక్రియను ముండ్లమూరు మండల టీడీపీ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి సుంకర రాఘవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు టీడీపీ కార్యకర్తలు తమ ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే మమ్మల్ని సంప్రదించాలని, ఆధార్ కార్డులు ఓటు గుర్తింపు కార్డులు ఫొటోలు, జిరాక్స్‌లను బీఎల్ఓలకు అందజేయాలని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్లాస్టర్ పరిధిలోని ప్రజల దగ్గరికి వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## పూడికతీత పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్ కుమార్

**- రూ.30లక్షలతో సాగర్ కాలువల జంగిల్ క్లియరెన్స్**

**సంతనూతలపాడు, జులై 11, ప్రభాతవార్త**





మండలంలోని చలప్పాలెం గ్రామ సమీపంలో శనివారం నాగార్జునసాగర్ ప్రధాన కుడి కాలువ త్రోవగుంట మేజర్ వద్ద 30 లక్షల రూపాయలతో చేపట్టిన జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత పనులను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు ఎన్నెస్పీ డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు నల్లూరి కృష్ణారావు అధ్యక్షత వహించారు. రైతు సంక్షేమమే, సాగునీటి అభివృద్ధి తద్వారా వ్యవసాయ ప్రగతి లక్ష్యంగా నేటి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో నియోజకవర్గ పరిధిలోని ఎన్నెస్పీ కాలువలకు జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత పనులను చేపట్టినట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. గత ఏడాది కోటి 90 లక్షల రూపాయలు వ్యయంతో సాగర్ కాలువలకు వివిధ పనులను చేపట్టినట్టు ఆయన వెల్లడించారు. తద్వారా కాలువల ద్వారా తాగునీరు రైతు పొలాలకు సక్రమంగా విడుదల అవుతున్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ తెలిపారు. ఇది రైతు ప్రభుత్వం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నెస్పీ సూపరింటెండెంట్ ఇంజనీర్ డి.వరలక్ష్మీ, చీమకుర్తి సాగర్ కాలువల ఓఅండ్ఎం డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ గురిజాల, సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు,తహసీల్దార్ ఎస్.ఎల్ నారాయణరెడ్డి, ఎస్సై వేజెండ్ల అజయ్ బాబు, వీఆర్వో మధు, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.జ్యోతి, సంతనూతలపాడు ఎన్నెస్పీ కార్యాలయ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పద్మావతి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, చీమకుర్తి మండల టీడీపీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, సంతనూతలపాడు మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు నల్లూరి నారాయణరావు, నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు ఆళ్ల సుబ్బారావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు, ఎన్ఎస్పీ సబ్ డివిజన్‌ల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు రామా శ్రీనివాసరావు, వెంకట్రావు, కంకణాల వేణు, ఎన్.కృష్ణారావు, ఎన్నెస్పీ సబ్ డివిజన్‌ల అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు అనూష, సుష్మ, ప్రియదర్శిని, కరిముల్లాలు నీటి సంఘాల అధ్యక్షులు యు.శేషగిరిరావు, కే.చలపతిరావు, టీడీపీ నాయకులు ఆల్ల ఆంజనేయులు, అవినాష్, ఏ.రంగయ్య, నల్లూరి వెంకట్రావు, నాదెళ్ల ఆంజనేయులు, పాలపర్తి శ్రీనివాసరావు, కే.రామారావు, కరిచేటి నరసింహారావు, మాదాల రాంబాబు, జనసేన పార్టీ నాయకులు పల్లపోతు సాయి చరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా మద్దిపాడులో ర్యాలీ

**సంతనూతలపాడు(మద్దిపాడు), జులై 11, ప్రభాతవార్త**



ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా శనివారం నాడు కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అనంతరం జనాభా సమస్యను గురించి అవగాహన కల్పించారు. కాన్పుకి కాన్పుకి మధ్య ఎడం సుమారు రెండు సంవత్సరాలు ఉండాలని, అదే విధంగా చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని, యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు దొరికే విధంగా యువత తయారు కావాలని సీహెచ్ఓ రజిత కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. బిడ్డకి బిడ్డకి దూరం ఉన్న యెడల తల్లి బిడ్డల ఆరోగ్యం బాగుంటుందని ఆరోగ్యశాఖ ప్రతినిధి చిరంజీవి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్ వేగవంతంపై స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మీ బీఎల్‌వోలతో సమీక్ష

**సంతనూతలపాడు(మద్దిపాడు), జులై 11, ప్రభాతవార్త**



మద్దిపాడు మండలంలోని దొడ్డవరం, కొలచనకోట, ఇనమనమెల్లూరు, గుండ్లాపల్లి గ్రామాలలో శనివారం మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మీ, బీఎల్‌వోలతో ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ జాబితా(సర్) కార్యక్రమం వేగవంతంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీడీవో డీఎస్పీ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో హరి ప్రసాద్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## విజయలక్ష్మీకి మాజీ మంత్రి నాగార్జున ఘన నివాళులు

**సంతనూతలపాడు, జులై 11, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని నాంచారెడ్డిపాలెం గ్రామానికి చెందిన పిడుగు విజయలక్ష్మీ దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ మెరుగ నాగార్జున తదితరులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణా కోటిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, వైసీపీ నేతలు రావూరి శ్రీనివాసరెడ్డి, పిడుగు శశిరెడ్డి, వెంకారెడ్డి, బలిజేపల్లి రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన యాదవ జేఏసీనేతలు

**ఉలవపాడు, జూలై 11, ప్రభాతవార్త**



ఉలవపాడు ప్రజా వైద్యశాలలో మృతిచెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని యాదవ జేఏసీ నేతలు మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామిని శనివారం నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈనెల 4వ తేదీ ఉలవపాడు మండలకేంద్రం లోని ప్రజా వైద్యశాలలో వైద్యం వికటించి యాదవ సామాజిక వర్గానికి చెందిన బక్కమంతుల పెద్ద బ్రహ్మయ్య మృతి చెందిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.కేవలం ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా నే అతను ప్రాణాలు కోల్పోయాడని మంత్రికి వివరించారు. అతని మృతి పై సమగ్ర విచారణ చేయించి ఆసుపత్రి యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని యాదవ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణయాదవ్, వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని ఆదేశించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

## ఆత్మకూరులో ప్రపంచ జనాభా దినోత్సవం

**ఉలవపాడు, ప్రభాతవార్త**




ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని ఆత్మకూరు పంచాయతీ ఆది ఆంధ్ర కాలనీలో ప్రపంచ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు అనిల్ కుమార్, శ్రీజా రెడ్డి పాల్గొన్నారు. ప్రపంచ జనాభా విపరీతంగా పెరుగుతుండడం వల్ల ఏర్పడుతున్న దుష్పరిణామాల గురించి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. డాక్టర్ శ్రీజారెడ్డి మాట్లా డుతూ స్త్రీలకు 21 సంవత్సరం పురుషులకు 25 సంవత్సరాలు వివాహ వయస్సు గా తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. బిడ్డకు బిడ్డకు మధ్య మూడు సంవత్సరాల వ్యవధి అవసరమని చెప్పారు.పిల్లల మధ్య ఎడం పెడదాం ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవిద్దాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ లక్ష్మీ నారాయణ, ఎం పి హెచ్ ఎస్ శ్రీనివాసులు, ఎంఎల్ హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

12-7Pg5_12-7Pg5.qxd 11/Jul/26 11:25 PM Page 1



# భారత్‌లో భారీగా న్యూజిలాండ్ పెట్టుబడులు



## వచ్చే 15 యేళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు హామీ

### 10 ఒప్పందాలు సహా 18 కీలక నిర్ణయాలు

### ఇండోపసిఫిక్ ప్రాంత భద్రతపై ఉభయ ప్రధానుల చర్చలు

### సముద్ర భద్రతలో వ్యూహాత్మక భాగస్వామ్యం

**ఆక్లాండ్,జులై 11:** భారత్, న్యూజిలాండ్ తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్ చేసుకున్నాయి. రాబోయే నాలుగేళ్లలో రెండు దేశాల మధ్య బంధాన్ని మరింత విస్తరించేందుకు వ్యూహాత్మక భాగస్వామ్య రోడ్‌మ్యాప్ 2030ని ఆవిష్కరించాయి. 2030 నాటికి వస్తువులు, సేవల రంగాల్లో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సుమారు రూ.35 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాయి. రాబోయే 15 యేళ్ల పాటు భారత్‌లో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ హామీ ఇచ్చింది. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న, ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో విస్తృత చర్చలు జరిపారు. ఈ భేటీలో 10 ఒప్పందాలతో సహా మొత్తం 18 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇద్దరు ప్రధానులు ఇండోపసిఫిక్‌ప్రాంత భద్రత, స్థిరత్వంపై విస్తృతంగా చర్చించారు. స్వేచ్ఛా యుతమైన, అందరికీ అందుబాటులో ఉండే, అభివృద్ధి చెందే ఇండోపసిఫిక్ ప్రాంత నిర్మాణానికి కలిసి పనిచేయాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటిం చారు. ప్రతి దేశం సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం, అంతర్జాతీయ నిబంధనల ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయడం అత్యంత అవసరమని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ సముద్ర చట్టాలకు అనుగుణంగా సముద్ర మార్గాల్లో నౌకల రాకపోకలు, విమానాల స్వేచ్ఛాయుత ప్రయాణం నిరంతరంగా కొనసాగా ల్సిన అవసరాన్ని ఇరు దేశాలు నొక్కి చెప్పాయి. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందం సూత్రాలను గౌరవించాలని అభిప్రాయపడ్డాయి. ఇండోపసిఫిక్‌లో పెరుగుతున్న వ్యూహాత్మక సవాళ్ల దృష్ట్యా సముద్ర భద్రత రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని భారత్, న్యూజిలాండ్ నిర్ణయించాయి. దీనికోసం ప్రత్యేక మారిటైమ్ సెక్యూరిటీ డైలాగ్ ఏర్పాటు చేయాలని అంగీకరించాయి. ఈ వేదిక ద్వారా సమాచారమార్పిడి, సమన్వయం, సంయుక్త చర్యలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే పరస్పర లాజిస్టిక్ సహకార ఒప్పందం ద్వారా ఇరు దేశాల నౌకాదళాల మధ్య కార్యాచరణ సామర్థ్యం మరింత పెరుగుతుందనిఅధికారులు భావిస్తున్నారు.

**వాణిజ్యానికి కొత్త ఊపు**

ఇటీవల కుదిరిన భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) అమలుకు వేగం తీసుకురావాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ ఒప్పందం త్వరగా అమల్లోకి వచ్చేలా అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రధానులు అంగీకరించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వస్తు, సేవల వాణిజ్యాన్ని 700కోట్ల న్యూజిలాండ్ డాలర్లు, అంటే సుమారు రూ.35 వేల కోట్లకు పెంచే లక్ష్యాన్ని నిర్దేశించుకు న్నారు. పెట్టుబడులు, సాంకేతికత, వ్యవసాయం, విద్య, ఆవిష్కరణలు, సేవల రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు.

**ఐక్యరాజ్యసమితి సంస్కరణలకు మద్దతు**

ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్య సమితిలో సమగ్ర సంస్కరణలు అవసరమని మోడీ,లక్సన్ అభిప్రాయపడ్డారు. అంతర్జా తీయ సంస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయా లంటే ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వాటి నిర్మాణంలో మార్పులు అవసరమని పేర్కొన్నారు.

**కస్టమ్స్, పర్యాటక రంగాల్లో కీలక నిర్ణయాలు**

విశ్వసనీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు కస్టమ్స్ ప్రక్రియలను సరళీకృతం చేసే అథరైజ్డ్ ఎకనామిక్ ఆపరేటర్స్ మ్యూచువల్ రికగ్నిషన్ అరేంజ్‌మెంట్ అమలుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పర్యటక రంగంలో అవగాహన ఒప్పందాన్ని స్వాగతించిన ఇరు దేశాలు, భారత్, న్యూజిలాండ్ మధ్య ప్రత్యక్ష నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు విమానయాన సంస్థలు ముందుకు రావాలని కోరాయి.

**వ్యవసాయం, పాడి పరిశ్రమల్లో సహకారం**

ఉద్యానవనం, అటవీ, పశుసంవర్ధక, పాల ఉత్పత్తి రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించారు. కివీ పండ్లు, యాపిల్స్, తేనె ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నారు. భారత్‌లో కివీ పరిశోధన, ఉత్పత్తి కోసం సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్‌ల ఏర్పాటుకు కూడా సహకరించనుంది న్యూజిలాండ్.

పశుసంవర్ధక, పాడి పరిశ్రమలపై ప్రత్యేక అవగాహన ఒప్పందం కూడా కుదిరింది.

ప్రధాని నరేంద్ర మోడీ మూడు దేశాల విదేశీ పర్యటనలో చివరి దశగా ఆక్లాండ్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో ఇండోపసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.



# నన్ను చంపితే ఇరాన్ పూర్తిగా ధ్వంసమే

### వెయ్యి క్షిపణులను లోడ్‌చేసి పెట్టాం

### తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

**వాషింగ్టన్, జులై 11:** అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో హెచ్చరిక చేశారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే వెయ్యి క్షిపణులను లోడ్ చేసి పెట్టామని వెల్లడించారు. ఆ వెంటనే వేలాదిగా విరుచుకుపడతాయని, అందుకు సంబంధించి సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్న దానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకుముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్‌పై బాంబుల వర్షంకురిపించాలని సూచనలు జారీచేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్‌పై దాడులు చేయడం.. ఆ వెంటనే ఆదేశంపై అమెరికా క్షిపణులవర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధ మేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్‌చేసిన వ్యాఖ్యలనుకూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. 'యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్నిఉల్లంఘిస్తారో..అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగాఉంటాం' అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

# ఇరాన్ అణుకేంద్రాల వద్ద మళ్లీ కార్యకలాపాలు

### పశ్చిమాసియాలో భగ్గుమన్న ఉద్రిక్తతలు

**టెహ్రాన్, జులై 11**: పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. ఈ సమయంలో ఇరాన్ అణు కేంద్రాల వద్ద మళ్లీ కార్యకలాపాలు మొదలయ్యాయని, ఈ విషయం ఉపగ్రహ చిత్రాల ఆధారంగా తెలిసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇటీవల అమెరికా దాడుల్లో అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటిని పునర్నిర్మించేందుకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఇనిస్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ ఈ చిత్రాలను విశ్లేషించింది. హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై దాడుల నేపథ్యంలో ఇరాన్‌తో డీల్ ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దానికిముందే, జూన్ చివర్లోనే ఇరాన్ ఈ అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మాణ పరికరాలు, వాహనాల కదలికలు, దెబ్బతిన్న నిర్మాణాల్లో మార్పులు వంటివి అణు కేంద్రాల వద్ద కనిపించాయి. దీంతో అణు కార్యకలాపాల పునుద్ధరణ కోసం ఇరాన్ ప్రయత్నాలు ప్రారంభించిందా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే నష్టాన్ని అంచనా వేసేందుకు శిథిలాలను తొలగించే చర్యకూడా అయి ఉండొచ్చని తెలుస్తోంది. స్పష్టంగా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయన్నది మాత్రం తెలియరాలేదు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని, శుద్ధి చేసిన యురేనియాన్ని వారి వద్ద ఉంచుకోకూడదన్న కీలక షరతులతోనే తమ మధ్య ఒప్పందం కుదిరిందని అమెరికా చెబుతోంది. హర్మూజ్‌పై నియంత్రణ కోల్పోతే అణు కార్యక్రమం వంటి కీలకాంశాల్లో అగ్రరాజ్యానికి తలొగ్గాల్సి వస్తుందనే ఆందోళన ఇరాన్‌లో ఉంది. ఈ క్రమంలోనే తన పట్టు నిలపుకొనేందుకు హర్మూజ్‌ను ఇరాన్ ఒక ఆయుధంగా వాడుకోవాలని చూస్తోందని, తన అనుమతి లేకుండా ప్రయాణిస్తోన్న నౌకలపై దాడులు చేస్తోందనే వాదనా ఉంది. తాజా ఘర్షణలకు అదే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మహిళలకు ఓటు హక్కు కల్పించినదేశం న్యూజిలాండ్

### ఆక్లాండ్ సదస్సులో ప్రధాని మోడీ ప్రశంసలు

**ఆక్లాండ్,జులై 11:** మహిళలకు మొట్టమొదట ఓటు హక్కు కల్పించిన దేశం న్యూజిలాండ్ అని నేడు న్యూజిలాండ్ సమాజానికి మహిళలు పెద్ద ఎత్తున సేవలందిస్తున్నారని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. భారతదేశం కూడా మహిళా నేతృత్వ అభివృద్ధి అనే మంత్రంతో మహిళలకు కొత్త అవకాశాల తలుపులు తెరుస్తోంది. న్యూజిలాండ్‌లో వీధులు కూడా భారతీయ నగరాలను గౌరవిస్తాయి. ఎక్కడో ఖండాలా, ఎక్కడో బొంబాయి హిల్స్, ఎక్కడో కోర మండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్ సర్ స్ట్రీట్ ఇలా ఎన్నో పేర్లు ఉన్నాయి. అక్కడ నివసిస్తున్న మీరుకూడా పూర్తిగా ఒక కివీగా మారి పోయారు. నేను ఏ న్యూజిలాండ్ నాయకుడిని కలిసినా, ఆయన మిమ్మల్నందరినీ ప్రశంసిస్తారు. ఆ ప్రశంస మీకే దక్కుతుంది, నేను గర్వంగా తల ఎత్తుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రధాని మోడీ బాల్యాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఒక సాధారణ నేపథ్యం నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగారు. ఆయన లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేయడంలో సహాయపడ్డారు. ఆయన మన కాలంలోని అత్యంత ముఖ్యమైన నాయకులలో ఒకరు, న్యూజిలాండ్‌కు నిజమైన స్నేహితుడని కొనియాడారు.

# బహామాస్‌లో కుప్పకూలిన విమానం



### 10 మంది స్పాట్‌లోనే మృతి, పలువురికి గాయాలు

**నసావు,జులై 11:** కరేబియన్ దేశమైన బహామాస్ దీవుల్లో ఒక ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక చిన్న ప్రైవేట్ విమాన ప్రమాదంలో ఏకంగా 10 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ప్రమాదం నార్త్ ఆండ్రోస్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఇది బహామాస్ రాజధాని నసావుకు పశ్చిమ దిశలో సముద్ర తీరానికి సమీపంలో ఉంటుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక రక్షణ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విమానంలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడినట్లు బహామాస్ ప్రధాన మంత్రి ఫిలిప్ బ్రేవ్ డేవిస్ మొదట ప్రకటించినప్పటికీ ఆ తర్వాతజరిగిన అత్యవసర ప్రెస్ కాన్ఫరెన్స్‌లో, తీవ్ర గాయాలకారణంగా ఆవ్యక్తికూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు ధృవీకరించారు. మరణించిన వారి వివరాలను అధికారులు ఇంకా అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ తీరని విషాదం దేశమంతా ఎంతో సంతోషంగా పండుగ జరుపుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం ఆ దేశాన్ని తీవ్ర శోకసంద్రంలో ముంచేసింది. ఈ ఘటనపై బహామాస్ ప్రధాన మంత్రి ఫిలిప్ బ్రేవ్ డేవిస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బహామాస్ ప్రజలంతా దేశ 53వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా జరుపుకుంటున్న తరుణంలో ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరమని, ఈ పండుగ రోజు కాస్తా దేశానికి పెద్ద శోకదినంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విమానం రాజధాని నసావులోని ప్రసిద్ధ లిండన్ పిండ్లింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికులతో బయలుదేరింది. ఇది సాన్ ఆండ్రోస్ వైపు వెళ్తుండగా మార్గమధ్యంలోనే అదుపుతప్పి నార్త్ ఆండ్రోస్ సమీపంలో కుప్పకూలిపోయింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక లోపం తలెత్తిందా లేక వాతావరణం అనుకూలించలేదా అనే కోణంలో దర్యాప్తు సంస్థలు ఆధారాలు సేకరిస్తున్నాయి. ఒకే రోజులో రెండు ప్రమాదాలు ఈ ఘోర ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే బహామాస్ ఇంధన, యుటిలిటీస్, ఏవియేషన్ మంత్రిత్వ శాఖ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రమాదానికి గురైన విమాన సంస్థ ఫ్లెమింగో ఎయిర్‌కు చెందిన ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికేట్‌ను ప్రభుత్వం తక్షణమే సస్పెండ్ చేసింది. అంటే ఆ సంస్థకు చెందిన అన్ని విమానాల సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. విమాన ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుగుతున్నందున, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఈ ముందస్తు జాగ్రత్త చర్య తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే కేవలం ఈ ఒక్క ప్రమాదమే కాకుండా, ఫ్లెమింగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన మరో విమానంలో కూడా భద్రతా లోపం తలెత్తడం ఈ సస్పెన్షన్‌కు దారితీసింది.

# ముందుగా వందేమాతరం, తర్వాత జనగణమన

### గీతాలను తప్పక ఆలపించాలి ఆ తర్వాతే రాష్ట్ర గీతం

### స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ,జులై 11**: జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందే మాతరం, రాష్ట్ర గీతాల ఆలాపన విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు ఈ మేరకు ఈ నెల 9న ఆదేశాలు పంపింది. అధికారిక కార్యక్రమాలలో జాతీయ చిహ్నాల గౌరవాన్ని కాపాడటం, ఏకరూపతను పాటించడంకోసం ఈ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులలో ఇప్పటికే ఉన్న ఆదేశాలను పునరుద్ఘాటిస్తూ, కొన్ని కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. జాతీయ గీతం పాడేటప్పుడు లేదా దాని సంగీతం వినిపించినప్పుడు ప్రేక్షకులు తప్పనిసరిగా నిలబడి అటెన్షన్‌లో ఉండాలి. అయితే, వార్తా చిత్రాలు (న్యూస్‌రీల్స్) లేదా డాక్యుమెంటరీల ప్రదర్శన సమయంలో జాతీయ గీతం వస్తే, ప్రదర్శనకు అంతరాయం కలగకుండా ఉండేందుకు నిలబడాల్సిన అవసరం లేదని మినహాయింపు ఇచ్చింది. ఇది ఎప్పటి నుంచో ఉన్న నిబంధన అయినప్పటికీ, దీన్ని మరోసారి గుర్తుచేసింది. అధికారిక కార్యక్రమాల్లో రాష్ట్ర గీతంతో పాటు జాతీయ గేయం, జాతీయ గీతం కూడా ఆలపించాల్సి వస్తే, పాటించాల్సిన క్రమంపై హోంశాఖ స్పష్టతనిచ్చింది. దీని ప్రకారం.. ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమనలను పూర్తిగా ఆలపించాలి. ఈ రెండు పాడడం పూర్తయ్యాక మాత్రమే ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అధికారిక రాష్ట్ర గీతాన్ని పాడాల్సి ఉంటుంది. జాతీయ గౌరవాన్ని కాపాడేందుకే ఈ ప్రాధాన్యత క్రమాన్ని నిర్దేశించినట్లు కేంద్రం పేర్కొంది. విదేశీ ప్రముఖులు, ప్రతినిధులు హాజరయ్యే కార్యక్రమాల విషయంలోనూ ప్రోటోకాల్‌ను హోం శాఖ వివరించింది. గౌరవ వందనం స్వీకరించే విదేశీ అతిథి ఉన్నప్పుడు, మొదట ఆ దేశ జాతీయ గీతాన్ని పూర్తిగా ప్లే చేసి, ఆ తర్వాత భారత జాతీయ గీతాన్ని ప్లే చేయాలి. విదేశీ దౌత్య కార్యాలయాలు నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలకు కూడా ఇదే తరహా నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది.

బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతీయ గేయం హోదాను కలిగి ఉండగా, రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన జాతీయ గీతంగా గుర్తింపు పొందిందని ఈ ఆదేశాల్లో మరోసారి గుర్తుచేశారు. ఈ యేడాది ఫిబ్రవరిలో వందేమాతరం పూర్తి ఆలాపనపై ఇచ్చిన ఆదేశాలకు కొనసాగింపుగా తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జాతీయ గీతం, గేయాలకు సంబంధించిన అధికారిక పాఠాలు, సరైన ఉచ్చారణ, లిపి వంటి వివరాలు తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని హోం శాఖ తెలిపింది. జెండా వందనం వంటి అంశాలలో ప్రజల విచక్షణకే వదిలేస్తున్నామని, సందర్భం లేకుండా విచక్షణారహితంగా జాతీయ గీతాన్ని పాడటం లేదా ప్లే చేయడాన్ని మానుకోవాలని సూచించింది. దేశ సాంస్కృతిక వారసత్వం, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, జాతీయ చిహ్నాల పట్ల గౌరవాన్ని, దేశ ప్రజలలో ఐక్యతను పెంపొందించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.



## జమిలి ఎన్నికలు 2029 నుంచే

### జెపిసి ఛైర్మన్ జెపి చౌదరి

**న్యూఢిల్లీ, జులై 11:** లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ 2029లో కచ్చితంగా సాకారమవుతుందని పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జెపిసి) చీఫ్, కేంద్ర మాజీ మంత్రి పిపి చౌధరి ఆశాభావం వ్యక్తంచేశారు. ఒక దేశంఒకే ఎన్నిక బిల్లుపై గోవా సిఎం ప్రమోద్ సావంత్, మంత్రి వర్గంతో చర్చల కోసం గోవాలో జెపిసి సమావేశ మైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లా డారు. వివిధ అవకాశాలు, ఆలోచనలపై అధ్యయనం చేస్తున్నామని అన్ని రాజకీయ పార్టీలకు ఆమోదయోగ్యమైన విధానం రూపకల్పనకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఒకేసారి ఎన్నికలకు పార్టీలు, కొందరు సిఎంలు స్వచ్ఛందంగా అంగీ కరిస్తే కొన్నిరాష్ట్రాల ఎన్నికలను ముందుగానే.. అంటే2029లో నిర్వహించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. జమిలి ఎన్నికలను ఎలా నిర్వహిస్తే బాగుంటుంది ఎదురయ్యే సవాళ్లు ఏమిటి వాటిని ఎలా పరిష్కరించాలో గోవా ముఖ్యమంత్రి అభిప్రాయాలు తెలుసుకున్నామనితెలిపారు. జెపిసి ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణా, ఢిల్లీల్లో పర్యటించిందని రాజ్యాంగ నిపుణులు, విద్యావేత్తలు, పౌరసమాజం సంస్థలు తదితరులను కలిసిందనిచెప్పారు. తదుపరి లోక్‌సభ ఎన్నికలుజరిగే 2029నాటికి ఒక దేశం ఒకే ఎన్నిక్ర కార్యరూపం దాలుస్తుందన్న సంకేతాలు అందుతున్నాయని తెలిపారు.

# ఆస్ట్రేలియాలో పెచ్చుమీరుతున్న జాత్యహంకారం

### ట్రక్కుడ్రైవర్లకు విద్వేషకారుల హెచ్చరికలు

**కాన్‌బెర్రా, జులై 11:** భారత్, ఆస్ట్రేలియాలు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతానికి కృషి చేస్తున్నప్పటికీ అక్కడ భారతీయులు ఎదుర్కొంటున్న తీవ్రమైన జాత్యహంకార సమస్య ఎవరి దృష్టికి రాకుండా ఉండిపోయింది. ఆస్ట్రేలియాలోని భారతీయ ట్రక్కు డ్రైవర్లపై జాత్యహంకార దాడులు, దూషణలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.

వారిని చంపుతామని లేదా అంతకంటే ఘోరంగా హింసిస్తామని చాలా మంది బెదిరింపులకు దిగుతున్నారు. వీరిలో చాలా మందికి ఇప్పటికే ఆస్ట్రేలియా పౌరసత్వం ఉన్నప్పటికీ జాత్యహంకార దూషణలకు గురవుతున్నారు. ఆస్ట్రేలియాలో రవాణా రంగానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ట్రక్కులు నడకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చాలా సాఫీగా సాగిపోతున్నట్టు కనిపించే ఈ రంగం వెనుక పరిష్కారం లేని ఓ పెద్ద సమస్య దాగి ఉంది. ఇది వలస డ్రైవర్ల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తాము ఎదుర్కొంటున్న జాత్యహంకార దూషణలను, వ్యవస్థాగత దోపిడీని భారతీయ డ్రైవర్లు ఎబిసి న్యూస్‌తో పంచుకున్నారు. డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉన్న సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి తాము సేవలను అందిస్తున్నందుకే ఈ వివక్ష ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. ఆస్ట్రేలియా రవాణా రంగంలో ప్రస్తుతం భారతీయ డ్రైవర్లు అత్యంత ముఖ్యమైన వలస శ్రామిక శక్తిగా మారారు.

అయినప్పటికీ వీరు నిరంతరం వేధింపులకు గురవుతున్నారు. పిప్పల్ సింగ్ అనే భారతీయ ట్రక్కు డ్రైవర్ కమ్యూనికేషన్ రేడియో ద్వారా తమకు వచ్చిన బెదిరింపులను రికార్డ్ చేశారు. 'ఇక్కడ త్వరలోనే అంతర్యుద్ధం రాబోతోంది మేము భారతీయ పురుషులందరినీ చంపేస్తాం పిల్లలను పాతిపెట్టి, మహిళలను అమ్మేస్తాం శ్వేతజాతీయుల ఎదుట ముకికి భారతీయులు నిలబడలేరు' అని ఓ ఆస్ట్రేలియన్ చేసిన బెదిరింపులు అందులో రికార్డయ్యాయి. ‘మంచి భారతీయుడు అంటే చచ్చినవాడే అని మరొకడు మాట్లాడాడు. ఇటువంటి బెదిరింపులతో చాలా మంది భారతీయ ట్రక్కు డ్రైవర్లు ప్రస్తుతం రేడియోను ఉపయోగించడం మానేశారు. సోషల్ మీడియాలోనూ డ్రైవర్లను ఎగతాళి చేస్తూ జాత్యహంకార మీమ్స్ షేర్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా ఆస్ట్రేలియాలో అత్యంత వేగంగా పెరుగుతున్న వలసదారుల సమూహంలో భారతీయులు మొదటి స్థానంలో ఉన్నారు. వీరిలో చాలామంది రవాణా రంగంలో దీర్ఘకాలంగా ఉన్న కార్మికుల కొరతను తీరుస్తున్నారు. అంతర్జాతీయ రోడ్డు రవాణా సంఘం అంచనా ప్రకారం 2024లో అనుభవజ్ఞులైన డ్రైవర్లు పదవీ విరమణ చేయడం, ఆస్ట్రేలియా యువత ఈ వృత్తిపై ఆసక్తి చూపకపోవడంతో సుమారు 28వేల మంది భారీ వాహన డ్రైవర్ల కొరత ఉంది. భారత్‌లో వ్యవసాయం, రవాణా పరిశ్రమతో అనుబంధం కారణంగా, చాలా మంది సిక్కు, పంజాబీ వలసదారులకు ట్రక్కు డ్రైవింగ్ సహజంగానే అలవడింది. ‘ఇది నా రక్తంలోనే ఉందని జస్విందర్ అనే ట్రక్కు డ్రైవర్ అన్నారు. ఇండియాలో మా నాన్నకు సొంత రవాణా సంస్థ ఉండేది, అందుకే నాకు మొదటి నుంచీ ట్రక్కులంటే చాలా ఇష్టం అని ఆయన చెప్పారు.

# సంక్షిప్త వార్తలు

## వెనెజులా విలయం.. నాలుగు వేలు దాటిన మృతులు



**కారకస్, జులై 11:** వెనుజులాలో గత నెల 24న సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో ఇప్పటివరకు 4వేలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. 16,740 మంది గాయపడగా.. భవన శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నారు. ఇంకా చాలా మంది జాడ తెలియరాలేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు శుక్రవారం కారకస్‌లో 3.0 తీవ్రతతో భూకంపం సంభవించడంతో స్థానికంగా ఉన్న భవనాలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## పెళ్లివిందులో మటన్‌లేదని ఘర్షణ


**పాట్నా,జులై 11:** బీహార్‌లో ఓ నిఖా విందులో హింస చోటుచేసుకున్నది. వధూవరులకు చెందిన కుటుంబసభ్యులు కొట్టుకున్నారు. విందు సమయంలో ఈ ఘటన జరిగింది. పెళ్లి విందులో మటన్ పెట్టలేదని వరుడి వర్గం వాగ్వాదానికి దిగింది. అయితే ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. సహ్రస జిల్లాలోని సిమ్రి భక్త్యార్‌పూర్ గ్రామంలో ఈ కొట్లాట జరిగింది. అమ్మాయి, అబ్బాయి తరపున బంధులు తన్నుకున్న ఘటనలో మొత్తం 12 మంది గాయపడ్డారు. విందులో మటన్ పెడుతామని చెప్పిన అమ్మాయి తరపున కుటుంబీకులు హామీ ఇచ్చారు, కానీ భోజనంలో చికెన్ పెట్టడాన్ని వ్యతిరేకించారు.

## బెటాలియన్ కమాండింగ్ అధికారిగా భారత సంతతి యువతి



**న్యూఢిల్లీ:** భారతీయ సంతతికి చెందిన 17 ఏళ్ల అమ్మాయి రిద్ధి చౌహాన్ అమెరికాలో దూసుకెళుతోంది. న్యూయార్క్‌లోని తన స్కూల్‌లో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నది. నేవీ జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్‌కు ఆమె లీడర్ అయ్యింది. ప్రస్తుతం అమెరికా యువతకు ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు. న్యూయార్క్‌లోని బెంజిమన్ కార్డోజో హై స్కూల్‌కు నేవీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అయ్యారు. ఎన్‌జేఆర్‌ఓటీసీ ప్రోగ్రామ్‌లో హయ్యస్ట్ ర్యాంక్ స్టూడెంట్‌గా నిలిచిందామె. ఆ గ్రూపులోఉన్న సుమారు 300మంది క్యాడెట్లకు ఆమె నాయకత్వం వహిస్తున్నది. బెటాలియన్ ఆపరేషన్స్, ట్రైనింగ్, స్టూడెంట్ వెల్ఫేర్ చూసుకుంటూ, అకాడమిక్ చదువులోనూ నిమగ్నమవుతోంది.

## ప్రశాంత్‌కిశోర్‌పై అభ్యర్థిని మార్చిన బిజెపి



**పాట్నా,జులై 11:** బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక పోరు నాటకీయ మలుపు తీసుకున్నది. నామినేషన్ దాఖలు చేసిన ఒక రోజు తర్వాత తన అభ్యర్థిని బిజెపి ఆకస్మికంగా మార్చింది. జన సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్‌పై సాధారణ నేతను పోటీకి దించింది. అభిషేక్ బంటీ స్థానంలో నీరజ్ కుమార్ సిన్హాను తమ అభ్యర్థిగా బిజెపి ప్రకటించింది. దీంతో తొలిసారి ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రశాంత్ కిషోర్‌తో నీరజ్ కుమార్ సిన్హా తలపడనున్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నికైన తర్వాత బంకీపూర్ స్థానాన్ని ఖాళీ చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. బిజెపికి కంచుకోట అయిన ఈ స్థానంలో పోటీ చేసే అభ్యర్థిగా తొలుత అభిషేక్ బంటీ పేరు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం సీఎం సమ్రాట్ చౌదరి, పార్టీ అగ్ర నేతల సమక్షంలో ఆయన అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. వ్యక్తిగత కారణాల్ల వల్ల ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నట్లు అభిషేక్ బంటీ వెల్లడించారు.

## తిరుమల సమాచారం



# 17న ఆణివార ఆస్థానం

### ఎల్లుండి కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం

### రేపు విఐపి బ్రేక్‌కు సిఫార్సులు తీసుకోరు

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17వతేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 14వతేదీ మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. రానున్న మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. 17న ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. 14వతేదీ అష్టదళ పాదపద్మారాధన సేవరద్దుచేశారు. సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించరు. మంగళవారం విఐపి బ్రేక్ రద్దు చేశారు.



## తిరుమల కొండపై విపరీతమైన రద్దీ

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం కావడంతో తిరుమలలో క్యూ కాంప్లెక్స్‌లు దాటి క్యూలైన్లు బాటగంగమ్మఆలయం వరకు విస్తరించాయి. పెరిగిన భక్తులతాకిడితో కొండ కిటకిటలాడుతోంది. వారాంతం వరుస సెలవులతో శనివారం ఉదయానికి కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 24నుండి 30 గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని, భక్తులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారంరాత్రి వరకు 73,265 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం 4.26 కోట్ల రూపాయలు ఆదాయం లభించింది. ఆదివారం కూడా ఈ రద్దీ కొనసాగనుంది.



## ప్రాణదాన పథకానికి వైద్యుడి విరాళం

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు,ట్రస్టులలో ఎస్వీప్రాణదానం కూడా ప్రధానమైంది. ఎంతోమంది పేదలకు పలు రకాల అత్యాధునిక వైద్యం అందించేందుకు ఈ ట్రస్ట్ దోహదపడుతుంది. ఈ ట్రస్ట్‌కు తిరుపతికి చెందిన నారాయణాద్రి ఆస్పత్రి అధినేత డాక్టర్ సునందకుమార్ రెడ్డి, ఉషారాణి దంపతులు శనివారం 10లక్షల రూపాయల విరాళాన్ని ఇచ్చారు. ఈ విరాళాలను డాక్టర్ సునందకుమార్‌రెడ్డి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

## అలిపిరిమెట్ల మార్గంలో చిరుత

### మళ్లీ సంచారంతో భక్తుల్లో భయం

**తిరుమల,జులై 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నుండి తిరుమలకు గోవింద నామస్మరణతో కాలినడకన వచ్చే అలిపిరి మెట్లమార్గంలో అతి సమీపంలో శుక్రవారం రాత్రి చిరుత సంచరించడంతో కాలినడక భక్తులు వణికిపోయారు. ఈ మార్గంలో తిరుమలకు వస్తున్న భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మెట్ల మార్గానికి అతి సమీపంలో చిరుత ప్రత్యక్షం కావడంతో భయంతో బిగుసుకుపోయారు. కేకలు వేస్తూ, శబ్దం చేస్తూ దాన్ని తరిమికొట్టే ప్రయత్నం చేశారు. రాత్రి వేళ చిరుత సంచారంతో వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భద్రత చర్యలు చేపట్టారు .

శనివారం తెల్లవారు జామున తిరుమలకువస్తున్న శ్రీవారి భక్తులు అలిపిరి నడకమార్గంలో లక్ష్మీ ృ నరసింహస్వామి ఆలయానికి అతి సమీపంలో పొదల్లో చిరుతను గుర్తించారు. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అటూ ఇటు పరుగులు తీశారు. ఆనుపరాడ్లతో శబ్దంచేశారు. చిరుత కదలికపై నిఘా పెట్టారు. అలిపిరి కాలినడక మార్గంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఇదివరకే అమర్చిన ట్రాఫ్‌కెమెరాలతో చిరుత సంచారాన్ని కనిపెడుతున్నారు. గతంలో లాగే తిరుమల కాలినడక మార్గాల్లో మళ్ళీ చిరుతల సంచారం మొదలైందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది అలిపిరి నడక దారిలో చిరుత సంచరించిన విషయం తెలిసిందే. 350వ మెట్టు సమీపంలో, అలిపిరి ఎస్వీజూ పార్క్ మార్గంలో, శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీ క్యాంపస్ ఆవరణలో చిరుతల సంచారం ఉంది.

అటవీప్రాంతంలో నీరు,ఆహారం దొరకక దారి తప్పిన చిరుతపులులు ఏకంగా ఘాట్‌రోడ్లపై, కాలినడక మార్గాల్లో భక్తులకు కనిపిస్తున్నాయి. అటవీప్రాంతం వదలి భక్తుల సంచారం ప్రాంతాల్లో వచ్చేస్తుండటంతో భయంతో వణికిపోతున్నారు. సాధారణంగా శేషాచలంఅటవీప్రాంతంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక,ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో లింకురోడ్డు దాటిన తరువాత గతంలో చిరుతల జాఢ ఉండేది. గతంలో మొదటిఘాట్‌లోనేగాక రెండోఘాట్‌లోనూ, కాలినడక మార్గంలోనూ ఆగస్ట్, సెప్టెంబర్‌మాసాల్లో భక్తులపై చిరుతపులులు దాడిచేయడం, ఏకంగా చిన్నారులను హతమార్చిన ఘటనలు విధితమే. శేషాచలం అటవీప్రాంతం తిరుమల సప్తగిరులను ఆనుకుని ఉండటం, తిరుపతివైపు మంగళం, కరకంబాడి, మామండూరు, కుక్కలదొడ్డివరకు వ్యాపించిఉంది. ఇటు చంద్ర గిరి, శ్రీవారిమెట్టు, ఏ.రంగపేట, భాకరాపేట, పీలేరువరకు శేషాచలం అడ వులు ఉన్నాయి. ప్రధానంగా తిరుపతివైపు కపిలతీర్థం, మంగళం, కరకం బాడివైపు ఉన్న అటవీప్రాంతంలో చిరుతపులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు సంచారం ఎక్కువగా ఉంది.

# అంతరాలయం అనుమతించనపుడు టిక్కట్లెందుకు జారీ చేసారు?

### సిబ్బందిపై భక్తుల ఆగ్రహం: సమాధానం చెప్పలేని అధికారులు

### సర్వర్ డౌన్‌తో తిప్పలు

**శ్రీకాళహస్తి,జులై 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులు గత రెండు నెలలుగా ఆన్‌లైన్ సేవలతో తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు అధికారులు రోజుకొక నిర్ణయంతో భక్తుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు. శనివారం శనీశ్వరాభిషేకానికి వచ్చిన భక్తులు ఆన్‌లైన్ మాత్రమే ఆఫ్‌లైన్ లేదనటంతో అభిషేకాలు పూజలు జరిపించుకోకుండానే వెనుదిరిగారు. ఇక భక్తులకు సుదర్శనం కోసం ఏర్పాటు చేసిన సేవల్లో 'అంతరాలయ దర్శనం' ఒకటి. అంతరాలయ



దేవస్థానం జారి చేసిన అంతరాలయ టిక్కెట్లు

దర్శనం రూ.500లు ఖరారు చేసారు. శనివారం అంతరాలయ దర్శనం కోసం పలువురు భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి స్వామి దర్శనానికి వచ్చారు. అయితే భక్తులు రద్దీ అధికమయ్యారని 'అంతరాలయ దర్శనం' రద్దు చేసారు. ఆన్‌లైన్‌లో అంతరాలయ టిక్కెట్లు జారి చేసారు. కానీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దాంతో టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు స్వామి గర్భగుడి వద్ద సిబ్బంది ససేమిరా అన్నారు. దాంతో భక్తుల అసహనానికి గురయ్యారు. తిరుగబడ్డారు. అనుమతించనపుడు టిక్కెట్లు ఎందుకు జారి చేసారని నిలదీసారు. సిబ్బంది మాకు సంబంధం లేదంటే భక్తులు ఎవరిని అడగాలో తెలియక ఇబ్బంది పడ్డారు. అయితే అ ంతరాలయ దర్శనం కావాలంటే మధ్యాహ్నం 3గంటల వరకు ఆగాలని ఉచిత సలహా ఇచ్చారు. అంతరాలయ దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు సిబ్బందితో గొడవ పడుతుంటే 'పిఆర్‌ఓ' కార్యాలయం నుంచి బ్యాచ్ గుంపులు గుంపులుగా రాజమార్గంలో వెళుతుంటే భక్తులు ఆగ్రహానికి హద్దుల్లేకుండా పోయింది.

**సమన్వయం లేని అధికారులు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కొరవడింది. భక్తులకు సేవల టిక్కెట్లును ఆన్‌లైన్‌లో జారి చేసి అనుమతించకపోవటంతో గొడవ ప్రారంభం అయ్యింది. భక్తులు స్వామి గర్భగుడివద్ద గొడవ పడగా భక్తుల్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోమని ఉచిత సలహా ఇచ్చారు. అంటే క్యూలైన్ల నుంచి బయటకు వెళ్ళి కార్యాలయం వెతుక్కొని వెళ్ళి ఫిర్యాదు చేయటం సాధ్యమా? అని ప్రశ్నించారు. అయితే అక్కడ ఉన్న ఓయువకుడు ఎఇఒకు ఫోన్‌చేస్తే నాకేం సంబధం అని జవాబు వచ్చింది. అయితే రద్దీ సమయాల్లో ఇఒ లేనపుడు డెప్యూటిఇఒ పర్యవేక్షించాలి. అయితే ఆయన ఎక్కడా కనబడరు. కార్యాలయం నుంచి కాలు బయట పెట్టరు. సమస్యలను పట్టించుకోరు. ఇక ఎఇఒలు ఒకరిపై ఒకరు ఇలా సమన్వయం కొరవడి భక్తి భావంతో వచ్చిన భక్తుల్ని ముప్పుతిప్పలు పెడుతున్నారు.

# అలిపిరి ఆర్చికి ఆధ్యాత్మిక శోభ ఏదీ?

### మహామండపం తరహాలో మార్పులు ఎప్పుడు!

**తిరుమల, జులై 11 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు ప్రవేశించే ప్రధాన ద్వారం అలిపిరి ఆర్చికి కొత్త ఆధ్యాత్మిక శోభ తీసుకువచ్చేందుకు టిటిడి నిర్ణయించినా ఆ పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. ఇందుకోసం నిర్ణయించిన ప్రణాళికలు కూడా అమలుకు నోచుకోలేదు. తిరుమల క్షేత్రం వైభవాన్ని అలిపిరిలోనే భక్తులు తెలుసుకునేలా బేస్‌క్యాంప్ ఏర్పాటుతోబాటు మహామండపంలోకి వచ్చేలాగా అనుభూతి కలిగించేలా కొత్త డిజైన్లతో మార్పులు చేయాలని ఏడాదిక్రిందట ఆమోదించినా పనులు మాత్రం మొదలుకాలేదు. ఏకంగా ఈ నూతన నిర్మాణ బాధ్యతలను ఆర్కిటెక్ ఆనందసాయికి టిటిడి పాలకమండలి అప్పగించింది. ఇప్పటికే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పేరును తిరుపతి(రేణిగుంట)లోని



విమానాశ్రయానికి మార్పుచేస్తూ టిటిడి పాలకమండలి కేంద్రానికి ప్రతిపాదనలతో నివేదించిన విషయం విదితమే. తిరుపతి విమానాశ్రయం, అలిపిరి ప్రవేశద్వారం ఆర్చ్‌కు కొత్తరూపు తీసుకువచ్చేలా టిటిడి నిర్ణయం అభినందించదగినదైనా ఆ దిశగా మార్పులు మాత్రం జరగలేదు. తిరుమల ఐకానిక్‌గా ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేందుకు టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వాటి డిజైన్లలో పేరెన్నికగన్న ఆర్ట్‌డైరెక్టర్, టెంపుల్స్ ఆర్కిటిక్ ఆనందసాయి బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న ప్రయాణీకుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో విమానాశ్రయంలోనూ తిరుమల శోభ కనిపించేలా మార్పుచేయనున్నారు. అలిపిరిలో మొదట ఉన్న గరుడవిగ్రహం కూడలిలోని ఆర్చిని ఆధునీ కరించాలని ఆలోచనతో టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గతంలో కాలినడకన అలిపిరి నుండి తిరుమలకు చేరుకున్నఆనందసాయి అలిపిరి నుండి ఆనందనిలయం వరకు చేపట్టాల్సిన అభివృద్ధి, ఆధ్యాత్మిక వాతావరణంపై చర్చించారు. రోజువారీగా లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తుంటే ఇందులో 20వేలమంది కాలినడక మార్గాల్లో, 60వేలమంది వరకు భక్తులు వాహనాల్లో ఘాట్‌రోడ్లపై ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో భక్తులు ఒక అనుభూతిచెందేలా మార్పులు జరగనున్నాయి. అలిపిరి వద్ద ఒక ఆధ్యాత్మికంగా మహామండపంలోకి ప్రవేశిస్తున్నామనే భావన భక్తులకు కలిగించేలా అలిపిరి ఆర్చి మార్పులు చేసే పనులు మొదలుపెట్టాలని భక్తులు కోరుతున్నారు.

## రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌చైర్మెన్‌గా పి.షణ్ముగం నియామకం

**చిత్తూరురూరల్, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్‌చైర్మెన్‌గా పి షణ్ముగం నియమితులయ్యారు. శనివారం విజయవాడలోని ఎసిటియు భవన్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఏపి ఒలంపిక్ అసోసియేషన్‌కు అనుబంధంగా వున్న ఏపి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో షణ్ముగం పేరును వైస్‌చైర్మెన్‌గా ప్రతిపాదించగా అనుబంధ జిల్లా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రవ్యాప్తంగా సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంతో నియామకం చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడకు మరింత ప్రోత్సాహం అందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఆయన నియామకం పట్ల క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, అబిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# రెండేళ్లయినా పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించరా!

### రాష్ట్ర ఎస్‌టియు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ధ్వజం

**చిత్తూరు, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు పిఆర్‌సి ఛైర్మన్‌ను సైతం నియమించలేదని రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ధ్వజమెత్తారు. చిత్తూరులోని ఎస్టీయు జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్టీయు కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర ఎస్టీయు అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా సత్వరం పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడంతో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో వున్న 5 డిఎలను మంజూరు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు చేసి అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వీసులోని ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష లేకుండా పార్లమెంటులో విద్యాహక్కు చట్టానికి చట్ట సవరణ చేయడానికి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంను ఒప్పించడానికి కృషి చేయాలన్నారు. అలాగే ఈ నెల 14వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ఎదుట ర్యాలీ, పికెటింగ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత గంటామోహన్‌ను తూర్పు రాయలసీమ



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించి ఎస్టీయు తరపున భవిష్యత్తులో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని తీర్మానం చేసి రాష్ట్ర సంఘానికి ప్రతిపాదనలు పంపారు. ఈ సమావేశంలో ఎస్టీయు నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, షేక్ ఇలియాజ్, పురుషోత్తం, దేవరాజులు, యువరాజు, హేమచంద్రారెడ్డి, బొబ్బిలిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## భక్తుల రద్దీతో పోటెత్తిన కాణిపాకం

**కాణిపాకం, జూలై 11 ప్రభాతవార్త:** వరుస సెలవులతో కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఆలయంలో సాధారణంగా వారంతపు రోజులు, వరుస సెలవు రోజుల్లో తీవ్ర స్థాయిలో భక్తుల రద్దీ వుంటుంది. ఈ మేరకు శని, ఆదివారాల్లో వారాంతపు రోజులతో పాటు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుండి కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి సైతం భక్తులు స్వామి దర్శనార్థం భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయంలోని క్యూ కాంప్లెక్స్, క్యూ లైన్లు పూర్తి రద్దీతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా రూ.100 శీఘ్ర దర్శనం, రూ.150అతి శీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతంగంటల తరబడి క్యూ లైన్లలో వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

# రాజీ మార్గమే రాజమార్గం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

### సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్ కీలకం: కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, జూలై 11, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్, అదనపు ఎస్పీ సౌజన్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయస్థానాలపై కేసుల భారం అధికంగా ఉండటంతో అనేక కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. దీనివల్ల కక్షిదారులు సమయం, ధనం కోల్పోవాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకే రాజీ మార్గమే రాజమార్గం అనే భావనతో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు పక్షాలు పరస్పర అంగికారంతో రాజీకి వస్తే ఇద్దరికీ ప్రయోజనం చేకూరడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థకు ఇళ్ల



పన్ను, వ్యాపార పన్ను, నీటి పన్ను తదితరాల రూపంలో సుమారు రూ.100 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించినప్పుడే ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అభివృద్ధి పనులు, ప్రజా సేవలను సమర్థవంతంగా అందించగలవని చెప్పారు. నేషనల్ లోక్ అదాలత్‌కు ముందు పంపిన నోటీసులకు స్పందించి శుక్రవారం సాయంత్రానికే సుమారు రూ. 1 కోటి పన్నుల బకాయిలు వసూలయ్యాయని వెల్లడించారు. మిగిలిన బకాయిదారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానం ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, భారతదేశంలో కూడా ప్రజలు దీనిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ, కుటుంబ, ఆస్తి, సివిల్ వివాదాల పరిష్కారం న్యాయవ్యవస్థ ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. అలాంటి వివాదాలకు లోక్ అదాలత్ అత్యంత సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు.

## వియత్నాం బోటు ప్రమాదంలో పురం యువకుడు దుర్మరణం



రవితేజ (ఫైల్)

**హిందూ పు రం జులై 11 ప్రభాతవార్త:** వియత్నం దేశంలో విహారయాత్రకు వెళ్లిన శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెంది న రవితేజ(40) దుర్మరణం చెందారు. స్థానిక టీచర్స్ కాలనీలో నివసిస్తున్న రవితేజ ధనలక్ష్మి రోడ్లో లక్కీ మొబైల్ షాపును నిర్వహించేవారు. లావా కంపెనీ ఫోన్లను అధికంగా సేల్ చేయడంతో విహారయాత్రకు సెలెక్ట్ అయి కంపెనీ తరఫున వియత్నానికి మూడు రోజుల క్రితం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో వియత్నం దేశంలో సముద్రంలో స్పీడ్ బోట్ లో వెళ్తుండగా ఒకసారిగా అలల తాకిడి పెరిగి బోటు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో రవితేజతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మృత్యువాత పడ్డారు. ఇదిలా ఉండగా రవితేజ మరణ వార్త తెలుసుకొని కుటుంబ సభ్యులు షాక్ గురయ్యారు. తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు శోక సంద్రంలో పడిపోయారు. రవితేజ తండ్రి ఆదిశేషయ్య చాలా ఏళ్ల క్రితమే చనిపోగా ఆ కుటుంబానికి ఏకైక కుమారుడైన ఇతను కూడా మరణించడంతో మగదిక్కు లేకుండా పోయిందని ఆత్మీయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో మంచివాడిగా పేరొందిన రవితేజ అకాల మరణం చెందడంతో స్నేహితులు, పుర ప్రజలు చలించి పోయారు. వియత్నం నుంచి మృతదేహాన్ని వీలైనంత తొందరగా రప్పించేందుకు భారత ఎంబసీ ద్వారా బంధువులు ప్రయత్నాలు చేస్తున్నారు. వరు సకు అన్న అయినా భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన తమ్ముడు మృతి జీర్ణించుకోలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు.

# కుప్పం చిగురుగుంట 'బంగారు'గనులపై చిగురిస్తున్న ఆశలు

### గనుల ప్రారంభానికి ఊపిరి పోసిన సిఎం చంద్రబాబు ప్రకటన !!

### ముగిసిన టెండర్ల బిడ్ గడువు.. త్వరలోనే టెండర్లు ఖరారు..?

### వేలాదిమందికి ఉపాధి అవకాశాలు.. గనులు తెరచుకుంటే 'స్వర్ణకుప్పమే'

**కుప్పం, జూలై 11 ప్రభాతవార్త:** కుప్పం చిగురుగుంట బంగారు గనులకు త్వరలో మహర్దశ పట్టధం ఖాయంగా కన్పిస్తోంది. దాదాపు పాతికేళ్ల అనంతరం బంగారు గనులు తెరచుకునేందుకు మార్గం సుగమం అవుతోంది. చిగురుగుంట గనుల నిర్వహణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన టెండర్ల బిడ్ ప్రక్రియ రెండు రోజుల క్రితం ముగిసింది. రేపో మాపో టెండర్లు ఖరారయే య్ అవకాశాలు ఉన్నాయి. ఇటీవలే సిఎం చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పం పర్యటనలో చిగురుగుంట బంగారు గనుల్ని మళ్లీ ప్రారంభిస్తామని ప్రకటించడంతో గనుల ప్రారంభంకు మరలా సిఎం ఊపిరిపోశారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో బంగారు గనులు తెరచుకుంటాయని ఆశలు చిగురిస్తున్నాయి.

**1978లో మొదలై 2001లో మూత :** చిగురుగుంట బంగారు గనుల్లో బంగారం తవ్వకాలను 1978లో ఎంఇసిఎల్ అనే సంస్థ ప్రారంభించింది. ఈ సంస్థ 1982వరకు కార్యకలాపాలు కొనసాగించింది. అన ంతరం 2001వరకు ఈ గోల్డ్‌మైన్స్‌ను భారత్ గోల్డ్‌మైన్స్ సంస్థ(బిజిఎంఎల్) నిర్వహించింది. చిగురుగుంటకు సమీపంలోనే కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్(కెజిఎఫ్) బంగారు గనులు, భారత్ గోల్డ్ మైన్స్(బిజిఎంఎల్) సంస్థలు ఉండేవి. చిగురు గుంట గనుల్లో తీసిన ముడి ఖనిజాన్ని కెజిఎఫ్‌కు తరలించి అక్కడ శుద్ధి చేసి బంగారాన్ని వేరుచేసేవారు. అప్పట్లోనే చిగురుగుంట గనుల్లో వేలాది మంది ఉపాధి అవకాశాలు పొందేవారు. అయితే రాను రాను గనుల్లో బంగారు నిక్షేపాలు తగ్గడం, ముడి ఖనిజం వెలికి తీసేందుకు అయ్యే వ్యయం అధికంగా ఉండడంతో చిగురుగుంట గనులతోపాటు కోలార్ గోల్డ్‌ఫీల్డ్ (కెజిఎఫ్) గనులు సైతం 2001లో మూతపడ్డాయి. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఈగనులను మూసేసింది.

**2011లో మైసూర్ జియోచే మరలా పరిశోధన :** 2001లోమూతపడ్డ చిగురుగుంట బంగారు గనుల ప్రాంతంలో మరలా మైసూర్ జియో సంస్థ ముడి బంగారం నిల్వలు ఉన్నాయా లేదా అనే అంశంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో 400 హెక్టార్ల ప్రాంతంలో పరిశోధనలు చేసింది. గనుల ప్రాంతంలో చిన్నపాటి బావులు తీసి వాటి ద్వారా ముడి బంగారం ఏమేర ఉందో నిర్ధారణ చేసి ఆ నిక్షేపాలను అప్పట్లో దేశరాజధాని న్యూఢిల్లీలోని ల్యాబ్‌కు పంపింది. ఈ ప్రాంతంలో ముడి బంగారు ఖనిజం ఉందని నిర్ధారణ అయ్యాక కేంద్రం తదుపరి చర్యలు చేపట్టింది. కాగా చిగురుగుంట ప్రాంతంలో 20లక్షల టన్నులు, బిసానత్తం వద్ద 1లక్ష టన్నులకు పైగా ముడి ఖనిజ నిల్వలు ఉన్నట్లు సమాచారం.

**2018లో మరలా టెండర్లు :** చిగురుగుంట బంగారు గనుల నిర్వహణకు కేంద్రం 2018సం॥ చివర్లో టెండర్లు పిలిచింది. ఆస్ట్రేలియా దేశంకు చెందిన పలు సంస్థలతో పాటు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ('ఎన్ఎండిసి) పోటీ పడ్డాయి. చివరకు ఎన్ఎండిసి సుమారు 500కోట్లకు టెండర్లు ఖరారు చేసుకుంది. తదనంతరం 2019లో అధికారంలో వచ్చాక వైఎస్ జగన్ సిఎంగా ఉన్న సమయంలో చిగురు గుంట గనుల్ని తెరిపిస్తామని పేర్కొన్నా ఆచరణలో సాధ్యం కాలేదు. పర్యావరణ అనుమతులు, ప్రభుత్వంచే గనుల ప్రాంతం అప్పగింత, మైనింగ్ ప్రణాళిక తదితర అంశాలు కొలిక్ి రాకపోవడంతో ఎన్ఎండిసి గతేడాది ఈ ప్రాజెక్టును ఉపస ంహరించుకుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా చిగురుగుంట గనుల నిర్వహణకు టెండర్లు పిలిచాయి. ఈనెల 9తో బిడ్ గడువు ముగిసింది. త్వరలోనే టెండర్లను ప్రభుత్వాలు ఖరారు చేయనున్నాయని తెలుస్తోంది. ఇదే జరిగితే అతి త్వరలోనే కుప్పం గోల్డ్‌మైన్స్ మరోమారు విపణిలో మెరవడం ఖాయమే. చిగురుగుంట గనులు ప్రారంభమైతే కుప్పం ప్రాంతంలో వేలాది మందికి స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. 2011లో చిగురుగుంట గనుల్లో పరిశోధన చేసిన జియో మైసూరు సంస్థ ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన జొన్నగిరి గోల్డ్‌మైన్స్‌ను నిర్వహించడం విశేష ం.



చిగురుగుంట గనుల ప్రాంతం

12-7Pg7exHMNWJQE_12-7Pg7exHMNWJQE.qxd 12/Jul/26 12:04 AM Page 1



# దేశంలోనే ఆదర్శంగా గోదావరి పుష్కరాలు

## సమన్వయంతో శాశ్వత అభివృద్ధి పనులు: రాష్ట్ర మంత్రులు నారాయణ,దుర్గేష్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై11,ప్రభాతవార్త:** గత గోదావరి పుష్కరాల్లో సుమారు 4 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేయగా, ఒక్క రోజే 68 లక్షల మంది స్నానాలు చేసిన నేపథ్యంలో ఈసారి 12 రోజుల పుష్కరాల్లో దాదాపు10 కోట్ల మంది యాత్రికులు గోదావరి తీరం చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి డా. పి. నారాయణ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆ స్థాయికి తగిన విధంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించి నిర్మాణాత్మకంగా పనిచేయాలని వారు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ (ఆర్ఎంసీ) కార్యాలయ సమావేశ మందిరం లో గోదావరి పుష్కరాలు–2027 ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పురపాలక శాఖ మంత్రి డా. పి. నారాయణ మాట్లాడుతూ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో గత పుష్కరాల నిర్వహణలో ఉన్న అనుభవాన్ని సమర్థంగా వినియోగించి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పుష్కరాల కోసం చేపట్టే పనులు తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కాకుండా నగరానికి శాశ్వత ఆస్తులుగా నిలిచే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ ద్వారా నిధులను సమీకరించి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.48 కోట్ల ఆర్ఎంసీ నిధులతో పాటు,ఎల్ఆర్ఎస్ ద్వారా మరో రూ.32 కోట్లు సమీకరించి, అదనంగా రూ.120 కోట్ల గ్రాంట్ పొందేలా చర్యలు చేపడుతున్నామని,తద్వారా సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.టీడీఆర్ బాండ్లకు సంబంధించిన సమగ్ర వివరాల ను వెంటనే సమర్పించాలని అధికారు లను ఆదేశించారు. అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పనులను వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన అంచనాల ను వెంటనే సిద్ధం చేయాలని మంత్రి నారాయణ సూచించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, మురుగునీటి పారుదల వ్యవస్థ, జంక్షన్ల ఆధునీకరణ, శానిటేషన్, విద్యుత్, తాగునీటి వంటి అన్ని అంశాలపై తాజా ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణం గా సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పుష్కరాల విజయవంతమైన నిర్వహణకు రాజమహేంద్రవరం నగరంతో పాటు కొవ్వూరు, నిడదవోలు, ధవళేశ్వరం,పరిసర ప్రాంతాల్లో సమగ్రఅభివృద్ధిఅవసరమన్నారు. నిడదవోలు పరిధిలోని పెండ్యాల, ముక్కామల, తిపర్రు ఘాట్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాల కు తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే కొవ్వూరు– రాజానగరం మండలం విజ్జేశ్వరం – నిడదవోలు వరకు 38 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేస్తే పర్యాటక, రవాణా పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎంఎల్ఏలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ కే. ఆదిత్య శర్మ అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాలతో విధ్వంసం

### ప్రత్యర్థి పార్టీల నేతలు మానసిక ఉన్మాదంతో వ్యవహరిస్తున్నారు
### టీడీపీ కార్యాలయంలో మీడియాతో సీఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై11, ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీకి ఒక రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు ఏమాత్రం లేవని అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అందుకే ఆ పార్టీని గొడ్డలితో పోలుస్తున్నామన్నారు. దౌర్జన్యం,దోపిడి,దాష్టీకం తప్ప ఆ పార్టీ నేతలు వారి పరిపాలనలో చేసిందేమిటంటూ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. తప్పుడు ప్రచారాలు, హత్యారాజకీయాలు ఆ పార్టీ అస్త్రాలన్నారు.వైసిపి నేతలను గమనిస్తే వారిదంతా రక్త చరిత్రేనని విమర్శించారు. తెలంగాణలో ఆరుగురిని కిరాతకంగా హత్య చేసిన హంతకుడి మనస్తత్వానికి, జగన్ వైఖరికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. కడప స్టీల్ ప్లాంట్ పేరుతో ఒక వ్యక్తి అవినీతి దాహానికి లక్షల కోట్ల విలువైన సహజ సంపద ఆవిరైందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పేరుతో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బ్రహ్మణీ స్టీల్స్ కు కేటాయించిన భూములను ప్రభుత్వం ఇప్పటికే వెనక్కి తీసుకుందని,అయితే ఓబులాపురం మైనింగ్ అంశం ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. జగన్, ఆయన కుటుంబం వల్ల ఎందరో ఐఏఎస్ అధికారులు బలయ్యారని, ఎంతోమంది వ్యాపారవేత్తలు సర్వనాశనమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో ఏదో ఒక విధ్వంసం సృష్టించి, పక్క రాష్ట్రంలోని బెంగళూరులో తలదాచుకోవడం వారికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని, నేతలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాను వ్యక్తిత్వ హననాలకు, మహిళలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకుంటున్నారని, ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఫేక్ పోస్టులను కట్టడి చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు. సొంత ప్రయోజనాల కోసం రైతుల భూములను 22ఏ జాబితాలో పెట్టి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరిస్తోందని హామీ ఇచ్చారు.

**బ్రాహ్మణి స్టీల్స్‌తో ఓబులాపురం మైనింగ్ బ్లాక్**

బ్రాహ్మణి స్టీల్స్ దోపిడీ కథ భూముల స్వాధీనంతో ఆగలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. బ్రాహ్మణి స్థలం సమస్యకే ప్రస్తుతానికి చెక్ పడినా, దీనికి లింక్ అయి ఉన్న ఓబులాపురం అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. బ్రాహ్మణి స్టీల్స్ వల్ల ఓబులాపురం మైనింగ్ బ్లాక్ అయిందని ఇవి బ్లాక్ కాకుండా ఉంటే రాష్ట్రానికి ఎన్నో ఏళ్ల నుంచి భారీ పెట్టుబడులు వచ్చేవని తెలిపారు. విశాఖ బాక్సైట్‌ను కూడా ఇలాగే చేశారన్నారు. ఇలాగే పెండింగ్‌లో ఉన్న లేపాక్షి భూముల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు.ఇవన్నీ కొనసాగి ఉంటే నాలుగు సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు భారీగా అనుబంధ పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు లభించేవని తెలిపారు. పెద్దఎత్తున భూమి అందుబాటులో ఉండటమే పెట్టుబడులు రావటానికి పెద్ద సానుకూలత అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావటం గొడ్డలి పార్టీ అధినేతకు ఇష్టం లేదన్న చంద్రబాబు రూ.లక్షల కోట్ల రాష్ట్ర సంపదను దోచుకునేందుకు అభివృద్ధికి అడ్డుకట్ట వేశారని ధ్వజమెత్తారు.

**పెట్టుబడులు రాకుండా చేసేందుకు మావిగన్**

జగన్ నేర మనస్తత్వానికి ఉదాహరణ మావిగన్ అని సీఎం చంద్రబాబు అన్నారు. కేవలం పారిశ్రామి కవేత్తలు, పెట్టుబడులు రాకుండా చేసేందుకు మావిగన్ తీసుకువచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లామని, పోలవరం, వెలుగొండ ప్రాజెక్టులను కూడా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని తెలిపారు.

**చంద్రబాబును కలిసిన టెక్కలి మాజీ ఎమ్మెల్యే వరదా సరోజమ్మ భర్త, ఇద్దరు కుమార్తెలు**

టెక్కలి మాజీ ఎమ్మెల్యే వరదా సరోజమ్మ భర్త, ఇద్దరు కుమార్తెలు సీఎం చంద్రబాబుని కలిశారు. ఈ సందర్భంగా వరదా సరోజమ్మ ఉదంతాన్ని చంద్రబాబు మీడియా వద్ద గుర్తు చేసుకున్నారు. శ్రీకాకుళంలో మొదటి హోటల్ వరదా కుటుంబం పెడితే తాను అప్పట్లో బస చేశానని అన్నారు. ఇప్పుడు ఆ కుటుంబ దయనీయ పరిస్థితి చూసి చలించిపోయానని, సరోజ చనిపోయాక.. కొడుకు ఆస్తి లాగేసుకుని తండ్రిని, తోబుట్టువులను గెంటేశాడని అన్నారు. ఆ కుటుంబ పరిస్థితి చూసి జాలేసిందని, తప్పక న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గొడ్డలి పార్టీ అధినేతది కూడా ఇదే మనస్తత్వం కదా అని, ఆస్తి ఇవ్వకుండా తల్లి, చెల్లిని బయటకు గెంటే సంస్కృతి పెరుగుతుండటం దురదృష్టకరమని సీఎం వ్యాఖ్యానించారు.

# గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుపై నివేదిక ఇవ్వాలి

## రాష్ట్ర ఎన్నికల సంఘం

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్ని గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుందో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీరాజ్ శాఖను కోరింది. కోర్టు కేసుల కారణంగా గతంలో ఎన్నిక నిర్వహించని 331 పంచాయతీల్లో తాజా పరి స్థితి ఏమిటో తెలియ జేయాలని ఆదేశం చింది. పుర, నగరపా లక సంస్థలు, నగర పంచాయతీల్లో విలీనం చేసిన పంచాయతీల విషయంలో వివాదాలు ఉన్నాయా అనేదీ స్పష్టం చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిలచంద్ర పునేతా పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు లేఖ రాశారు.

పంచాయతీల్లో సర్పం చుల పదవీ కాలం ఏప్రిల్ 2న ముగియడంతో తిరిగి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తు న్నారు. వార్డుల వారీగా ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియ పూర్తయింది. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఈ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయడంతో ఎన్నికల కమిషన్ కూడా ఏర్పాట్లు చేస్తోంది.పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు.

331 పంచాయతీలను కోర్టు కేసులు, ఇతరత్రా వివాదాల కారణంగా పక్కన పెట్టారు. ఈసారి అన్ని పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎలా ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్ఈసీ లేఖ రాయడంతో కమిషనర్ కార్యాలయం పెండింగ్ కోర్టు కేసుల వివరాలు బయటకు తీస్తోంది. వీటిలో 51 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించొచ్చని అధికారులు ప్రాథ మికగా అంచనాకు వచ్చారు.

280 పంచాయ తీలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్లో ఉన్నట్లు గుర్తించారు. పుర, నగరపాలక సంస్థల్లో విలీనం చేసిన కొన్ని పంచాయతీల విషయంలోనూ కోర్టు కేసులు నమోదైన విషయాన్ని ఎన్నికల కమిషనర్కు నివేదించనున్నారు.

# దుర్గమ్మవారి భవనాలకు ఏకరూపక రంగులతో ముస్తాబు : కమిషనర్ ఆదేశం







అన్నదానం, ప్రసాదం పోటు భవనాల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్, మంత్రి సుభాష్, దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జులై 11, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్మాణంలో వున్న లడ్డూపోటు, అన్నదాన భవనాలను కమీషనర్ కె రామచంద్ర మోహన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లడ్డూపోటు సెల్లార్‌ను భక్తులకు త్వరగా అందుబాటులోకి తెవాలని ఆదేశించారు. ఈ మూడు భవనాలకు ఆహ్లాదకరమైన రంగులు ఏకరూపతతో వుండేలా వేయాలన్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా వుండాలన్నారు. ఆయనతో పాటు చైర్మన్ బొర్రా రాధా కృష్ణ, సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పి రాఘవరాజు, డిప్యూటీ ఇఒ కిషోర్ కుమార్, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు ఎల్ రమ, అసిస్టెంట్‌కమీషనర్ రంగారావు,తదితరులు పాల్గొన్నారు.

**15 నుండి ఆషాఢమాస ఉత్సవాలు:** దుర్గమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తూ ఆషాఢమాసంలో భక్తులు ఆరాధించే ఆషాఢమాస ఉత్సవాలు ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారికి ఆషాఢమాస సారె ను పలు భక్తబృందాలు అందిస్తాయని, ఆషాఢమాస ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలన్నారు.

**దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్:** దుర్గమ్మవారిని శనివారం మంత్రి వాసంసెట్టి సుభాష్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన రాయపాటి కోటి సుధాకర్ రు.1,08,616ల విరాళం శనివారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌కు అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ధవళేశ్వరం..మరింత పటిష్టం..

**కొత్తగేట్లు అమర్చే పనుల్ని రేపు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు**

**రూ.152.95కోట్లతో 117పాత ఫ్లడ్ గేట్ల స్థానంలో కొత్త గేట్లు**

**పిచ్చుకలంక గ్రామంలో రైతులతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి**

**అదే రోజున పోలవరం ప్రాజెక్టు పరిశీలన, అధికారులతో సమీక్ష**

**విజయవాడ, జూలై 11, ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు జీవనాడి ధవళేశ్వరం బ్యారేజీ మరో చారిత్రాత్మక ఘట్టానికి సిద్ధమవుతోంది. గోదావరి నదిపై నిర్మితమై లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగు నీరు అందిస్తోన్న ధవళేశ్వరం బ్యారేజీకి ప్రభుత్వం కొత్తగేట్లు అమర్చనుంది.

బ్యారేజీకు ఉన్న 117 గేట్లను మార్చాల్సి రావడంతో వాటి స్థానాల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు గేట్లను అమర్చే పనులకు ఈ నెల 13వ తేదీన సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట కొత్తగేట్ల అమరికకు ప్రభుత్వం రూ.152.95 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో పార్ట్1కు రూ.130.42 కోట్లు, పార్ట్2కు రూ.22.53 కోట్లు ఖర్చు చేయ నుంది. 117 పాత ఫ్లడ్ గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయనుంది. 12 హెడ్ స్లూయిజ్ గేట్ల బాటమ్ టియర్ షట్టర్లకు మరమ్మతులు చేయనున్నారు. 175 క్రస్ట్ గేట్లకు కొత్త రబ్బరు సీల్స్, 734 రోలర్ బేరింగ్స్ కొత్తవి అమర్చనున్నారు. 197 గేట్లకు వైర్ రోప్స్ మార్పు, సాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్, పార్ట్2 కింద 102 మాస్టర్ కంట్రోలర్ ప్యానెల్స్, 175 గేట్లకు ఎలక్ట్రికల్ కేబుల్స్ వైరింగ్ చేయనున్నారు. ఈ పనులను తీనిదివీలీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపట్టింది. ఈ మొత్తం పనులను తీనిదివీలీ ఇన్ఫ్రా సంస్థ రెండేళ్లలో పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించనుంది.

**వైసీపీ ప్రభుత్వం...నిలువెత్తు నిర్లక్ష్యం**

సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలో గత ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో ఆ ప్రాజెక్టుల రెండు గేట్లు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అయినా ప్రాజెక్టుల నిర్వహణపై నాటి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరించింది. ధవళేశ్వరం ఆనకట్ట విషయానికి వస్తే 2014లో రూ.31.77 కోట్లతో 58 గేట్లకు మరమ్మతులను నాటి టీడీపీ ప్రభుత్వం చేయించింది. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్యారేజ్ రక్షణపై తీవ్ర నిర్లక్ష్యం చూపింది. కనీస మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టలేదు.

దీంతో 2024లో ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు రిపేర్లకు గత ఏడాది జూన్ 30న పరిపాలనామోదం ఇచ్చింది. బ్యారేజీ గేట్లను అమర్చి 50 ఏళ్ల దాటడంతో ఆపరేటింగ్ మెకానిజం సర్వీస్ లైఫ్ ముగిసింది. బ్యారేజ్‌ను రెండుసార్లు సందర్శించిన సీడబ్ల్యూసీ మరమ్మతులకు సిఫార్సు చేయడంతో ప్రభుత్వ కొత్త గేట్లను అమర్చేందుకు నిర్ణయం తీసుకుంది.

**.ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు..**

ఉదయం 10.25 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి 11 గంటలకు వేమగిరి గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్దకు చేరుకుంటారు. 11.25 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నూతన గేట్ల ఏర్పాటు పనులను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడి నుంచి ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామానికి 11.45 గంటలకు చేరుకుని రైతులతో సమావేశమవుతారు.

సుమారు గంట పాటు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేర నున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలిస్తారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 05.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు సందర్శన ముగించుకుని అమరావతికి

# జాతీయ లోక్ అదాలత్‌లో 9,556 కేసుల పరిష్కారం

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి, జూలై11,ప్రభాతవార్త:** ఇరుపక్షాలకుఆమోద యోగ్యమైన రీతిలో కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ అత్యుత్తమ ప్రత్యామ్నాయ వేదిక అని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్మన్ (ఎఫ్ఏసీ), ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వేంకటేశ్వర రావు అన్నారు.లోక్ అదాలత్‌ను ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహనతో పాటు న్యాయ వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి జిల్లా కోర్టు ఆవరణ లోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 9,556 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 592 సివిల్ కేసులు, 8,964 క్రిమినల్ కేసులు ఉండగా, 137 ప్రీలిటిగేషన్ కేసులు కూడా రాజీ ద్వారా పరిష్కార మయ్యాయి. ఈ కేసుల పరిష్కారం ద్వారా మొత్తం రూ.55,32,21,094 (రూ.55.32 కోట్లు) విలువైన క్లెయిమ్‌లు, బకాయిలు, పరిహారాలు మరియు ఇతర వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై. శ్రీలక్ష్మి ్మ,రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.వి. ప్రసాద్, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకు అధికారులు,కక్షి దారులు పాల్గొన్నారు.

# నరసాపురం మున్సిపాలిటీకి రూ.212 కోట్లతో అభివృద్ధి పనులు

## పుష్కరాలకు రూ 64 కోట్లు మంజూరు

### ప్రతి ఇంటికి కుళాయి కోసం మొత్తం 125 కోట్లు
### మీడియా సమావేశంలో మంత్రి నారాయణ వెల్లడి



**నరసాపురం జూలై 11 ప్రభాతవార్త:** డబ్బులు లేకపోయినా.. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపారమైన పాలనా దక్షతతో రాష్ట్రంలో అభివృద్ధి పనులకు లోటు లేకుండా పనులు జరుగుతున్నాయని గత పుష్కరాల కన్నా ఈ పుష్కరాలకు అధికంగా నిధులు ఇచ్చి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో శనివారం రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పట్టణ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, పుష్కరాల ప్రధాన ఘాట్లు నరసాపురం మున్సిపల్ పరిధిలో ఉన్నందున భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని మంత్రి గారిని కోరారు.

దీనిపై స్పందించిన మంత్రి మీడియా సమావేశంలో పుష్కర నిధులు పై మాట్లాడారు. పుష్కరాల పనుల కోసం ఇప్పటికే రూ.15 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అర్బన్ చాలెంజ్ ఫండ్ ద్వారా రూ.34.50 కోట్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని వెల్లడించారు. ఈ నిధులతో నరసాపురం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.అదనంగా మరికొన్ని పథకాల ద్వారా మరో రూ.15 కోట్లు మున్సిపల్ అభివృద్ధికి కేటాయించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు ప్రతి ఇంటికి కుళాయి మంజూరు చేస్తూ స్వచ్ఛమైన నీటి కోసం ఈ మున్సిపాలిటీకి 125 కోట్లు మంజూరు కానున్నాయని ఈ పథకం కూడా త్వరలో అమలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, నరసాపురం మున్సిపాలిటీ అభివృద్ధి మరియు పుష్కరాల ఏర్పాట్ల కోసం దాదాపు రూ.64.50 కోట్ల నిధులు కేటాయించడం పట్టణ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన కొత్తపల్లి సుబ్బారాయుడు తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు , మున్సిపల్ రీజినల్ డైరెక్టర్, రాజమహేంద్రవరం, మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్: 25 ద్విచక్ర వాహనాల స్వాధీనం

**అనంతపురం క్రైమ్ జూలై 11 ప్రభాతవార్త:** నకిలీ తాళాల సాయంతో ఇళ్లు, ఆసుపత్రులు, ఇతర రద్దీ ప్రదేశాల్లోపార్కింగ్ చేసి ఉన్న మోటార్ సైకిల్ లను దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి వారి నుండి 25 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం అనంతపురం నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా సిఐ పుల్లయ్య, మాట్లాడారు. కళ్యాణదుర్గం రోడ్డు లోని నందమూరి నగర్ కు చెందిన బండారు మురళీకృష్ణ, ఇదే అనంతపురంలోని ఆర్కే నగర్ కు చెందిన హున్నూరు షేక్ అలీ అక్బర్ లు ఇద్దరూ కలిసి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో టూవీలర్లు దొంగతనాలకు పాల్పడేవారన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక చొరవ తీసుకొని సదురు దొంగలను పట్టుకునేందుకు కృషి చేశారు. ఇందులో భాగంగానే జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం ఇన్చార్జి డిఎస్పి, అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో అనంతపురం టు టౌన్ సిఐ పుల్లయ్య ఎస్సైలు చంద్రబాబు రామకృష్ణ పోలీస్ సిబ్బంది తమకు రాబడిన ప్రకాశ సమాచారంతో శనివారం ఉదయం నాయక్ నగర్ రైల్వే గేట్ దగ్గర వాహనాలు తనిఖీ చేయుచుండగా ప్రసన్నాయన పల్లి రైల్వే స్టేషన్ వైపు నుండి ఒక మోటార్ సైకిల్ పై ఇద్దరు నిందితులు అటువైపు అనుమానాస్పదంగా రావడానికి చూసి విచారించగా వారి విచారణలో ఇద్దరు వ్యక్తులు జల్సాలకు అలవాటు పడి చోరీలు చేసే వారమని అంగీకరించాలన్నారు. వారిని అరెస్టు చేసి వారి నుండి సుమారు 19 లక్షల రూపాయల విలువ చేసే 25 మోటార్ సైకిల్ లను రికవరీ చేశామన్నారు. ఈ కేసును సవాలుగా స్వీకరించి రికవరీ చేయడంతో పాటు ఇద్దరు దొంగలు అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా, టూ టౌన్ సీఐ పుల్లయ్య, టూ టౌన్ ఎస్ఐ లు రుశేంద్రబాబు రామకృష్ణ, సిబ్బంది అమరేశ్వర రావు, రమేష్ నాయక్, వన్నూరప్ప, పాండవ సుధాకర్, అంజన్ కుమార్, రామాంజనేయులను జిల్లా ఎస్పీ జగదీష్ ప్రశంసించారు.

# సిఎం సర్! నన్ను కాపాడండి

### తనపై 27 కేసులున్నాయని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన
### అనంతలో టీడీపీ కార్యకర్త కన్నీటి ఆవేదన



**అనంతపురం క్రైమ్ జులై 11 ప్రభాతవార్త :** సీఎం చంద్రబాబు నాయుడు సార్, మంత్రి లోకేష్ సార్, నన్ను కాపాడండి.. 2019 నుండి 2024 వరకు నాపై 27 కేసులు నమోదయ్యాయి. ఈ ఐదేళ్లలో నేను జైలు జీవితాన్ని అనుభవించాను. నా భార్య బిడ్డలు కూడా నన్ను చీదరించుకుంటున్నారు. నా జీవితం నాశనమైపోయిందంటూ అనంపురం జిల్లా అనంతపురం నగరంలోని ఓ టిడిపి కార్యకర్త రఫీ ఆక్రందన చేశాడు. నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయంప్రధాన ద్వారంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశాడు. అక్కడే వున్న టీడీపీ జెండా చేతబూని తనకు న్యాయం చేయాలంటూ కన్నీటి పర్యంతం అయ్యాడు. 27 కేసుల్లో జైలు జీవితం అనుభవించి భార్య బిడ్డలకు దూరమయ్యాయనంటూ ఎన్టీఆర్ విగ్రహం ముందు తన నిరసన గళాన్ని విప్పాడు. నా ప్రాణం పోయినా ఇక్కడి నుండి కదలనని ఆవేదన చెందాడు. 1982 టీడీపీ ఆవిర్భావం నుండి మా కుటుంబం టీడీపిలో వుంటూ పార్టీ అభివృద్ధికి పనిచేశామని వాపోయాడు. ఇక్కడ టీడీపి పార్టీకి అన్యాయం జరుగుతోందని వాపోయాడు. తమ గురించి ఏ ఒక్క నాయకుడు పట్టించుకోలేదని వాపోయాడు. ఈ విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు ఇతన్ని అక్కడ నుండి స్టేషన్కు తరలించారు.

12-07pg10_12-07pg10.qxd 12/Jul/26 12:00 AM Page 1






స్పెయిన్‌కు రెండో గోల్ అందించిన మైఖేల్ మెరినో

# బెల్జియంపై గెలుపుతో సెమీస్‌లో స్పెయిన్

**లాస్‌ఏంజిల్స్, జులై 11:** యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్... ఫిఫా వరల్డ్ కప్‌లో మరోసారి ఆధిపత్యాన్ని చెలాయించింది. సెమీస్ బెర్త్ అందుకుంది. లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో బెల్జియంపై 2-1 గోల్స్ తేడాతో స్పెయిన్ విజయం సాధించింది. 88వ నిమిషంలో బెల్జియం గోల్ కీపర్ సెన్నె లామెన్స్ చేసిన చిన్న పొరపాటును అందిపుచ్చుకున్న స్పెయిన్ ఆటగాడు మెరినో.. బంతిని నెట్‌లోకి పంపి స్పెయిన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. రెండోసారి సాకర్ వరల్డ్‌కప్ సెమీఫైనల్లో చేర్చాడు.

ఈ సాకర్ వరల్డ్‌కప్‌లో స్పెయిన్ అద్భుతమైన ఆట తీరు కొనసాగిస్తోంది. బెల్జియం కఠినమైన డిఫెన్స్‌తో అడ్డుకుంటున్నా, స్పెయిన్ ఆటగాళ్లు ఎక్కడా తొందర పాటు ప్రదర్శించలేదు. తమ సహజసిద్ధమైన పాసింగ్ గేమ్‌ను విడిచిపెట్టకుండా, గోల్ చేయడానికి సరైన అవకాశం వచ్చేంతవరకు ఓపికగా వేచి చూశారు. చివరికి వారు నమ్మిన వ్యూహమే వారిని గెలిపించింది. ఈ విజయంతో స్పెయిన్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వరుసగా 36 మ్యాచ్‌ల పాటు అజేయంగా నిలిచి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది.

**కీలకంగా మారిన యమాల్**

18 ఏళ్ల యువ సంచలనం లామిన్ యమాల్ హైలైట్‌గా నిలిచాడు. తొలి అర్ధభాగమంతా బెల్జియం డిఫెండర్లను యమాల్ ముప్పుతిప్పలు పెట్టాడు. కుడి వైపు నుంచి పెడ్రో పోర్రోతో కలిసి దాడులు చేయడం... డిఫెండర్లను ఛేధించుకుంటూ బాక్స్ వైపు దూసుకెళ్లడం ద్వారా బెల్జియంపై తీవ్ర ఒత్తిడి పెంచాడు. 30వ నిమిషంలో స్పెయిన్ సాధించిన తొలి గోల్‌లో యమాల్ చక్కని అసిస్ట్ ఉంది. అతని వైపు నుంచే ప్రారంభమైన దాడిని పెడ్రో పోర్రో లో క్రాస్‌గా మార్చగా, డాని ఓల్మో దాన్ని గోల్ చేయడానికి ప్రయత్నించాడు. బెల్జియం గోల్ కీపర్ కోర్టియోస్ తాకి రిబౌండ్ అయిన బంతిని రూయిజ్ అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపాడు. దీంతో స్పెయిన్ 1-0ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే మరో 11 నిమిషాలకే చార్లెస్ కెటెలెరే గోల్ చేసి బెల్జియంను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు.

**బెల్జియంకు శాపంగా గోల్ కీపర్ తప్పిదం**

స్పెయిన్ దూకుడును తట్టుకుని బెల్జియం మ్యాచ్‌లో యమాల్, మైకెల్ ఓయర్‌జబల్, డాని ఓల్మోలు కొట్టిన ప్రమాదకరమైన షాట్లను స్పెయిన్ గోల్‌కీపర్ తిబో కోర్టియోస్ అద్భుతమైన డైవ్‌లతో అడ్డుకున్నాడు. రెండో అర్ధ భాగం డ్రింక్స్ బ్రేక్‌కు ముందు కోర్టియోస్ తొడ గాయంతో మైదానం వీడాడు. కోర్టియోస్ స్థానంలో మైదానంలోకి వచ్చాన సెన్నె లామెన్స్ ఒత్తిడిని తట్టుకోలేకపోయాడు. 88వ నిమిషంలో స్పెయిన్ డిఫెండర్ పాకుబార్సి కొట్టిన సాధారణ షాట్ లామెన్స్ ముందు విచిత్రంగా బౌన్స్ అయింది. దాన్ని సరిగ్గా నియంత్రించలేకపోయిన లామెన్స్ బంతిని సిక్స్ యార్డ్ బాక్స్ వైపు పుష్ చేశాడు. అక్కడ అలర్ట్‌గా ఉన్న స్పెయిన్ సబ్‌స్టిట్యూట్ మైఖేల్ మెరినో మెరుపు వేగంతో బంతిని నెట్‌లోకి పంపాడు. ఈఒక్క పొరపాటు బెల్జియం ప్రపంచకప్ కలలను కల్లలు చేసింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత స్పెయిన్ జట్టు మళ్లీ సెమీఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. సెమీస్‌లో స్పెయిన్‌కు అసలైన పరీక్ష ఎదురుకానుంది. మంగళవారం ఆర్లింగ్టన్‌లో జరిగే సెమీఫైనల్లో ఫ్రాన్స్‌తో తలపడనుంది.

# మెస్సీ మాయాజాలమా.. స్విస్ సంచలనమా?



## నేటి క్వార్టర్ ఫైనల్లో అర్జెంటీనా-స్విట్జర్లాండ్ అమీతుమీ

## ఉదయం 6.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం

**కాన్సాస్‌సిటీ, జులై 11:** ఫిఫా ప్రపంచకప్ సెమీస్ స్టేజ్‌కు చేరుకుంటోంది. ఇప్పటికే మూడు క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి. మూడు సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. చివరి క్వార్టర్ ఫైనల్ ఈ రోజు కాన్సాస్‌సిటీ స్టేడియంలో జరగనుంది. ఫిఫా కప్ వేటలో ఉన్న డిపెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా.. పోరాట పటిమకు ప్రతీకగా నిలిచిన స్విట్జర్లాండ్‌తో క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ పోరులో విజేత సెమీఫైనల్‌లో అడుగుపెడుతుంది. ఒకవైపు లియోనెల్ మెస్సీ అనుభవం, అర్జెంటీనా దూకుడు... మరోవైపు స్విట్జర్లాండ్ క్రమశిక్షణ, సమిష్టి ఆట. దీంతో ఈ మ్యాచ్ టోర్నీలో అత్యంత ఉత్కంఠభరిత పోరుగా మారనుంది.

**అపజయం లేకుండా మెస్సీ టీమ్**

అర్జెంటీనా ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచింది. గ్రూప్ దశలో ఆధిపత్యం చాటిన ఆ జట్టు, నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ ఒత్తిడిని అధిగమిస్తూ ముందుకు సాగింది. లియోనెల్ మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా ఈ టోర్నీలో ఇప్పటివరకు అపజయం ఎరుగకుండా కొనసాగుతోంది. నాకౌట్ దశలో కేప్ వెర్డే, ఈజిప్ట్‌లపై కష్టపడి నెగ్గిన అర్జెంటీనా ఇప్పుడు మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. అర్జెంటీనా విజయాల్లో కెప్టెన్ లియోనెల్ మెస్సీ కీలక పాత్ర పోషిస్తున్నాడు. బంతి అతని కాళ్ల వద్ద ఉంటే ప్రత్యర్థి రక్షణలో అలజడి చెలరేగడం సహజం. గోల్స్ చేయడమే కాకుండా సహచర ఆటగాళ్లకు అవకాశాలు సృష్టించడంలోనూ మెస్సీ తన ప్రత్యేకతను మరోసారి చాటుతున్నాడు. అతనికి తోడుగా మార్టినెజ్, జూలియన్ అల్వారెజ్, ఎంజో ఫెర్నాండెజ్, అలెక్సిస్ మెక్ అలిస్టర్ వంటి ఆటగాళ్లు అద్భుత సమన్వయంతో జట్టును ముందుకు నడిపిస్తున్నారు. అర్జెంటీనా బలం కేవలం స్టార్ ఆటగాళ్లే కాదు. మిడ్‌ఫీల్డ్‌లో బంతిపై ఆధిపత్యం సాధించడం, వేగంగా దాడులు నిర్మించడం, అవసరమైన సమయంలో ఆట వేగాన్ని నియంత్రించడం ఆ జట్టు ప్రత్యేకత.


**పటిష్ట డిఫెన్స్‌తో స్విట్జర్లాండ్**

మరోవైపు స్విట్జర్లాండ్‌ను తక్కువ అంచనా వేయడం ప్రమాదకరం. ప్రపంచ ఫుట్‌బాల్‌లో భారీ జట్లను ఇబ్బంది పెట్టిన చరిత్ర ఆ జట్టుకు ఉంది. ఈటోర్నీలోనూ సమిష్టి ఆటతో క్వార్టర్ ఫైనల్‌కు వచ్చింది. నాకౌట్‌లో అల్జీరియాపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన స్విస్ జట్టు. ప్రిక్వార్టర్ ఫైనల్లో కొలంబియాపై పెనాల్టీ షూటౌట్‌లో అద్భుత మానసిక ధైర్యాన్ని ప్రదర్శించింది. స్విస్ కెప్టెన్ గ్రానిట్ షాకా మిడ్‌ఫీల్డ్‌లో జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. ఆటను నియంత్రించడం, ప్రత్యర్థి దాడులను అడ్డుకోవడం, వేగంగా కౌంటర్ అటాక్స్ ప్రారంభించడం అతని ప్రత్యేకత. ప్రత్యర్థికి అవకాశాలు ఇవ్వకుండా మ్యాచ్‌ను నియంత్రణలో ఉంచడం స్విస్ ఆటగాళ్ల నిపుణులు.

**మెస్సీ పైనే అందరి చూపు**

ఈ మ్యాచ్‌లో ప్రధానంగా అందరి దృష్టి మెస్సీపైనే ఉంటుంది. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అతని అనుభవం అర్జెంటీనాకు అతిపెద్ద బలం. కీలక సమయాల్లో మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థం అతనికి ఉంది. అయితే మెస్సీని అడ్డుకునేందుకు స్విట్జర్లాండ్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్క ఆటగాడితో కాకుండా సమిష్టిగా ఒత్తిడి తీసుకొచ్చి అతనికి ఖాళీలు ఇవ్వకుండా చూడాలని స్విస్ జట్టు భావిస్తోంది. మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించడంలో మిడ్‌ఫీల్డ్ పోరు కీలకం కానుంది. బంతిపై ఆధిపత్యం సాధించిన జట్టుకే ఎక్కువ అవకాశాలు లభించే అవకాశం ఉంది. అలాగే సెట్‌పీస్‌లు, కార్నర్లు, ఫ్రీకిక్స్ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం కూడా విజయంలో కీలక పాత్ర పోషించవచ్చు. మెస్సీ మరోసారి తన మాయాజాలంతో అర్జెంటీనాను సెమీఫైనల్‌కు చేర్చుతాడా? లేక స్విట్జర్లాండ్ మరో సంచలన విజయంతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది.

# వింబుల్డన్ ట్రోఫీ నెగ్గిన నోస్కోవా



**లండన్, జులై 11:** అన్‌సీడెడ్ చెకొస్లొవేకియా ప్లేయర్ లిండా నోస్కోవా సంచలనం కొనసాగింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో చెకొస్లొవేకియాకు చెందిన 8వ సీడ్ కరోలినా ముచోవాపై మూడు సెట్ల పోరులో 6-2, 5-7, 6-3తో ఓడించింది. ఫైనల్ చేరిన తొలి సారే వింబుల్డన్ ట్రోఫీ అందుకుంది. కాగా రెండోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరినా ముచోవా ట్రోఫీ ఆశలు కల్లలయ్యాయి. తొలి సెట్‌ను అలవోకగా నెగ్గిన నోస్కోవాకు రెండో సెట్‌లో ముచోవా పుంజుకుని గట్టి పోటీ ఇచ్చింది. సెట్‌ను నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో నోస్కోవా.. ప్రత్యర్థి సర్వీసును రెండు సార్లు బ్రేక్ చేసి 6-3తో సెట్‌ను, గేమ్‌ను ముగించింది. 2024 ఆస్ట్రేలియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ వరకు వచ్చిన నోస్కోవా... ఈ సారి ఏకంగా వింబుల్డన్ ట్రోఫీ పట్టేసింది.

# టీ20 సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్



**సౌథాంప్టన్, జులై 11:** టీ20 ప్రపంచ ఛాంపియన్లు టీమిండియా.. వరుసగా రెండో సిరీస్ కోల్పోయింది. అయిదో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 56 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి అయిదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-0తో క్లీన్ స్వీప్ చేసింది. 258 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఈ మ్యాచ్‌లోనూ తడబడింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(3) నిరాశపరచగా, వైభవ్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన సంజూ కూడా 27 రన్స్ చేసి అవుటయ్యాడు. ఇషాన్ కిషన్(35 బంతుల్లో 56), తిలక్ వర్మ(25 బంతుల్లో 53) అర్ధసెంచరీలతో రాణించారు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 28 రన్స్, శివమ్ దూబే 14 రన్స్ చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో కుర్రాన్ 3 వికెట్లు, అదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టాడు.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 257 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫిల్ సాల్ట్(6)ను ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. జోస్ బట్లర్(64 బంతుల్లో 131), కెప్టెన్ హారీ బ్రూక్స్(45 బంతుల్లో 95 నాటౌట్) చెలరేగి ఆడారు. సిక్స్‌లు, ఫోర్ల వర్షం కురిపించారు. రెండో వికెట్‌కు రికార్డు స్థాయిలో 233 రన్స్ జోడించారు. భారత బౌలర్లలో దూబే రెండు వికెట్లు తీశాడు.

# ఫెడ్‌రిజర్వ్‌లో భారత సంతతి ప్రముఖులు!



**వాషింగ్టన్, జులై 11:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) ఛైర్మన్ కెవిన్‌వార్ష్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన (మానిటరీ పాలసీ)వ్యవస్థను సమీక్షించి, కీలక సంస్కరణలను సూచించేందుకు ఏర్పాటు చేసిన ఐదు టాస్క్‌ఫోర్స్ ప్రముఖుల పేర్లను ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లలో అకడమిక్ నిపుణులు, మాజీ కేంద్ర బ్యాంకు గవర్నర్లు, కార్పొరేట్ రంగ ప్రముఖులతో పాటు భారత సంతతికి చెందిన ముగ్గురు ప్రముఖులకు కీలక బాధ్యతలు అప్పగించారు. మాజీ ఆర్‌బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్, హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ రాజ్ చెట్టి, మైక్రోసాఫ్ట్ ఎక్స్‌బాక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశా శర్మ ఈజాబితాలో ఉన్నారు. టాస్క్‌ఫోర్స్‌ల నాయకత్వాన్ని ప్రకటిస్తూ కెవిన్ వార్ష్, “ప్రస్తుత కీలక సమయంలో ఫెడరల్ రిజర్వ్ తన లక్ష్యాలను మరింత సమర్థంగా సాధించేలా సంస్థను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం“ అని తెలిపారు.

భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్, కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు రఘురామ్ రాజన్‌కు “బ్యాలెన్స్ షీట్ పాలసీ“ టాస్క్‌ఫోర్స్‌కు సహనాయకత్వ బాధ్యతలు అప్పగించారు. ఫెడరల్ రిజర్వ్ అమలు చేస్తున్న ప్రస్తుత బ్యాలెన్స్ షీట్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, వ్యయాలు, సంస్థాగత ప్రభావాలను ఈ బృందం సమగ్రంగా పరిశీలించి మార్పులపై సిఫార్సులు చేయనుంది. ప్రస్తుతం చికాగో విశ్వవిద్యాలయం బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో కేథరిన్ దుసాక్ మిల్లర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్, 2005లో జాక్సన్ హోల్‌లో జరిగిన ఫెడరల్ రిజర్వ్ సమావేశంలో అమెరికా బ్యాంకుల సబ్‌ప్రైమ్ రుణాల ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందారు. అనంతరం 2008లో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి సంబంధించిన ఆయన హెచ్చరికలు నిజమయ్యాయి. భారత సంతతి ఆర్థికవేత్త రాజ్ చెట్టిని “లిక్విడిటీ డిపెండెన్స్“ప్యానెల్‌కు ఎంపిక చేశారు. హార్వర్డ్ యూనివర్సిటీలోని “ఆపర్చునిటీ ఇన్‌సైట్స్“ సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న చెట్టి, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు జీవితంలో విజయవంతం కావడానికి అవసరమైన విధానాలపై పరిశోధనలు చేస్తున్నారు. హార్వర్డ్ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ జెరెమీ స్టెయిన్, వాల్‌మార్ట్ మాజీ అధ్యక్షుడు, సీఈఓ డగ్ మెక్‌మిలన్, చికాగో విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ కెవిన్ మర్ఫీతో కలిసి ఫెడరల్ రిజర్వ్ ప్రస్తుత బ్యాలెన్స్ షీట్ విధానం ప్రభావాలను ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగం ఎక్స్‌బాక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న భారత సంతతి ఆశా శర్మకు “ప్రొడక్టివిటీ అండ్ ఎంప్లాయ్‌మెంట్“ టాస్క్‌ఫోర్స్ నాయకత్వం అప్పగించారు. ఇటీవల మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగంలో భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపులు జరిగిన నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత సంతతి అమెరికన్ ఆశా.. మెటా, ఈకామర్స్ సంస్థ కూపాంగ్, గ్రోసరీ డెలివరీ సంస్థ ఇన్‌స్టాకార్ట్, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ సంస్థ హోమ్ డిపో వంటి కంపెనీల్లో కీలకబాధ్యతలు నిర్వహించారు. ఈటాస్క్ ఫోర్స్‌లో హోరోవిట్జ్ సహ వ్యవస్థాపకుడు మార్క్ ఆండ్రీసెన్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ చార్లెస్ “చాడ్“ జోన్స్ సహఅధ్యక్షులుగా వ్యవహరించనున్నారు.

# 1.7 కోట్లకు పైగా ఐటి రిటర్నులు దాఖలు



**ముంబయి, జులై 11:** ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అసెస్‌మెంట్ ఇయర్ 2026-27 కోసం ఇప్పటివరకు 1.7 కోట్లకు (17 మిలియన్ల) పైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ శనివారం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంపాదించిన ఆదాయానికి సంబంధించిన ఐటీఆర్1 సహజ్, ఐటీఆర్2 రిటర్నులు దాఖలు చేయడానికి జూలై 31చివరితేదీ అని శాఖ మరోసారి గుర్తు చేసింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ, అసెస్‌మెంట్ సంవత్సరం 2026-27 కోసం ఇప్పటికే 1.7 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు తమ ఐటీఆర్‌లను దాఖలు చేసి ముందడుగు వేశారు“ అని పేర్కొంది. ఇప్పటివరకు దాఖలైన రిటర్నుల్లో శుక్రవారం ఒక్కరోజే 10 లక్షలకు పైగా ఐటీఆర్‌లు దాఖలుచేసినట్లు వెల్లడించింది. ఐటీఆర్1 (సహజ్) చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారుల కోసం రూపొందించిన సరళమైన రిటర్న్ ఫారమ్. ఏటా రూ.50 లక్షల వరకు ఆదాయం కలిగిన నివాస భారతీయ వ్యక్తులు, జీతం ద్వారా ఆదాయం పొందేవారు, ఒకే ఒక్క గృహ ఆస్తి నుంచి ఆదాయం ఉన్నవారు, అలాగే వ్యవసాయ ఆదాయం సంవత్సరానికి రూ.5,000 వరకు ఉన్నవారు ఈ ఫారమ్‌ను ఉపయోగించి రిటర్నులు దాఖలు చేయవచ్చు. ఇక ఐటీఆర్2ను వ్యాపారం లేదా వృత్తి ద్వారా లాభాలు, ఆదాయం లేని వ్యక్తులు మరియు హిందూ అవిభక్త కుటుంబాలు దాఖలు చేస్తారు. అయితే, వీరికి మూలధన లాభాల ఆదాయం ఉన్నప్పుడు ఈఫారమ్ వర్తిస్తుంది.




# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు తొమ్మిది నోటీసులు

**న్యూఢిల్లీ, జులై 11:** దేశ ఆహార భద్రత నియంత్రణ సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శనివారం స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు 9నోటీసులు జారీ చేసింది. కస్టమర్లనుంచి వచ్చిన పలుమార్లు ఫిర్యాదుల ఆధారంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించిన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ, ఈ చర్యలు చేపట్టింది. వినియోగదారులకు గడువు ముగిసిన, పాడైన, కుళ్లిపోయిన, కలుషితమైన, మానవ వినియోగానికి అనర్హమైన ఆహార ఉత్పత్తులు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో, సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ సమగ్ర వివరణతో పాటు నిబంధనల అమలుపై నివేదిక సమర్పించాలని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశించింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విక్రయించిన గుడ్లు, సంస్థకు ఉన్న ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్‌లో అనుమతి పొందిన ఉత్పత్తుల జాబితాలో లేకపోయినప్పటికీ మార్కెటింగ్ చేసినట్లు గుర్తించింది. చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌లో ఆ ఉత్పత్తి చేర్చే వరకు విక్రయాలు నిలిపివేయాలని, అవసరమైతే లైసెన్స్ సవరణకు దరఖాస్తు చేయాలని ఆదేశించింది. (1 కిలో) మరియు హోంస్టైల్ మద్రాస్ మిక్చర్ పీనట్స్ ఉత్పత్తులు గడువు ముగిసిన తర్వాత కూడా వినియోగదారులకు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. గడువు ముగిసిన, కుళ్లిపోయిన, దుర్వాసన వెదజల్లుతున్న, కలుషితమైన గుడ్లు సరఫరా చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి.


# వచ్చే రెండేళ్లలో 210 కంపెనీల ఐపిఒలు




**ముంబయి, జులై 11:** భారత స్టాక్ మార్కెట్లకు వచ్చే రెండేళ్లో టాప్‌కంపెనీలు మార్కెట్లోకి ఐపీఓ ద్వారా ఎంట్రీ ఇవ్వనున్నాయి. కన్సల్టింగ్ సంస్థ రెడ్సీర్ అంచనా ప్రకారం వచ్చే రెండేళ్లలో సుమారు 210 కొత్త కంపెనీలు ఐపిఒలకు రెడీ అవుతున్నాయి. కొత్త తరం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ జూలైలో ఉన్న 150 బిలియన్ డాలర్ల నుండి 2030 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని తెలిపింది. వచ్చే దశాబ్దం చివరి నాటికి కొత్త లిస్టింగ్‌ల వల్ల భారతదేశ ఈక్విటీ మార్కెట్లో కొత్త తరం కంపెనీల వాటా 3 శాతం నుండి 11.5 శాతానికి పెరుగుతుందని ఆ సంస్థ ఒక నివేదికలో అంచనా వేసింది. దీనితో ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై సమీకరించిన నిధుల విషయంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మూడవ స్థానంలోను, వృద్ధి రేటు విషయంలో మొదటి స్థానంలో నిలుస్తుంది. గతంలో ఐపీఓ మార్కెట్ అటువంటి కొత్త తరం కంపెనీల వృద్ధికి ప్రతిఫలమిచ్చిందని కానీ ఇప్పుడు అది లాభదాయకమైన వృద్ధిని కోరుకుంటోందని, లిస్టింగ్ అయిన 20 కంపెనీలలో 14 లాభదాయకంగా ఉన్నాయి. వారి ఐపీఓల ధరలను, గత ప్రైవేట్ రౌండ్ల ఆధారంగా కాకుండా.. అదే తరహా లిస్టెడ్ కంపెనీల ఆధారంగా నిర్ణయిస్తున్నారు.

దీనివల్ల, లిస్టింగ్ సమయంలో ఒక కంపెనీ చేసుకునే సన్నాహాలు.. భవిష్యత్ రాబడులను మరింత మెరుగ్గా అంచనా వేయడానికి వీలవుతుందని నివేదిక తెలిపింది గత ఏడాది మొత్తం కంటే 2026 క్యాలెండర్ సంవత్సరం ద్వితీయార్థంలోనే ఎక్కువ నిధులు సమీకరించబడతాయని కేవలం ఆరు నెలల్లోనే 19 నుంచి 22 బిలియన్ డాలర్లు సేకరిస్తాయని నివేదిక అంచనా వేస్తోంది. 200కుపైగా కంపెనీలు పబ్లిక్ మార్కెట్లలో నిధులు సమీకరించడానికి సిద్ధమవుతుండగా వాటిలో 150కి పైగా కంపెనీలు మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన సెబీ నుండి ఇప్పటికే ఆమోదం పొందాయి. దశాబ్దంలో భారత్‌లోని ప్రధాన ప్లాట్ఫారమ్లపై ఐపీఓలు 8 రెట్లు పెరిగాయని.. ఇందులో ఐదేళ్లలో 300కి పైగా కొత్త లిస్టింగ్లు కూడా ఉన్నాయని నివేదిక పేర్కొంది. బలమైన దేశీయ మూలధనం, అధిక కార్పొరేట్ ఆదాయాలు, మెరుగైన నిష్క్రమణ అవకాశాలు, అనుకూలమైన నియంత్రణ వంటివి ఈ వృద్ధికి తోడ్పడ్డాయని కన్సల్టింగ్‌సంస్థ రెడ్సీర్ నివేదిక తెలిపింది.

# డీమార్ట్ నికరలాభం రూ.936 కోట్లు




**ముంబై, జులై11:** డీమార్ట్ నిర్వహణ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ తొలి త్రైమాసికంలో నికరలాభం వార్షిక ప్రాతిపదికన12.8 శాతం పెరిగి 936కోట్లకు చేరినట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.830 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ విశ్లేషకులు రూ.964 కోట్ల లాభాన్ని అంచనా వేయగా, కంపెనీ ఫలితాలు దానికి స్వల్పంగా తక్కువగా నమోదయ్యాయి. కంపెనీరాబడులు కూడా 15.1శాతం పెరిగి రూ.18,343 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ ఆదాయం రూ.15,932 కోట్లుగా ఉంది. కంపెనీ విస్తరణతో పాటు వినియోగదారుల కొనుగోళ్లు పెరగడం ఆదాయ వృద్ధికి దోహదపడినట్లు తెలిపింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు లాభం 16.2 శాతం పెరిగి రూ.1,526 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.1,313 కోట్లుగా నమోదైంది.

మార్కెట్ అంచనా రూ.1,517 కోట్లుగా ఉండగా, కంపెనీ దానిని స్వల్పంగా అధిగమించింది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 8.2 శాతం నుంచి 8.3 శాతానికి స్వల్పంగా మెరుగుపడింది. కంపెనీ లైక్‌ఫర్‌లైక్ విక్రయాల వృద్ధి తొలి త్రైమాసికంలో 5.5 శాతంగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 7.1 శాతంగా ఉండటం గమనార్హం. ఈ త్రైమాసికంలో డీమార్ట్ స్టోర్లలో మొత్తం 11 కోట్ల బిల్లులు ప్రాసెస్ చేయగా, గత ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 9.7 కోట్లుగా ఉంది. అదనంగా, కంపెనీ రూ.1,000 కోట్ల వరకు నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు జారీ చేసి నిధులు సమీకరించేందుకు ఆమోదం తెలిపింది.

# 20వేల కోట్లకు పెరిగిన హిండాల్కో అల్యూమినా పెట్టుబడి




**ముంబయి, జులై 11:** ఆదిత్య బిర్లా గ్రూప్ ఒడిశాలో తన పెట్టుబడులను మరింత విస్తరించింది. రాయగడ జిల్లాలోని కన్సరిగూడలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీ ప్రాజెక్టు విస్తరణ కోసం అదనంగా రూ.12,000 కోట్ల పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనపై శనివారం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా సమావేశమై చర్చించారు. ఈ విస్తరణతో రిఫైనరీ సామర్థం ప్రస్తుతం ప్రతిపాదించిన సంవత్సరానికి 10 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు పెరగనుంది. దీంతో ప్రాజెక్టులో మొత్తం పెట్టుబడి రూ.20 వేల కోట్లకు చేరనుంది.

ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన లోహ రంగ ప్రముఖ సంస్థ హిండాల్కో ఇండస్ట్రీస్ ఈ గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీని అభివృద్ధి చేస్తోంది. తొలుత ఈ ప్రాజెక్టును సంవత్సరానికి 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థంతో, సుమారు రూ.8,000 కోట్ల పెట్టుబడితో ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రాజెక్టు దీర్ఘకాలిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని సంస్థ ఇప్పుడు మరో రూ.12,000 కోట్ల పెట్టుబడితో అదనంగా సంవత్సరానికి 20 లక్షల టన్నుల శుద్ధి సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఈ విస్తరణ వల్ల ప్రత్యక్ష, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడటంతో పాటు స్థానిక పారిశ్రామికవేత్తలు, సేవల రంగ సంస్థలు, అనుబంధ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని కంపెనీ పేర్కొంది. అలాగే ఈ ప్రాజెక్టు విస్తరణతో ఒడిశాలో అల్యూమినియం డౌన్‌స్ట్రీమ్ పరిశ్రమల అభివృద్ధికి ఊతం లభించనుంది. అల్యూమినియం విలువ ఆధారిత ఉత్పత్తుల శ్రేణిలో రాష్ట్రం మరింత వాటాను దక్కించుకునేందుకు ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps